
'మట్టిని నమ్ముకున్న వ్యక్తి
రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 314

శనివారం 4-2-2023



'జెయింట్స్' హెడ్ కోచ్‌గా రేచల్

వచ్చే నెల 4 నుంచి ముంబైలో మహిళల ప్రీమియర్ లీగ్ -10లో



పక్కాగా నియంత్రణ సంస్థలు

నియంత్రణ సంస్థలు కచ్చితత్వంతో పని చేస్తాయన్న కేంద్ర ఆర్థిక మంత్రి -10లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఒరిజినల్ రికార్డులివ్వండి..

బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధానికి సంబంధించిన ఒరిజినల్ రికార్డులు సమర్పించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.


- వివరాలు 6లో▶



ఎన్‌ఐఏకి బెదిరింపు మెయిల్

ముంబైలో తాలిబన్‌కు చెందిన ఉగ్రవాది దాడి చేయనున్నట్లు ఎన్‌ఐఏకి మెయిల్ అందినట్టు ముంబై పోలీసులు తెలిపారు.

- వివరాలు 6లో▶



ఇబ్బందికరంగా కేంద్రం తీరు

కొలీజియం సిఫార్సులను కేంద్రం తొక్కిపెడుతున్న తీరుపై సుప్రీం కోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

- వివరాలు 6లో▶



'ఎయిరిండియా'లో మంటలు

అబుదాబి–కోజికోడ్ ఎయిరిండియా విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే మంటలు చెలరేగాయి.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

ఈసారి 20 అంశాలు..



ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో 20 అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు సమయమివ్వాలని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

- వివరాలు 2లో▶

బీజేఎల్పీ నేత నియామకంలో జాప్యమెందుకు?



బీజేపీ శాసనసభాపక్ష నేత, జీహెచ్‌ఎంసీతో పాటు కరీంనగర్ కార్పొరేషన్‌కు ఫ్లోర్‌లీడర్ల నియామకంలో జాప్యమెందుకనే చర్చ ఆ పార్టీలో జరుగుతోంది. బీజేఎల్పీ నేతను ప్రకటించకపోవడంతో సభలో ఎలా వ్యవహరించాలనే దానిపై సభ్యుల్లో అయోమయం నెలకొందని అంటున్నారు.

- వివరాలు 2లో▶

పాత ప్రాజెక్టులకే పచ్చజెండా



కేంద్ర బడ్జెట్‌లోని రైల్వే పద్దులో మోదీ ప్రభుత్వం ఈసారి తెలంగాణకు కొత్తగా ఎలాంటి ప్రాజెక్టులు ప్రకటించలేదు. కనీసం కొత్త లైన్లు, సర్వేలను సైతం ప్రస్తావించలేదు. కేవలం పాత ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులతోనే సరిపెట్టింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టులకు గత బడ్జెట్‌తో పోలిస్తే కేటాయింపులు మెరుగ్గా ఉండటం ఊరటనిచ్చే అంశం.

- వివరాలు 3లో▶

NECC National Egg Co-ordination Committee | Venkateshwara Chicken
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate				
₹ 56 per dozen	Ex Farm Live Bird	85 kg	Dressed with Skin	155 kg
	Retail Live Bird	107 kg	Skin Less	177 kg

Issued in the interest of consumers

నా సర్కారు అగ్రగామి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభోత్సవ ప్రసంగంలో గవర్నర్ తమిళిసై



◀ తమిళిసైకి స్వాగతం పలికి అసెంబ్లీ హాలులోకి తోడ్కొని వెళ్తున్న సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి

సంక్షేమం, అభివృద్ధిలో ప్రగతి పథంలో తెలంగాణ

అత్యంత బలీయమైన ఆర్థికశక్తిగా ఎదుగుదల

సమ్మిళిత, సమగ్రాభివృద్ధిలో దేశానికే ఆదర్శం

- సవాళ్లు, అవరోధాలను దీటుగా ఎదుర్కొంది
- ప్రజల ఆశీస్సులు, సీఎం పాలన దక్షతతోనే అపూర్వ విజయాలు
- తెలంగాణ అభివృద్ధి మోడల్‌పై దేశవ్యాప్త చర్చ
- ఇదే స్ఫూర్తి, నిబద్ధతతో నా ప్రభుత్వం ముందుకు..
- ఆర్థిక మాంద్యంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల తొలగింపు .. తెలంగాణ ప్రభుత్వం మాత్రం కొలువుల జాతర పెట్టిందని వ్యాఖ్య
- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడి

13 వరకు బడ్జెట్ సమావేశాలు

నేడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు.. 6న బడ్జెట్ ప్రసంగం, 8న బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ

2 లో

గవర్నర్‌కు సాదర స్వాగతం

ఆహ్వానం పలికిన సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం, చైర్మన్ గుత్తా

సాక్షి, హైదరాబాద్: ''సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాలుగా నా ప్రభుత్వం ప్రగతిపథంలో వేగంగా పయనిస్తోంది. ఎనిమిదిన్నరేళ్ల వయసున్న తెలంగాణ సాధిస్తున్న సమ్మిళిత సమగ్రాభివృద్ధి యావత్ దేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ప్రతి రంగంలోనూ దేశం ఆశ్చర్యపోయే రీతిలో అద్భుత ప్రగతిని ఆవిష్కరిస్తూ పురోగమిస్తోంది. అత్యంత బలీయమైన ఆర్థిక శక్తిగా.. సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా రూపుదాల్చింది'' అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం ఆమె ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ప్రసంగ పాఠం మేరకు వివరాలను వెల్లడించారు. 2014–15లో తెలంగాణ

మిగతా 2వ పేజీలో ▶

> తెలంగాణను అగాధం నుంచి ఆదర్శవంత పరిస్థితికి చేర్చే ప్రయత్నంలో నా ప్రభుత్వం అనేక సవాళ్లు, అవరోధాలను దీటుగా ఎదుర్కొంది. అస్పష్టతలను ఛేదించింది. ప్రజల ఆశీస్సులు, ముఖ్యమంత్రి పాలనా దక్షత, ప్రజాప్రతినిధుల నిరంతర కృషి, ప్రభుత్వ సిబ్బంది అంకితభావంతోనే అపూర్వ విజయాలను సాధించింది. రాష్ట్ర అభివృద్ధి మోడల్ గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇదే స్ఫూర్తి, నిబద్ధతతో నా ప్రభుత్వం ముందుకు సాగుతుంది.



సచివాలయం వెనుకవైపు అలుముకున్న పొగలు

కొత్త సచివాలయంలో అగ్నిప్రమాదం..

లోయర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

అక్కడ ఉన్న వ్యర్థాలకు అంటుకోవడంతో ఎగసిన అగ్నికీలలు

- రెండో అంతస్తు వరకు వ్యాపించిన పొగ
- ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేదన్న పోలీసులు
- ప్రారంభోత్సవం యథాతథం అన్న అధికారులు

సాక్షి, హైదరాబాద్/ ఖైరతాబాద్: హుస్సేన్‌సాగర్ తీరాన తుది మెరుగులు దిద్దుకుంటున్న తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీనివల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని, కేవలం నాలుగు ఫ్లోర్లు పొగ చూరాయని పోలీసులు తెలిపారు. స్వల్ప మరమ్మతులు మాత్రమే అవసరమవుతాయని, సచివాలయ ప్రారంభోత్సవం వాయిదా వేయాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. సచివాలయ ప్రారంభోత్సవ సమయం దగ్గరపడుతుండటంతో భవన నిర్మాణ సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనులు చేస్తున్నారు. మింట్ కాంపౌండ్ వైపు ఉన్న

మిగతా 3వ పేజీలో ▶

నిర్లక్ష్యమే కాల్చేస్తోంది..!

కొత్త సచివాలయం పరిశీలనకు యత్నం

అగ్నిప్రమాదం నేపథ్యంలో కాంగ్రెస్ నేతల ఆందోళన

- వివరాలు 3లో▶

కళాతపస్వికి కన్నీటి వీడ్కోలు



ప్రముఖ దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్‌కు అశేష అభిమానగణం కన్నీటి వీడ్కోలు పలికింది. ఆయన అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం పంజగుట్ట హిందూ శ్మశానవాటికలో జరిగాయి. శుక్రవారం ఆయన నివాసం నుంచి పంజగుట్ట శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగింది. అంతకుముందు ఆయనకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. కళాతపస్విని కడసారి చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

5 లో




విశ్వనాథ్ అంతిమయాత్ర దృశ్యం..

శ్రుతి లయలే జననీ జనకులు కాగా 11 లో

డొక్కు వాహనాలు తుక్కుకే..

దేశవ్యాప్తంగా 4.50 కోట్లకు పైగా పాత వాహనాలు

6 లో



దేశంలో 4.50 కోట్లకు పైగా పాత వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. కాలుష్యానికి కారణమవుతున్న వీటిని రోడ్లపైకి అనుమతించరాదని నిపుణులు చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన 9 లక్షలకుపైగా డొక్కు వాహనాలను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి తుక్కు(స్క్రాప్)గా మార్చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవలే ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు అందుబాటులో ఉన్న విధానాలపై కథనం..

బిల్లును ఓకే చేయించి.. అవిశ్వాసాలు ఆపేలా!

పురపాలికల్లో 'లొల్లి'కి చెక్ పెట్టేందుకు సర్కారు ప్రయత్నాలు

- మేయర్లు, చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీలో తీర్మానం
- సదరు బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్
- ఇదే అదనుగా పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాల నోటీసులు
- గవర్నర్ ద్వారా బిల్లు ఆమోదింపజేసి వాటిని ఆపాలని ప్రభుత్వ యోచన



13 లో



ఖర్గే చాంబర్‌లో శుక్రవారం సమావేశమైన వివిధ పార్టీల నేతలు

'అదానీ'పై అదే రగడ

ఏకతాటిపైకి విపక్షాలు.. ఉభయసభల్లో ఆందోళన

సోమవారానికి పార్లమెంట్ వాయిదా

6 లో

అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు, తద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్ల పతనం కారణంగా తలెత్తిన పరిస్థితులపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ ప్రారంభించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మిగతా సభా కార్యకలాపాలను పక్కనపెట్టి హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాల్సిందేనంటూ ప్రతిపక్షాలన్నీ పట్టుబట్టడంతో వరుసగా రెండోరోజూ ఎలాంటి చర్చలు లేకుండానే ఉభయసభలు వాయిదా పడ్డాయి. అంతకుముందు కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో విపక్ష నేతలు భేటీ అయ్యారు.





క్లుప్తంగా...

'గవర్నర్‌కు, సీఎంకు మధ్య రాజీ కుదిరినట్లుంది'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఇన్నాళ్లూ బయట పులిలా గాండ్రించి.. అసెంబ్లీలో మాత్రం పిల్లిలా ప్రసంగం చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. దీన్ని బట్టి చూస్తుంటే గవర్నర్‌కు, సీఎం కేసీఆర్‌కు మధ్య రాజీ కుదిరినట్లుందని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన మైక్ ఎక్కడ కట్ చేస్తారోనని ప్రభుత్వం రాసి ఇచ్చింది గవర్నర్ చదివారని వ్యాఖ్యానించారు. బీజేపీలో బీ ఉందని, బీఆర్ఎస్‌లో కూడా బీ ఉందని, గవర్నర్ మరో బీగా తయారయ్యారని అన్నారు.

20 రోజులు జరపాలి: ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలను 20 రోజులకుపైగా నిర్వహించాలని ఏఐఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. మైనారిటీ సంక్షేమం, హైదరాబాద్ పాతబస్తీ అభివృద్ధి సహా తాము ప్రతిపాదిస్తున్న 25 అంశాలపై స్వల్పకాలిక చర్చ జరపాలని లేఖలో కోరారు. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో డిసెంబర్‌లో వారంపాటు శీతాకాల సమావేశాలు జరుపుతామని హామీ ఇచ్చినా నెరవేరలేదని ఆయన గుర్తుచేశారు.

రేవంత్‌తోపాటు సంజయ్‌నూ ఆహ్వానిస్తున్నా: సుధీర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని వస్తున్న వార్తలపై ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పందించారు. 'టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఒక్కరే కాదు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను కూడా నా మీద ఎల్‌బీనగర్‌లో పోటీకి ఆహ్వానిస్తున్నా. నియోజకవర్గంలో నేను చేసినంత అభివృద్ధి ఎవరి హయాంలోనూ జరగలేదు'అని వ్యాఖ్యానించారు.

ఏం మాట్లాడినా నోటీసులు ఇస్తున్నారు: రాజాసింగ్



సాక్షి, హైదరాబాద్: 'కోర్టు సూచనల మేరకు నేను వివాదాస్పద వ్యాఖ్యలేవీ చేయడం లేదు. అయినా నేను మాట్లాడిన వాటికి పెడార్థాలు తీస్తూ పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నారు. జైల్లో గడపడంతో పది కిలోల బరువు పెరిగా, అక్కడ శారీరక శ్రమకు అవకాశం లేకుండా పోయింది. బ్యారక్‌లో నేనొక్కడినే ఉండేవాడిని. కేవలం చిన్న టీవీ సెట్టు ఒకటి ఉండేది. బరువు తగ్గేందుకు ప్రయత్నాలు చేస్తున్నా. పార్టీ నాపై విధించిన సస్పెన్షన్ కొనసాగుతుందో లేదో తెలియదు. ఒక హిందువుగా కాషాయ లాల్చీ వేసుకున్నా. పార్టీ జెండా రంగుకు దీనికి సంబంధం లేదు' అని వ్యాఖ్యానించారు.

సభకు రాని శ్రీధర్‌బాబు, సీతక్క

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలి రోజైన శుక్రవారం ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క శుక్రవారం సభకు రాలేదు. కాంగ్రెస్ కర్ణాటక ఇన్‌చార్జిగా ఉన్నందున శ్రీధర్‌బాబు, ఈ నెల 6న తన నియోజకవర్గం నుంచి ప్రారంభమయ్యే హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఏర్పాట్ల కోసం సీతక్క హాజరుకాలేదని తెలిసింది.

భట్టిని బీఏసీకి తోడ్కొని వెళ్లిన చీఫ్ విప్..

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం అనంతరం జరిగిన బీఏసీ సమావేశానికి వెళ్లేందుకు తన కార్యాలయం నుంచి బయటకు వచ్చిన సీఎల్పీ నేత భట్టికి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఎదురయ్యారు. భట్టికి సాదరంగా నమస్కరిస్తూ 'సార్... బీఏసీ సమావేశానికి రండి'అని ఆహ్వానించారు. ఇందుకు భట్టి స్పందిస్తూ తమకు బయట ఇవ్వాల్సిన ప్రొటోకాల్ ఇవ్వకుండా ఇప్పుడు మాత్రం ఆహ్వానం పలుకుతున్నారా అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి వినయ్ స్పందిస్తూ 'అందుకే మిమ్మల్ని తోడ్కొని వెళ్లేందుకు వచ్చాం సార్' అని చెప్పడంతో నవ్వులు విరిశాయి.



అందుకేనా అత్యంత కీలక విషయాలపై డాక్యుమెంటరీ చేసింది..!



శుక్రవారం ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ తమిళిసై



హరీశ్‌రావుతో కేటీఆర్ మాటామంతీ

నా సర్కారు అగ్రగామి

▶ మొదటి పేజీ తరువాయి

ఆవిర్భావం నాటి పరిస్థితులతో పోల్చితే ఇప్పుడు వివిధ రంగాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరించారు. గవర్నర్ ప్రసంగం ఆమె మాటల్లోనే..

''తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లోనూ అభివృద్ధి గతం కన్నా రెట్టింపైంది. రాష్ట్ర ఆదాయం 2014–15లో రూ.62వేల కోట్లు ఉండగా.. 2021–22 నాటికి రూ.లక్షా 84వేల కోట్లకు పెరిగింది. నాడు తలసరి ఆదాయం రూ.1,24,104 ఉండగా.. 2022–23కి రూ.3,17,115కి పెరిగింది. గతంలో దండగ అంటూ అందరూ ఈసడించిన వ్యవసాయాన్ని నా ప్రభుత్వం పండగలా మార్చింది. 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ కాకతీయ పథకాలతో పాటు యుద్ధ ప్రాతిపదికన భారీ, మధ్యతరహా, చిన్న ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తితో కొత్త ఆయకట్టు అభివృద్ధి చెంది రైతుల్లో భరోసా పెరిగింది. రైతుబంధు కింద 65 లక్షల మంది రైతులకు రూ.65 వేల కోట్లను పంట పెట్టుబడి సాయంగా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలో కరెంట్, తాగునీటి కష్టాలు తీరాయి. తలసరి విద్యుత్ వినియోగం 1,356 యూనిట్ల నుంచి 2021–22 నాటికి 2,126కు చేరింది.

మానవీయ ప్రభుత్వం

నా ప్రభుత్వం మానవీయ ప్రభుత్వం. పేదలు, అసహాయులకు ఆసరా అందించే ప్రభుత్వం. ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛన్ల వయోపరిమితిని 57 ఏళ్లకు తగ్గించింది. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, బోధకాలు బాధితులు, డయాలసిస్ రోగులు తదితర అసహాయులైన పేదలకు జీవన భద్రత కోసం ఆసరా పెన్షన్లను అందిస్తోంది.

దళితబంధు.. ఎస్టీల కోటా పెంపు

దళితజాతి స్వావలంబన కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. దేశ చరిత్రలోనే తొలిసారిగా దళిత కుటుంబాల ఉపాధి కల్పన కోసం రూ.10లక్షల చొప్పున ఉచిత గ్రాంట్ అందజేస్తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఎస్టీల జనాభా 10 శాతానికి పెరిగింది. వారికి ఇచ్చిన మాట ప్రకారం ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచింది.

బీసీలు, మైనారిటీలు, బ్రాహ్మణుల సంక్షేమం

ప్రభుత్వం గొల్లకుర్మలకు రూ.11 వేల కోట్లతో 7.3లక్షల యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసింది. ఉచితంగా చేపలను జలాశయాల్లో పెంచి వాటిని పట్టుకునే హక్కును స్థానిక మత్స్యకారులకే కల్పించింది. బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లను అప్పగించడం ద్వారా చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు చేతినిండా కల్పిస్తోంది. బీసీ రెసిడెన్షియల్ విద్యాలయాలను 19 నుంచి 310కి పెంచింది. 203 మైనారిటీల గురుకుల స్కూళ్లను ఏర్పాటు చేసి వాటిని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా ఉపాధి కల్పన, విదేశీ విద్యకు ఆర్థిక సాయం వంటి పథకాలను అమలు చేస్తోంది. జర్నలిస్టులు, న్యాయవాదుల కోసం చెరో రూ.100 కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేసింది.

మహిళలకు భరోసా, భద్రత

ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా 100శాతం అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడాన్ని నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు దేశంలోనే అత్యధిక వేతనాలు చెల్లిస్తోంది. పేదింటి ఆడపిల్లల పెళ్లి ఖర్చుల కోసం కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకాల కింద రూ.లక్షా 116 ఆర్థిక సాయంగా అందిస్తోంది. ఈ పథకాలతో 12,00,469 మందికి లబ్ధి కలిగింది.

ఉద్యోగులకు దేశంలోనే అత్యధిక వేతనాలు

ప్రభుత్వ ఉద్యోగులతోపాటు సమాంతరంగా హోంగార్డులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచింది. ప్రభుత్వ ఉద్యోగులతో మైత్రీ భావంతో వ్యవహరిస్తోంది. దేశంలోనే అత్యధిక వేతనాలను తెలంగాణ ఉద్యోగులకు అందిస్తోంది.

భారీగా ఉద్యోగాల భర్తీ

ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందనే భయంతో ప్రపంచవ్యాప్తంగా అనేక అంతర్జాతీయ కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి.

ఇంత కష్టకాలంలో సైతం రాష్ట్ర ప్రభుత్వం కొలువుల జాతర కొనసాగిస్తోంది. 2014 జూన్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు ప్రత్యక్ష నియామకాల ద్వారా 1,41,735 ఉద్యోగాలను భర్తీ చేయగా.. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న మరో 80,039 ఉద్యోగాలకు ఒకేసారి భర్తీ ప్రక్రియ చేపడుతోంది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం

తెలంగాణ ప్రజల కొంగు బంగారమైన యాదగిరిగుట్ట నరసింహస్వామి ఆలయాన్ని ప్రభుత్వం వైభవంగా పునర్నిర్మించింది. నూతనంగా నిర్మించిన సచివాలయ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టింది. అంబేడ్కర్ మహాశయుడి ఔన్నత్యం ప్రతిఫలించేలా దేశంలో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించబోతోంది..'' అని గవర్నర్ తమిళిసై తన ప్రసంగంలో పేర్కొన్నారు.

విద్యా రంగంలో వికాసం

పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధనతో పాటు తగిన ఆహారం, వసతి ఏర్పాటు చేయాలనే ఉదాత్తమైన లక్ష్యంతో ప్రభుత్వం వెయ్యికి పైగా గురుకులాలను స్థాపించింది. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి మౌలిక సదుపాయాల కోసం మనఊరు–మనబడి/మన బస్తీ–మన బడి ప్రణాళికలను అమలు చేస్తోంది. రూ.7,259 కోట్లతో 26,065 పాఠశాలల్లో 12 రకాల మౌలిక వసతులను కల్పిస్తోంది.

ప్రజారోగ్యంలో దేశంలో మూడో స్థానం

దేశంలో అత్యున్నత వైద్యసేవలు అందించే రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో ఉందని నీతి ఆయోగ్ ప్రశంసించింది. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని దవాఖానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించింది. హైదరాబాద్ నగరం నలువైపులా 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మిస్తోంది. నిమ్స్‌లో 2వేల పడకలను అదనంగా ఏర్పాటు చేస్తోంది. వరంగల్‌లో రూ.1,100 కోట్లతో 2వేల పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల రేటు 30శాతం నుంచి 61 శాతానికి పెరిగింది. మాతృ మరణాలు ప్రతి లక్ష ప్రసవాలకు 92 నుంచి 43కు తగ్గాయి. శిశు మరణాల రేటు ప్రతి వెయ్యి జననాలకు 39 నుంచి 21కి తగ్గింది.

పారిశ్రామిక, ఐటీ రంగాల్లో అభివృద్ధి

టీఎస్–ఐపాస్ విధానం కింద పారిశ్రామిక, ఐటీ రంగాల్లో రూ.3 లక్షల 31వేల కోట్లకు పైగా పెట్టుబడులను రాష్ట్రం ఆకర్షించింది. ఐటీ ఉద్యోగ నియామకాల్లో 140 శాతం వృద్ధి నమోదు చేసింది.



కనీసం కలెక్టర్ అయినా పిలవాల్సింది

మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే ఈటల

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల తొలి రోజు ఉభయ సభల సంయుక్త సమావేశం సందర్భంగా పలు ఆసక్తికర ఘటనలు చోటు చేసుకున్నాయి. గవర్నర్ ప్రసంగానికి ముందుకు శాసనసభ సమావేశ మందిరానికి చేరుకున్న మంత్రి కేటీఆర్ అభివాదం చేస్తూ విపక్ష పార్టీ సభ్యుల బెంచ్‌ల వైపు వెళ్లారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం నేత మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే జగ్గారెడ్డితోపాటు బీజేపీ సభ్యులను కేటీఆర్ పలకరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నడుమ సుమారు ఐదు నిమిషాలపాటు సంభాషణ సాగింది. హుజూరాబాద్‌లో ఇటీవల జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో ఎందుకు పాల్గొనలేదని ఈటలను మంత్రి కేటీఆర్ అడిగినట్లు తెలిసింది. దీనికి ఈటల స్పందిస్తూ 'పిలిస్తే కదా హాజరయ్యేది'అంటూ సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లే విధానం సరిగా లేదని ఈటల అన్నట్లు సమాచారం. కనీసం కలెక్టర్ అయినా ఆహ్వానిస్తే బాగుండేదని ఈటల అన్నట్లు తెలిసింది. ఇద్దరి సంభాషణలో జోక్యం చేసుకుంటూ భట్టి విక్రమార్క తనను కూడా అధికారిక కార్యక్రమాలకు పిలవడం లేదని చెప్పారు. ఆ సమయంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అక్కడికి రాగా, 'మీ దుస్తుల రంగు నా కళ్లలో గుచ్చుకుంటోంది' అని కేటీఆర్ వ్యాఖ్యానించగా, 'మీరు కూడా ఏదో ఒక రోజు ఈ రంగు దుస్తులు ధరిస్తారు' అని రాజాసింగ్ బదులిచ్చారు.

విఫల పథకాలను గొప్పవిగా చెప్పించారు: బండి



సాక్షి, హైదరాబాద్: ఇన్నాళ్లూ గవర్నర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఈ రోజు అసెంబ్లీలో గవర్నర్ ద్వారా అసత్యాలు చెప్పించడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. విఫలమైన పథకాలను గవర్నర్ ప్రసంగంలో గొప్పవిగా చూపుతూ ప్రజలను మభ్యపెట్టే యత్నం చేయడం సిగ్గుచేటని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, విద్య, వైద్యవ్యవస్థ కునారిల్లుతోందని విమర్శించారు. నిండా అవినీతిలో కూరుకుపోయిన ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం.. రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించేందుకు గవర్నర్ నోటితో అబద్ధాలు చదివించడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా రైతులకు త్రీ ఫేజ్ కరెంట్‌ను 24 గంటలపాటు సరఫరా చేస్తున్నామనడం పచ్చి అబద్ధమని పేర్కొన్నారు. రూ.లక్ష కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినా ఆయకట్టు ఏమాత్రం పెరగలేదన్నారు. రైతుబంధు మినహా కేంద్రం నుంచి వస్తున్న సబ్సిడీలను రైతులకు అందకుండా చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే తెలంగాణలో వ్యవసాయ అభివృద్ధి గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని గవర్నర్ ప్రసంగంలో చెప్పించడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మూర్ఖపు విధానాలతో విద్యుత్ రంగం వేల కోట్ల నష్టాల పాలైందని, డిస్కంలు ఏ రోజు కుప్పకూలుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. ఈ విషయాన్ని దాచిపెట్టి వెలుగు జిలుగుల రాష్ట్రంగా విరాజిల్లుతున్నట్లు చెప్పుకోవడం విచారకరమన్నారు.

బీజేఎల్పీ నేత నియామకంలో జాప్యమెందుకు?

సాక్షి, హైదరాబాద్: బీజేపీ శాసనసభాపక్ష నేత నియామకంలో జాప్యమెందుకు జరుగుతోందనే చర్చ ఆ పార్టీలో కొనసాగుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో బీజేఎల్పీ నేతగా ఎవరిని నియమిస్తారనే అంశం ఆసక్తి రేకెత్తిస్తుండగా అసలు ఇప్పటిదాకా ఈ నియామకం ఎందుకు జరగలేదు? పార్టీ ఆలోచన ఏమిటి? అనే చర్చ నడుస్తోంది. బీజేఎల్పీ నేతను ప్రకటించకపోవడంతో సభలో ఎలా వ్యవహరించాలనే దానిపై సభ్యుల్లో అయోమయం నెలకొందని అంటున్నారు. బీజేపీ పక్షాన టి.రాజాసింగ్, ఎం.రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ సభ్యులుగా ఉండగా, గతంలో బీజేఎల్పీ నేతగా ఉన్న రాజాసింగ్‌ను గతేడాది వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. రాజాసింగ్‌పై ప్రభుత్వం పీడీ యాక్ట్ పెట్టడంతో జైలుకు కూడా వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యారు. కానీ పార్టీ ఇంకా సస్పెన్షన్ ఎత్తేయలేదు. దీంతో మిగిలిన ఇద్దరిలో ఒకరిని బీజేఎల్పీనేతగా నియమించాల్సి ఉంటుంది. ఈటల బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడిగా కొనసాగడంతో పాటు గతంలో ఆయన అసెంబ్లీలో కీలక బాధ్యతలు నిర్వహించినందున, బీజేఎల్పీ నేతగా రఘునందన్‌రావును నియమిస్తారా? అనే చర్చ పార్టీవర్గాల్లో సాగుతోంది.

గవర్నర్‌కు సాదర స్వాగతం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించేందుకు వచ్చిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు శుక్రవారం సాదర స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఉదయం 11.55 గంటలకు అసెంబ్లీకి చేరుకున్నారు. తర్వాత 12.05 గంటలకు అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్ తమిళిసైకి సీఎం కేసీఆర్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. తర్వాత శాసనసభ హాల్ వరకు గవర్నర్‌ను సీఎం, స్పీకర్, చైర్మన్ స్వయంగా తోడ్కొని వచ్చారు. జాతీయ గీతాలాపన అనంతరం 12.12 గంటలకు ప్రారంభమైన గవర్నర్ ప్రసంగం.. 12.44 గంటల వరకు 32 నిమిషాల పాటు కొనసాగింది. ఈ సమయంలో మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బల్లలు చరుస్తూ హర్షం వ్యక్తం చేశారు. ప్రసంగం ముగిశాక గవర్నర్ సభ్యుల స్థానాల వద్దకు వచ్చి అభివాదం చేశారు. అనంతరం గవర్నర్‌కు శాసనసభ ప్రధాన ద్వారం వద్ద సీఎం, మండలి చైర్మన్, స్పీకర్ తదితరులు వీడ్కోలు పలికారు.



సభలోకి వస్తున్న గవర్నర్ తమిళిసైకి అభివాదం చేస్తున్న సభ్యులు. చిత్రంలో కేసీఆర్

యథాతథంగా..

ప్రభుత్వం, గవర్నర్ మధ్య కొంతకాలంగా చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ఆసక్తి నెలకొంది. 'పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది' అని ప్రజాకవి కాళోజీ కవితా పంక్తులతో ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్.. 'కరువంటూ కాటకమంటూ కనిపించని కాలాలెపుడో పసిపాపల నిదుర కనులతో ముసిరిన భవితవ్యం ఎంతో..' అని స్వాతంత్య్ర సమరయోధుడు, కవి దాశరథి కృష్ణమాచార్య పంక్తులతో ముగింపునకు వచ్చారు. చివరిలో 'జయ జయహే తెలంగాణ.. జై తెలంగాణ.. జై హింద్' నినాదాలతో ముగించారు. ప్రసంగంలో వివిధ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిని వివరిస్తూ, 'తెలంగాణ మోడల్'కు పెద్దపీట వేశారు. మొత్తంగా ప్రభుత్వం నుంచి అందిన ప్రసంగ పాఠాన్ని చదివి ఎక్కడా వివాదానికి తావు లేకుండా ముగించారు.

ఎక్కడా విమర్శలు లేకుండా..

గవర్నర్ ప్రసంగ పాఠంలో ఎక్కడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శ లేకపోవడం గమనార్హం. గవర్నర్ ప్రసంగాన్ని రాజకీయ విమర్శలకు వేదికలా కాకుండా కేవలం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన అంశాలకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకున్నట్టు కనిపించింది.

ప్రసంగంలో అనేక మార్లు గవర్నర్ 'మై గవర్నమెంట్ (నా ప్రభుత్వం)'అనే పదాన్ని వాడుతూ.. ప్రభుత్వ నిర్ణయాలు, పథకాల ఫలితాలను వివరించారు. ఇటీవల ప్రభుత్వ పనితీరుపై రాజ్‌భవన్ వేదికగా విమర్శలు సంధించిన గవర్నర్ నోట ప్రభుత్వ పనితీరును సానుకూలంగా ఆవిష్కరించే రీతిలో ప్రసంగ పాఠం సాగడం గమనార్హం. సుమారు రెండేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే గవర్నర్ అసెంబ్లీలో అడుగు పెట్టారు.

ఈసారి 20 అంశాలు

- బడ్జెట్ సమావేశాల్లో 20 ప్రజాసమస్యలను లేవనెత్తాలని కాంగ్రెస్ నిర్ణయం
- పార్టీ పక్షాన మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరిన భట్టి
- ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ ఇవ్వకుండా చులకన చేస్తున్నారని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో 20 అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈనెల 6న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం జరిగే చర్చలో భాగంగా ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న అంశాలను ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భావిస్తోంది. రైతులకు రుణమాఫీ అమలుతోపాటు ఉద్యోగులకు సంబంధించిన 317 జీవో, ప్రభుత్వాసుపత్రుల్లో బాలింతల మరణాలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్, ధరణి పోర్టల్ కారణంగా రైతుల ఆత్మహత్యలు తదితర అంశాలను లేవనెత్తాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పార్టీ పక్షాన 20 అంశాలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ ఇవ్వకుండా చులకన చేస్తున్నారని ఈ సందర్భంగా భట్టి ప్రస్తావించినట్టు సమాచారం. దీనిపై అధికారులకు తగిన ఆదేశాలివ్వాలని స్పీకర్‌ను కోరినట్టు సీఎల్పీ వర్గాలు చెప్పాయి.

కాంగ్రెస్ నిర్ణయించిన 20 అంశాలివే:

◆ 317 జీవో రద్దు ◆ రైతు రుణమాఫీ.. బ్యాంకురుణాలు, పంటలకు మద్దతు ధర
◆ రాష్ట్రవ్యాప్తంగా దళితబంధు అమలు, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు
◆ మలక్‌పేట ప్రభుత్వాసుపత్రిలో బాలింతల మరణాలు
◆ రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, డ్రగ్స్ దందా, కిడ్నాప్‌లు
◆ ఎస్సై, కానిస్టేబుల్ నియామకాల్లోని అవకతవకలు, ఫీజు రీయింబర్స్‌మెంట్
◆ గ్యాస్, పెట్రోల్, డీజిల్‌పై పన్నుల తగ్గింపు ◆ పోడు భూములపై గిరిజనులకు హక్కులు ◆ సర్పంచ్‌ల సమస్యలు, గ్రామపంచాయతీల నిధుల దారి మళ్లింపు
◆ కృష్ణా, గోదావరి నదుల్లో నీటి వాటా, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, ఏపీ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులు ◆ విపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ విషయంలో ప్రొటోకాల్ పాటించకపోవడం ◆ రాష్ట్ర పునర్విభజన చట్టం అమలు, ఇతర రాష్ట్రాల కేడర్ అధికారులు తెలంగాణలో పనిచేయడం ◆ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ◆ గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్
◆ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు ◆ రాష్ట్ర అప్పులు ◆ కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం రద్దు, పాత పింఛన్ అమలు, పీఆర్సీ ప్రకటన ◆ బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ
◆ వైన్‌షాపులు, బెల్టుషాప్‌లు, బార్లు, పబ్బులతో సమస్యలు ◆ ధరణి కారణంగా రైతుల ఆత్మహత్యలు

13 వరకు బడ్జెట్ సమావేశాలు!

నేడు ఉభయ సభల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు



బీఏసీ సమావేశంలో పోచారం, పద్మారావు, వేముల, హరీశ్‌రావు, భట్టి తదితరులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13 వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం అసెంబ్లీ ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించిన తర్వాత శనివారానికి వాయిదా పడ్డాయి. అనంతరం శాసనసభ, శాసన మండలి బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు జరిగాయి. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు. తాము ప్రతిపాదించిన అంశాలను చర్చించడం లేదనే కారణంతో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ బీఏసీ సమావేశానికి దూరంగా ఉన్నారు. బీఏసీ భేటీకి బీజేపీకి ఆహ్వానం అందలేదు. వీలైనన్ని ఎక్కువ రోజులు సమావేశాలు జరపాలని భట్టి విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రసంగానికి ధన్యవాదాలు

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించేందుకు శాసనసభ, శాసన మండలి వేర్వేరుగా శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం కానున్నాయి. ఈ నెల 5న ఆదివారం ఉభయ సభలకు విరామం ప్రకటించి.. సోమవారం 6న సమావేశాలు ప్రారంభిస్తారు. ఆ రోజున శాసనసభలో ఆర్థికమంత్రి హరీశ్‌రావు, శాసనమండలిలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బడ్జెట్‌ను సమర్పిస్తారు. 7న ఉభయ సభలకు విరామం ప్రకటించనుండగా.. 8న బడ్జెట్‌పై సాధారణ చర్చ జరుగుతుంది. 9,10,11 తేదీల్లో శాఖల వారీగా పద్దులపై శాసనసభలో చర్చ జరగనుండగా.. ఈ మూడు రోజులు శాసన మండలికి విరామం ప్రకటిస్తారు. ఈ నెల 12 లేదా 13న ఉభయ సభల్లో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చించిన తర్వాత నిరవధికంగా వాయిదా పడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఏయే తేదీల్లో ఏయే పద్దులపై చర్చ జరుగుతుందనే అంశంపై శనివారం స్పష్టత రానున్నది. ఈ నెల 9, 10, 11 తేదీల్లో ప్రశ్నోత్తరాలు కొనసాగనుండగా.. బడ్జెట్ సమావేశాలు కావడంతో స్వల్పకాలిక చర్చ ఉండే చాన్స్ లేదని సమాచారం.



అసెంబ్లీ ఎన్నికల్లో విజయశాంతి ఎక్కడి నుంచి పోటీ చేయబోతున్నారు?
బీజేపీలో కోవర్టులు ఎవరు?
కేసీఆర్ అవినీతిపై సీబీఐ విచారణ చేస్తుందా?
విజయశాంతి అంటే పార్టీలో భయపడుతున్నదెవరు?
సినిమాలకు గుడ్‌బై చెప్పేశారా?

గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉభయ సభలనుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ తమిళిసైతో రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాలు చెప్పించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేయని కార్యక్రమాలు కూడా తమ ఖాతాలో వేసుకొని గొప్పలు చెప్పుకోవడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో గ్రామాల రూపురేఖలు మారాయని గవర్నర్‌తో చదివించడం సరికాదని కిషన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం నిధులు దారి మళ్లించి స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేయడాన్ని బడ్జెట్‌లో ప్రస్తావిస్తే బాగుండేదన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. సబ్ స్టేషన్ల ఎదుట రైతులు ధర్నాలు చేస్తుంటే 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తున్నామనడం హాస్యాస్పదమన్నారు. ఇటీవల కేసీఆర్ జై తెలంగాణ నినాదాన్ని విస్మరించినా.. గవర్నర్ తన ప్రసంగాన్ని జై తెలంగాణ అని చెప్పి ముగించడం ప్రజల పట్ల ఉన్న ఆదరాభిమానాలకు నిదర్శనమన్నారు.

ప్రసంగంలో ఏముందని కామెంట్ చేయాలి?

25 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలి: సీఎల్పీ నేత భట్టి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేసిన ప్రసంగం సాదాసీదాగా ఉందని, ఆ ప్రసంగంలో ఎలాంటి పసలేదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన స్క్రిప్టును చదివి వెళ్లారని ఆయన పేర్కొన్నారు. ఆ ప్రసంగంలో రాష్ట్ర ప్రజలు ఎదురుచూసినవి ఏమీ లేవని, అసలు ఆ ప్రసంగంలో ఏముందని కామెంట్ చేయాలని ప్రశ్నించారు. శుక్రవారం గవర్నర్ ప్రసంగం తర్వాత సభ వాయిదా పడిన అనంతరం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగానికి లోబడి ఎవరి పాత్రను వారు నిర్వహిస్తే ప్రజాస్వామ్య పాలనలో ఎలాంటి సమస్య ఉండదని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. సీఎం, గవర్నర్‌లు రాజ్యాంగ పదవుల్లో ఉండి.. రాజకీయ పార్టీల నేతల్లాగా వ్యవహరించిన కారణంగానే ఘర్షణ వాతావరణం తలెత్తిందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రజాసమస్యలు, నిరుద్యోగులు, యువత, రైతుల సమస్యలపై చర్చ జరగాలని కాంగ్రెస్ పార్టీ కోరుతోందన్నారు. మొత్తం 25 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని తాము స్పీకర్‌ను కోరామని, బీఏసీ సమావేశానికి ప్రతిపక్ష పార్టీలన్నింటినీ పిలిస్తే బాగుండేదని భట్టి పేర్కొన్నారు.

క్లుప్తంగా...

హామీల అమలుకు ఇదే ఆఖరి అవకాశం

బడ్జెట్ కేటాయింపులపై సీఎంకు రేవంత్ లేఖ



సాక్షి, హైదరాబాద్: 'మీ ప్రభుత్వానికి చివరి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఇదే మీకు ఆఖరి అవకాశం. ఇప్పటికైనా బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి, హామీలన్నింటినీ రానున్న పదినెలల కాలంలో నెరవేర్చాలి. లేదంటే వచ్చే ఎన్నికల్లో మీకు ఓట్లు అడిగే హక్కు లేదు'అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. త్వరలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై శుక్రవారం ఆయన సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. 2018 ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలిచ్చారని కానీ నాలుగు బడ్జెట్‌లు పూర్తయినా ఆ హామీలను నెరవేర్చలేదని వెల్లడించారు. రైతులు, నిరుద్యోగ యువత, బీసీ, దళిత, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. రైతు రుణమాఫీ, దళితబంధు, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, సొంత స్థలం ఉంటే ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షల సాయం వంటి పలు అంశాలను రేవంత్ తన లేఖలో ప్రస్తావించారు.

రైతు ఆత్మహత్యలపై విపక్షాలది అసత్య ప్రచారం

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతుల ఆత్మహత్యలంటూ జరుగుతున్న ప్రచారం అసత్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కొన్ని పత్రికలు పనిగట్టుకుని విష్రప్రచారం చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని విమర్శించారు. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. తెలంగాణలో 2017లో రైతు మరణాల సంఖ్య 846గా ఉంటే 2021 నాటికి వాటి సంఖ్యను 352గా కేంద్రం ప్రకటించిందన్నారు. రైతు బీమా పథకం కింద ఇప్పటి వరకు 90 వేలకుపైగా రైతు కుటుంబాలను ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని విపక్షాలు రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు.

బీసీల డిమాండ్లను ప్రధాని దృష్టికి తీసుకెళ్తా

కేంద్రమంత్రి రాందాస్ అథవాలే

నాంపల్లి: బీసీల న్యాయమైన డిమాండ్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖల సహాయమంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్పీఐ) జాతీయ అధ్యక్షుడు రాందాస్ అథవాలే హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అధ్యక్షతన బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాల సమావేశం జరిగింది. అథవాలే మాట్లాడుతూ జంతువులకు కూడా లెక్క ఉందని, కానీ బీసీలకు లేకపోవడం బాధాకరమని అన్నారు. బీసీ జనగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు కోసం ఎన్నోఏళ్లుగా బీసీలు చేస్తున్న పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క శాతం ఓట్లు కూడా లేనోళ్లు రాజ్యమేలుతున్నారని అన్నారు.

నిర్లక్ష్యం కాల్చేస్తోంది!



రాష్ట్రంలో ఈ కారణంగానే అత్యధిక అగ్ని ప్రమాదాలు

2021లో మొత్తం 7,327 ఘటనలు నమోదు

- వీటిలో కాల్చిపారేసిన సిగరెట్, బీడీల వల్ల జరిగినవి.. 3,927
- 1,866 ఉదంతాలకు కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్
- స్పష్టం చేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారిక గణాంకాలు
- విభాగాన్ని వెంటాడుతున్న మౌలిక వసతులలేమి

సాక్షి, హైదరాబాద్

రోజుకు 20.. వారానికి 140.. నెలకు 600..ఏడాదికి 7,327... రాష్ట్రంలో 2021లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదాలు ఇవి. వీటిలో అత్యధికం మానవ నిర్లక్ష్యం కారణంగానే జరిగినట్లు ఆ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అగ్ని ప్రమాదాలకు కారణాల్లో కాల్చిపారేసిన బీడీ, సిగరెట్లు మొదటి స్థానంలో ఉండగా, షార్ట్ సర్క్యూట్‌లు రెండో స్థానంలో ఉన్నాయి.

అగ్ని ప్రమాదాలు, ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు

ఏడాది	అగ్నిప్రమాదాలు	ప్రాణనష్టం	ఆస్తి నష్టం (రూ.లలో)
2017	9,966	196	రూ.156,87,24,768
2018	9,120	266	రూ.260,16,47,573
2019	8,960	219	రూ.770,46,82,316
2020	7,899	320	రూ.230,91,23,101
2021	7.327	296	రూ. 178,27,30,852

కేవలం గతేడాది మాత్రమే కాదు... ఏటా జరుగుతున్న అగ్ని ప్రమాదాలకు కాల్చిపారేసిన సిగరెట్, బీడీలే ఎక్కువగా కారణమవుతున్నాయి. ఈ తరహా ఘటనలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలు, జిల్లాల్లో జరుగుతున్నాయి. అక్కడ ఉండే గుడిసెలు తదితరాలకు వీటి వల్ల మంటలు అంటుకుని విస్తరించడంతో భారీ ఆస్తి, ప్రాణనష్టాలు చోటు చేసుకుంటున్నాయి. 2019లో మొత్తం 8,960 అగ్నిప్రమాదాలు జరగ్గా వీటిలో 4,668 కాల్చి పారేసిన సిగరెట్, బీడీల వల్లే జరిగాయి. ఇక 2020లో 7,899కి 4,187, 2021లో 7,327కి 3,927 ఈ కారణంగానే జరిగాయి.

నగరాలు, పట్టణాల్లో షార్ట్ సర్క్యూటే..

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల 1,866 అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఇక నగరాలు, పట్టణాల వద్దకు వచ్చేసరికి విద్యుత్ షార్ట్ సర్క్యూటే ఫైర్ యాక్సిడెంట్లకు ప్రధాన కారణంగా ఉంటోంది. విద్యుత్ తదితర శాఖలు భవనాల తనిఖీ చేపట్టకపోవడం వల్లే ఇవి చోటు చేసుకుంటున్నాయనే విమర్శలున్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా 2019–21 మధ్య వరసగా 2,726, 1,992, 1,866 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

దడపుట్టిస్తున్న వరుస ఉదంతాలు..

- రాజధానిలో ఇటీవలి కాలంలో వరుసగా చోటు చేసుకుంటున్న అగ్నిప్రమాదాలు దడ పుట్టిస్తున్నాయి. సికింద్రాబాద్ ప్రాంతంలోని రాధా ఆర్కేడ్ భవనంలో ఉన్న డెక్కన్ కార్పొరేట్ కార్యాలయంలో మంటలు చెలరేగి రోజుల తరబడి తగులబడటం నగరం ఉలిక్కిపడేలా చేసింది. దీని కూల్చివేతలు కూడా కొలిక్కి రాక ముందే వనస్థలిపురం, ఎల్బీనగర్‌ల్లోని గోదాములు అగ్నికి ఆహుతయ్యాయి. తాజాగా తుది మెరుగులు దిద్దుకుంటున్న కొత్త సచివాలయంలో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. ఈ ప్రమాదాలన్నిటిలోనూ ప్రాణ నష్టం లేకపోయినా భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకుంది. డెక్కన్ కార్పొరేట్ ఉదంతంలో మాత్రం ముగ్గురు సజీవ దహనం కాగా.. ఇద్దరి అవశేషాలు కూడా దొరకలేదు.

పటిష్ట చట్టం లేదు..

ఫైర్ సేఫ్టీ నిబంధనలు పట్టించుకోని భవనాల యాజమాన్యాలపై చర్యలు తీసుకునేందుకు అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖకు ఉన్న ఒకే ఒక్క ఆయుధం ఏపీ ఫైర్ సర్వీసెస్ యాక్ట్. 1999లో రూపొందించిన ఈ కోరలు లేని చట్టమే ఇప్పటికీ ఉండటం గమనార్హం. అయితే ఈ విభాగం కేసు నమోదు చేసినప్పటికీ నోటీసుల జారీ మినహా అరెస్టుకు ఆస్కారం లేదు. కేసు కూడా సివిల్ కోర్టుల్లో విచారణ జరుగుతుంది. దాదాపు 90% ఉల్లంఘనలకు జరిమానా, మిగిలిన వాటిలో గరిష్ట శిక్ష 3 నెలలు మాత్రమే. అగ్నిమాపక శాఖ అధికారులు 2014 నుంచి ఇప్పటివరకు నమోదు చేసిన కేసుల్లో ఒక్క దాంట్లోనూ శిక్ష పడకపోవడం గమనార్హం. సిబ్బంది లేమి తనిఖీలకు అడ్డంకిగా మారింది.

– అగ్నిమాపక శాఖ మాజీ ఉన్నతాధికారి

అవసరం మేరకు లేని ఫైర్ స్టేషన్లు

ఏటా అగ్నిప్రమాదాలు వేల సంఖ్యలో, ఆస్తినష్టం రూ.వందల కోట్లలో, ప్రాణనష్టం పదుల సంఖ్యలో ఉంటోంది. అయితే రాష్ట్రంలో ఈ మేరకు అవసరమైన సంఖ్యలో అగ్నిమాపక కేంద్రాలు లేవు. సిబ్బంది, శకటాలు సహా ఇతర మౌలికవసతులూ లేవు. జనాభా విస్తీర్ణం ప్రాతిపదికన తీసుకున్నా ఒక్క హైదరాబాద్ మహానగరంలోనే 100కు పైగా అగ్నిమాపక కేంద్రాలు, ఒక్కో కేంద్రంలో కనీసం మూడు శకటాలు, కనిష్టంగా 15 మంది సిబ్బంది అవసరం. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్నిమాపక కేంద్రాల సంఖ్య 110 దాటట్లేదు. వీటికి తోడు మరో 20 వరకు ఔట్‌సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. వీటిలోనూ 95% కేంద్రాల్లో సాధారణ ఫైర్ ఇంజన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ కారణంగానే బహుళ అంతస్తుల భవనాలు, భారీ సముదాయాలు, పరిశ్రమలు తదితరాల్లో జరిగే అగ్నిప్రమాదాలను అదుపు చేయడం కష్టసాధ్యం అవుతోంది.

కొత్త సచివాలయంలో అగ్నిప్రమాదం..

▶ మొదటి పేజీ తరువాయి

డోమ్ పనులతో పాటు ఇతర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎలక్ట్రికల్, ఉడ్ వర్క్, పెయింటింగ్, ఫాల్స్ సీలింగ్ తదితర పనులు ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పేరుకుపోతున్న చెక్క, ఫోమ్, థర్మకోల్ తదితర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉంది. కాగా శుక్రవారం తెల్లవారుజామున సచివాలయం వెనుక వైపు లోయర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి. అయితే ఆ వైర్లలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే అక్క డున్న వ్యర్థాలకు అంటుకుని వ్యాపించాయి. ఈ పరిణామంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది పరుగులు తీశారు. థర్మకోల్ వ్యర్థాలకు మంటలు అంటుకోవడంతో పొగలు పెద్ద ఎత్తున కమ్ముకున్నాయి. లోయర్ గ్రౌండ్‌తో పాటు గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లకు వ్యాపించాయి. ఓ డోమ్ కూడా నల్లగా మారింది.

సీఎంవో ఉన్న భవనంలోనే..

ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న 11 అగ్నిమాపక శకటాలు మంటల్ని అదుపులోకి తెచ్చాయి. తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో మంటలు పూర్తిగా ఆరిపోయాయి. మంటలు చెలరేగిన భవనం ఆరో అంతస్తులోనే సీఎం కార్యాలయం సిద్ధమవుతోంది. ఈ భారీ భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడం, అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. భవనం తుది మెరుగుల్లో ఉండటంతో ఫైర్ సేఫ్టీ వ్యవస్థ ఇంకా అందుబాటులోకి రాలేదు. అయితే భారీ ఎత్తున సచివాలయం నిర్మాణమవుతున్నా.. ఫైర్ ఇంజన్‌ను సమీపంలో అందుబాటులో ఉంచకపోవడం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ భవన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, అగ్నిప్రమాదంపై ప్రభుత్వ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ప్రమాద కారణాలను, ఇతర వివరాలను బయటకు రానీయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అగ్ని ప్రమాదానికి కారణాలు వెల్లడించేందుకు విముఖత చూపుతున్నారు. ఓ దశలో ఇదో మాక్‌డ్రిల్ అంటూ నమ్మించడానికి ప్రయత్నించారు. మింట్ కాంపౌండ్ రోడ్డులో పనులు జరుగుతుండటం, సచివాలయం వెనుక వైపు రోడ్లపై నిర్మాణ సామగ్రి ఉండటం, ఎక్కడికక్కడ తవ్వకాల వల్ల ఫైర్ ఇంజన్లు లోపలికి, వెనుక వైపునకు వెళ్లడం కష్టసాధ్యమైంది. ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి తెల్లవారుజామునే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మింట్ కాంపౌండ్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌ల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు ఎవరినీ సచివాలయం సమీపానికి అనుమతించలేదు.

కొత్త సచివాలయం పరిశీలనకు కాంగ్రెస్ యత్నం

అగ్నిప్రమాదం నేపథ్యంలో నేతల ఆందోళన

గాంధీభవన్ నుంచి బయటకు రాకుండా అడ్డుకున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న రాష్ట్ర కొత్త సచివాలయంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. సెక్రటేరియట్‌ను పరిశీలించేందుకు ఆ పార్టీ నాయకులు శుక్రవారం గాంధీభవన్ నుంచి సచివాలయానికి బయలుదేరగా పోలీసులు వారిని గాంధీభవన్‌లోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

అఖిలపక్షాన్ని తీసుకెళ్లండి..

ప్రమాదం గురించి తెలిసిన వెంటనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. అగ్నిప్రమాదాన్ని మాక్‌డ్రిల్ అంటూ మసిపూసి మారేడుకాయ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీఎం కేసీఆర్ జన్మదినం రోజున ప్రారంభించాలనే ఒత్తిడి నేపథ్యంలో కనీస ప్రమాణాలు కూడా పాటించలేదని ఘటన జరిగిన తీరుతో తెలుస్తోందని, సీఎం జన్మదినం రోజున సచివాలయాన్ని ప్రారంభించేందుకు ఇదేమైనా రాచరికమా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై నిజాలను నిర్ధారించేందుకు అఖిలపక్ష బృందాన్ని సచివాలయంలోనికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

అదేమైనా కేసీఆర్ ప్రైవేటు ఫామ్‌హౌసా?

మరోవైపు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు షబ్బీర్‌అలీ, అంజన్‌కుమార్ యాదవ్, మల్లురవి, రోహిణ్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మెట్టు సాయికుమార్ తదితరులు గాంధీభవన్ నుంచి సచివాలయానికి వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే గాంధీభవన్ ఎదుటనే బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు వారు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో ఉద్రిక్తత ఏర్పడింది. చివరకు పోలీసులు వారిని బలవంతంగా గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిని రేవంత్ ఖండించారు. 'సచివాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై నిజానిజాలను ప్రజలకు తెలియజేసేందుకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. సచివాలయం ఏమైనా కేసీఆర్ ప్రైవేటు ఫామ్‌హౌసా? అంత రహస్యం ఏమిటి? అరెస్టు చేసిన కాంగ్రెస్ నేతలను తక్షణం విడుదల చేయాలి.'అని రేవంత్ ట్వీట్ చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ నేతలను వ్యక్తిగత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు. అనంతరం గాంధీభవన్‌లో మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ అగ్నిప్రమాద ఘటనను పరిశీలించేందుకు వెళుతున్న తమను అరెస్టు చేయడం పోలీసు రాజ్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. అసలు సచివాలయంలో ఏం జరుగుతోందో తెలియడం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

సీఎం తొందరపాటుతోనే అగ్ని ప్రమాదం

సాక్షి, హైదరాబాద్: నూతనంగా నిర్మిస్తున్న సచివాలయంలో మంటలు చెలరేగడం దురదృష్టకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. ఆదరాబాదరాగా నాణ్యత లేకుండా పనులు చేస్తుండటం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. ఫిబ్రవరి 17న తన పుట్టిన రోజు సందర్భంగా సచివాలయాన్ని ప్రారంభించాలన్న సీఎం కేసీఆర్ తొందరపాటు చర్యలే ఈ పరిస్థితికి కారణమని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పుట్టిన రోజైన ఏప్రిల్ 14న నూతన సచివాలయాన్ని ప్రారంభించాలని సూచించారు.

త్వరలో కాజీపేట ఓవర్‌హాలింగ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన


- బడ్జెట్‌లో రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులకు రూ.4418 కోట్ల కేటాయింపులు
- ఎంఎంటీఎస్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించట్లేదు
- ఈ విషయంలో ఇచ్చిన హామీలను తెలంగాణ నెరవేర్చాలి
- మీడియా సమావేశంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణలోని రైల్వేల అభివృద్ధికి రూ. 4,418 కోట్లు కేటాయించామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2009–14 మధ్య ఉమ్మడి ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు కేవలం రూ.886 కోట్లు కేటాయింపులు జరగ్గా ఈ ఏడాది తెలుగు రాష్ట్రాలకు కలిపి సుమారు రూ. 12,800 కోట్లు కేటాయించామన్నారు. శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా కాజీపేటలో వ్యాగన్ ఓవర్ హాలింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. కాజీపేటలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు టెండర్లను పిలిచామని... త్వరలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఇందులోనే పీరియాడిక్ ఓవర్‌హాలింగ్, రిపేర్, మాన్యుఫ్యాక్చరింగ్ ఉన్నాయన్నారు. దేశంలో వ్యాగన్ ఓవర్ హాలింగ్‌కు డిమాండ్ ఉందని... కోచ్ ఫ్యాక్టరీ, వ్యాగన్ ఓవర్ హాలింగ్‌లకు మధ్య పెద్ద తేడా ఉండదన్నారు. అందువల్ల కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీని అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికే దేశంలో చాలా కోచ్ ఫ్యాక్టరీలు ఉన్నాయని చెప్పారు. విభజన చట్టంలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మాత్రమే ఉందని అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. కాగా, కాజీపేటలో నెలకు 250 రైల్వే వ్యాగన్లను పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి వాటి జీవితకాలాన్ని పెంచుతారు. దీనివల్ల దాదాపు 1,500 మందికి ఉపాధి కలుగుతుందన్న అంచనాలున్నాయి. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వమే సహకరించడం లేదన్న విమర్శలను అశ్వనీ వైష్ణవ్ కొట్టిపారేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంఎంటీఎస్‌కు రూ. 600 కోట్లు కేటాయించామని... ఎంఎంటీఎస్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వమే సహకరించట్లేదని ఆరోపించారు. రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్రం చేయాల్సింది చేస్తుందని... మొదట ఎంఎంటీఎస్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని కోరారు. దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్ల తరహాలో 50 నుంచి 70 కి.మీ. దూరంలోని పట్టణాలను కలుపుతూ హైస్పీడ్ వందే భారత్ మెట్రో ప్రాజెక్టును త్వరలో పట్టాలెక్కించనున్నట్లు అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

సీబీఐకి ఇవ్వాలా? వద్దా?

- ఎమ్మెల్యేలకు ఎర కేసులో అప్పీళ్లపై తీర్పు 6న
- గత నెల 18న రిజర్వు చేసిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలకు ఎర కేసులో అప్పీళ్లపై తీర్పును హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం సోమవారం వెల్లడించనుంది. జనవరి 4న అప్పీళ్లు దాఖలు కాగా, అదే నెల 18 వరకు వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. సిట్ దర్యాప్తును రద్దు చేసి సీబీఐకి బదిలీ చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో అప్పీళ్లు దాఖలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సిట్ అప్పీల్ పిటిషన్లు దాఖలు చేసింది. బీజేపీతోపాటు నిందితులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో సీఎం కేసీఆర్ వాది, ప్రతివాదిగా లేనప్పుడు ఆయన గురించి తీర్పులో ప్రస్తావించడాన్ని అప్పీల్‌లో తప్పుపట్టాయి. ఎమ్మెల్యేల కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూల్చాలని కుట్ర జరిగిందని, అందువల్ల నిందితులకు అనుకూలంగా వచ్చిన సింగిల్‌జడ్జి తీర్పు రద్దు చేయాలని కోరింది. అప్పీళ్లపై ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, నిందితుల తరఫున సీనియర్ న్యాయవాదులు డీవీ సీతారాంమూర్తి, రవిచందర్ వాదనలు వినిపించారు.

ఎంఎంటీఎస్ రెండో దశ

సొంతంగానే..

- పూర్తి చేయాలని రైల్వేశాఖ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఎంఎంటీఎస్ రెండోదశ పనులను సొంతంగానే పూర్తి చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. సంయుక్త ప్రాజెక్టుగా చేపట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తుండటంతో రైల్వే శాఖ చివరకు పనులు ఆపేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్‌లో ట్రాఫిక్ చిక్కులకు కొంతమేర పరిష్కారం లభించే అవకాశం ఉండటంతో ఈ పనుల కోసం రైల్వేపై ఒత్తిడి వస్తోంది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ తీరు మార్చుకున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రప్రభుత్వం నుంచి నిధులు వచ్చినా రాకున్నా ముందుగా ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించినట్లు కనిపిస్తోంది. తాజా బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు ఏకంగా రూ. 600 కోట్లు కేటాయించింది. దీంతో పనులు దాదాపు పూర్తయ్యే అవకాశం ఉంది. ఎంఎంటీఎస్ మొదటి దశ విజయవంతం కావడంతో 2012–13లో రెండో దశకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 817 కోట్లు. ఇందులో మూడో వంతు రూ. 450 కోట్లకుగాను రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా రూ. 130 కోట్లు మాత్రమే విడుదల చేసిందని రైల్వే పేర్కొంటోంది. దీంతో గత కేంద్ర బడ్జెట్‌లో రైల్వే కేవలం రూ.10 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈసారి మాత్రం రూ.600 కోట్లు ప్రతిపాదించింది. ఇప్పటి వరకు మల్కాజిగిరి–బొల్లారం రెండో లైన్ విద్యుదీకరణ 14 కి.మీ. మేర పూర్తి చేయగా, తెల్లాపూర్–రామచంద్రాపురం మధ్య 6 కి.మీ., మేడ్చల్–బొల్లారం మధ్య 14 కి.మీ రెండో లైన్, మౌలాలి–ఘట్‌కేసర్ మధ్య 12.2 కి.మీ. మూడో లైన్, ఫలక్‌నుమా–ఉందానగర్ మధ్య 13.5 కి.మీ. రెండో లైన్ పనులు పూర్తయ్యాయి. సనత్‌నగర్ నుంచి మౌలాలి రెండో లైన్, విద్యుదీకరణ, మౌలాలి–మల్కాజిగిరి–సీతాఫల్‌మండి రెండోలైన్ పనులు కొనసాగుతున్నాయి. కానీ ఇదే తరహా సమస్యతో నిలిచిపోయిన ఘట్‌కేసర్–యాదాద్రి ఎంఎంటీఎస్ ప్రాజెక్టు విషయంలో మాత్రం రైల్వే చేతులెత్తేసింది.

పాత ప్రాజెక్టులకే పచ్చజెండా

- కొత్త లైన్లు, సర్వేల ఊసే లేదు
- బడ్జెట్‌లో తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు రూ. 4,418 కోట్లు
- గతేడాదితో పోలిస్తే 45% ఎక్కువ
- రూ. 600 కోట్లతో సొంతంగా ఎంఎంటీఎస్ రెండో దశ పూర్తికి రైల్వే అడుగులు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లోని రైల్వే పద్దులో మోదీ ప్రభుత్వం ఈసారి తెలంగాణకు కొత్తగా ఎలాంటి ప్రాజెక్టులు ప్రకటించలేదు. కనీసం కొత్త లైన్లు, సర్వేలను సైతం ప్రస్తావించలేదు. కేవలం పాత ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులతోనే సరిపెట్టింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టులకు గత బడ్జెట్‌తో పోలిస్తే కేటాయింపులు మెరుగ్గా ఉండటం ఊరటనిచ్చే అంశం. ఈసారి దక్షిణ మధ్య రైల్వేకు రూ.13,786.19 కోట్లను కేంద్రం కేటాయించింది. ఇది గతేడాది కేటాయించిన రూ. 8,349.75లతో పోలిస్తే 60 శాతం ఎక్కువ. ఇందులో తెలంగాణ పరిధిలోని ప్రాజెక్టులు, ఇతర పనులకు రూ. 4,418 కోట్లు లభించాయి. ఈ మొత్తం గతేడాది కేటాయింపు (రూ. 3,048 కోట్లు)ల కంటే 45 శాతం ఎక్కువ కావడం విశేషం. దక్షిణమధ్య రైల్వే పరిధిలోకే వచ్చే ఏపీలో జరుగుతున్న ప్రాజెక్టులకు కేంద్రం రూ. 8,406 కోట్లు కేటాయించింది. ఇది గతేడాది కేటాయింపు (రూ. 7,032)ల కంటే 20 శాతం ఎక్కువ.

రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు(రూ.కోట్లలో)

ప్రాజెక్టు	ప్రస్తుత బడ్జెట్	గత బడ్జెట్
మునీరాబాద్-మహబూబ్‌నగర్	345	210
మనోహరాబాద్-కొత్తపల్లి	185	160
భద్రాచలం-కొవ్వూరు	20	-
మణుగూరు-రామగుండం	10	
కాజీపేట-విజయవాడ మూడోలైన్	337.52	590
కాజీపేట-బల్లార్షా మూడోలైన్	450.86	548
గుంటూరు-బీబీ నగర్ రెండోలైన్	60	
చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్	82	69

గతం కన్నా రూ. 5,437 కోట్లు ఎక్కువ..

ఈసారి దక్షిణమధ్య రైల్వే జోన్‌కు గత బడ్జెట్ కంటే ఏకంగా రూ. 5,437 కోట్లు ఎక్కువగా కేటాయించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు జోన్ పరిధిలోకి వచ్చే కర్ణాటక, మహారాష్ట్రలో రైల్వే లైన్ల ఏర్పాటుకు కూడా ఈ కేటాయింపులు ఊతమిస్తాయి. సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి పనులతోపాటు జోన్ పరిధిలో మరో 105 స్టేషన్లను అభివృద్ధి చేయబోతున్నాం. నగరానికి అత్యంత కీలకమైన ఎంఎంటీఎస్ రెండో దశ పనులు పూర్తి చేసేలా ఏకంగా రూ. 600 కోట్లు కేటాయింపు ఆ ప్రాజెక్టుకు పెద్ద మలుపు కానుంది. – అరుణ్‌కుమార్‌జైన్, జీఎం దక్షిణ మధ్య రైల్వే





ఆత్మజ్ఞానం అనే ఖడ్గంతో నీ హృదయంలో ఉన్న అజ్ఞాన సంశయాన్ని ఛేదించు. నీలోని క్రమశిక్షణ శక్తులే నీకు మేల్కొలుపు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 4

దిగ్దర్శకుడు విశ్వనాథ్

'బలమైన కళ మన ఆత్మగత సుగుణాలను శక్తిమంతంగా, విజయవంతంగా తట్టిలేపుతుంది. ఈ ప్రపంచానికి విజ్ఞాన శాస్త్రం మేధ అయితే... కళ దాని ఆత్మ' అంటాడు విశ్వవిఖ్యాత రచయిత మక్సీమ్ గోర్కీ. అయిదున్నర దశాబ్దాలపైగా తన సృజనాత్మక శక్తితో వెండితెరపై అనేకానేక విలక్షణ దృశ్య కావ్యాలను సృష్టించి, ప్రేక్షకలోకాన్ని మంత్రముగ్ధుల్నిచేసి వారిలో ఉత్తమ సంస్కారాన్ని ప్రేరేపించిన కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ సినిమాను అక్షరాలా సమాజాన్ని ప్రభావితం చేయగల కళారూపంగా భావించారు. కనుకే అన్ని ఉత్తమ చిత్రాలు అందించగలిగారు. ఆ చిత్రాలన్నీ దివికేగిన ఆ మహనీయుణ్ణి అజరామరం చేసేవే. చలనచిత్ర చరిత్రలో ఆయనకు ప్రత్యేక స్థానాన్ని చ్చేవే. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఒక మారుమూల గ్రామంలో పుట్టిన కుర్రాడు వాహినీ సంస్థలో పనిచేస్తున్న తన తండ్రి ప్రభావంతో చలనచిత్ర రంగంవైపు దృష్టి సారించకుంటే వెండితెర‌పై తెలుగువారు ఎప్పటికీ గర్వించదగ్గ ఆణిముత్యాలు ఆవిష్కృతమయ్యేవి కాదు. వాహినీ స్టూడియోలో సౌండ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తూనే తన నిశిత పరిశీలనతో స్క్రీన్‌ప్లే రచనలో మెలకువలు గ్రహించి అంచెలంచెలుగా ఎదిగి దర్శకత్వం వహించే స్థాయికి చేరుకున్న సృజనకారుడు విశ్వనాథ్. 'మాలపిల్ల, మల్లీశ్వరి, మాయాబజార్' వంటి చిత్రాలు దర్శకులకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చి వారిని ఉన్నత శిఖరాల్లో నిలిపితే మళ్లీ శంకరాభరణం చిత్రంతో విశ్వనాథ్‌కు అంతటి గౌరవం దక్కింది. శంకరాభరణం చిత్రానికి ముందు...ఆ మాటకొస్తే దర్శకత్వం వహించిన తొలి చిత్రం ఆత్మగౌరవం మొదలుకొని ఆయన చేతుల్లో రూపుదిద్దుకున్న చిత్రాలన్నీ ప్రశంసలందుకున్నవే. కాకపోతే శంకరాభరణం ఆయన ఆత్మ. తెలుగు చలనచిత్ర చరిత్రంటే శంకరాభరణం చిత్రానికి ముందూ, తర్వాతా అని అందరూ అనుకుంటున్నారంటే దాని వెనకున్న ఆయన కృషి అసామాన్యమైనది. ఒక సంగీత విద్వాంసుణ్ణి ప్రధానపాత్రగా మలిచిన శంకరాభరణం చిత్రం ఆయన నిర్మించుకున్న బలమైన దుర్గం. అనంతరకాలంలో దాన్ని దాటి ఆయన బయటకు రాలేకపోయారన్న విమర్శలు లేకపోలేదు. అయితే అవన్నీ కథాపరంగా వేటికవే విలక్షణమైనవి. వాటిలో అంతర్లీనంగా ఉండేసందేశాలూ భిన్నమైనవి. ఏ కులవృత్తయినా గౌరవప్రదమైనదని, దాని ముందు ఎంతటి సిరిసంపదలైనా వెలవెలబోతాయని చాటే 'స్వయంకృషి', ఎంతో ఎత్తు ఎదగటానికి ఆస్కారమున్న నృత్య కళాకారుడు జీవితంలో ఓడిపోయిన వైనాన్ని చూపే 'సాగరసంగమం', పెళ్లంటే ప్రేమంటే తెలియని అమాయక యువకుడికి నిస్సహాయ యువతితో ముడివేసిన 'స్వాతిముత్యం', కులాల అంతరాలను పెంచిపోషించే ఆచారాలను ప్రశ్నించే గుణమే అన్నిటికన్నా ప్రధానమైనదని చాటిచెప్పే 'సప్తపది', ఎంత ఎత్తుకు ఎదిగినా శిష్యుణ్ణి చూసి అసూయపడి, అతని ప్రాణాన్నే బలిగొన్న గురువు వైనాన్ని చూపిన 'స్వాతికిరణం'... ఇలా ఎన్నెన్నో విలక్షణ చిత్రాలు ఆయనవి.

ఏ తరాన్నయినా ప్రభావితం చేయగల, స్ఫూర్తినింపగల కథనాలతో విశ్వనాథ్ చిత్రాలు నిర్మించటం యాదృచ్ఛికం కాదు. సినిమా ఎంత పదునైన ఆయుధమో గ్రహించి, దాన్ని చాలా బాధ్యతాయుతంగా ఉపయోగించాలని తొలినాళ్లలోనే గ్రహించాడాయన. 'సమాజానికి మంచి చేయకపోయినా ఫర్వాలేదు...చెడు చేయకుండా జాగ్రత్త వహించటం నా కర్తవ్యమని భావిస్తాను' అని ఒక ఇంటర్వ్యూలో విశ్వనాథ్ చెప్పిన వైనాన్ని గుర్తించుకుంటే ఆయన ఔన్నత్యం అర్థమవుతుంది. ఈ క్రమంలో ఆయనకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతోసహా ఎన్నో పురస్కారాలు లభించాయి. ఎన్టీఆర్, అక్కినేని మొదలుకొని కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, వెంకటేష్, శ్రీకాంత్ వరకూ ఎందరో హీరోలతో ఆయన సినిమాలు రూపుదిద్దుకున్నాయి. వీరిలో అత్యధికులకు అప్పటికే ఉన్న ఇమేజ్‌కు భిన్నమైన పాత్రలిచ్చి, వారి అభిమానులతో సైతం ప్రశంసలు పొందటం సామాన్యమైన విషయం కాదు. అదే సమయంలో అంతక్రితం ఎవరికీ పరిచయం లేని సోమయాజులు వంటివారిని సైతం ప్రధాన పాత్రల్లో నటింపజేసి వారికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టారు. ఆరోజుల్లో ఎక్కడికెళ్లినా సోమయాజులుకు పాదాభివందనాలు ఎదురయ్యేవంటే శంకరశాస్త్రి పాత్ర ప్రజల్లో ఎంతటి బలమైన ముద్రవేసిందో తెలుస్తుంది. ఆయన నిర్మించిన చిత్రాలకు పనిచేసిన నటీనటులైనా, గీత రచయితలైనా ప్రేక్షకులకు ఎంత దగ్గరయ్యారంటే... తదనంతరం ఆ చిత్రాల పేర్లే వారి ఇంటిపేర్లుగా మారిపోయాయి. సిరివెన్నెల సీతారామశాస్త్రి, శుభలేఖ సుధాకర్, శంకరాభరణం రాజ్యలక్ష్మి తదితరులు ఇందుకు ఉదాహరణలు. ఇక నటుడు సోమయాజులకైతే శంకరాభరణంలోని శంకరశాస్త్రి పాత్ర పేరే అసలు పేరుగా స్థిరపడిపోయింది. సంగీత, సాహిత్యాలకు పెద్ద పీట వేసే నైజం కనుకే విశ్వనాథ్ చిత్రాల ద్వారా వేటూరి, సీతారామశాస్త్రి వంటి అపురూపమైన గీత రచయితలు పరిచయమయ్యారు. సుదీర్ఘకాలంపాటు చిత్ర పరిశ్రమలో దిగ్గజాలుగా వెలుగులీనారు. జాతీయ స్థాయిలో తెలుగువారికి తొలిసారి ఉత్తమ చిత్రంగా స్వర్ణకమలంతోపాటు మరో 3 అవార్డులు కట్టబెట్టిన చిత్రం శంకరాభరణం. ఇక ఆస్కార్‌కు భారత అధికారిక నామినేషన్‌గా వెళ్లిన తొలి తెలుగు చిత్రం స్వాతిముత్యం. 93 ఏళ్ల వయసులో కన్నుమూసే ముందురోజు కూడా ఆయన ఓ పాటను కుటుంబ సభ్యులకు చెప్పి రాయించారని విన్నప్పుడు విశ్వనాథ్ గొప్పతనం అర్థమవుతుంది. నిరంతర అధ్యయనం, నిశిత పరిశీలన ఉన్నవారి మెదడు ఎప్పటికీ సారవంతమైనదే. వారు ఎప్పటికీ సృజనకారులే. నిత్య యవ్వనులే. చిరంజీవులే. ఆయన స్మృతికి 'సాక్షి' వినమ్రంగా నివాళులర్పిస్తోంది.

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రతిఫలించేదెప్పుడు!

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు వంటి వాటన్నింటినీ వాగ్దానం చేస్తున్న భారత రాజ్యాంగ నిర్దేశాలకు విలువే లేకుండా పోతోంది. అతి కొద్దిమందిగా ఉన్న అత్యధిక సంపన్నులను ఒక వైపు, అత్యధికులైన అతి పేదలను మరొక వైపు చూస్తున్నాం. ఈ విషయంగా మనం తప్పక బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలను మననం చేసుకోవలసిన అవసరం ఉంది. సామాజిక అసమానతల్ని తొలగించే క్రమంలోనే ఆర్థిక అసమానతలూ తొలగాలని అంబేడ్కర్ అన్నారు. అలాగే దేశంలోని ప్రజలందరూ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సాంకేతిక రంగాలన్నింటిలో సమానతను సాధించుకోవడమే రాజ్యాంగ లక్ష్యమని బాబాసాహెబ్ స్పష్టంగా ప్రకటించారు. ఆ మార్గంలో నడవడం మన పాలకుల ధర్మం.

భారతదేశాన్ని ఎందరో పరిపాలించారు. వారందరికీ భారతదేశం అర్థం కావాలని ఏమీ లేదు. ఆర్యులకు, యవనులకు, కుషానులకు, అరబ్బులకు, మొఘలులకు, బ్రిటిష్ వాళ్ళకు కూడా భారతదేశం అర్థం అయ్యిందని చెప్పలేం. వారంతా మూలవాసుల్ని అణచివేయడానికి ప్రయత్నించిన వారే. సామరస్యమూ, శాంతి, ప్రేమతో కూడిన మూలవాసుల భావనలను ధ్వంసం చేసే క్రమంలో వారంతా భారత చరిత్ర వక్రీకరణకు కారణం అయినవారే. ప్రస్తుత పాలకులు సైతం మన పూర్వ పాలకుల్లా నిజమైన సంస్కృతీ వికాసం మతవాదుల్లో ఉందనే నమ్ముతున్నారు. నిజానికి ఆ వికాసం హేతువాదులు, భౌతికవాదులు, అంబేడ్కర్ వాదులు, లౌకికవాదుల్లో వుంది. అసలు భారతదేశానికి మొదటి దర్శనం చార్వాక దర్శనం, రెండవ దర్శనం జైన దర్శనం, మూడు బౌద్ధ దర్శనం, నాలుగు సాంఖ్య దర్శనం. ఇవన్నీ నిరీశ్వర వాద దర్శనాలే. బౌద్ధ దర్శనం సాంఘిక సమానత్వానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలబడింది. అది మూలవాసుల నుండి జనించింది. మానవాళి పట్ల దయార్ద్ర దృష్టితో మెలగడం కరుణ అనీ, సాటి వారి పట్ల సౌహార్ద్ర దృష్టిని కలిగి ఉండటమే మైత్రి అనీ, ఈ సౌశీల్య విధానాలు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పాటించాలనీ బుద్ధుడు ప్రబోధించాడు. వ్యక్తి నిర్మలత్వానికి కూడా ఆయన ప్రాధాన్యం ఇచ్చాడు. బుద్ధుని సిద్ధాంతాలు.. అప్పటి వరకు వైదిక సంస్కృతి ఆచరణలోకి తీసుకు వచ్చిన మూఢ నమ్మకాలను, యజ్ఞ యాగాదులను, వ్యక్తి స్వార్థాన్ని, దుష్ట ప్రవర్తనను ఖండించి నూత్న సామాజిక దృక్పథాన్ని కలిగించాయి. క్రీ.పూ. 6వ శతాబ్దం నుండే భారతదేశం బౌద్ధ సంస్కృతిలో నడిచింది.

భారత రాజ్యాంగంలో అంబేడ్కర్ ఈ బౌద్ధ సూత్రాలనే పొందుపరిచారు. ఆ ప్రకారం.. ఏ మతానికి చెందిన పాలకులైనా ఆ మతాన్ని వ్యక్తిగతంగానే ఉంచుకోవాలిగానీ, దాన్ని రాజ్యం మీద రుద్దకూడదు. అయితే మతం, మతస్వేచ్ఛ గురించి చర్చించుకునే క్రమంలో మనం ప్రధానంగా గమనించాల్సింది ఏమిటంటే లౌకిక భావంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వాలే మతతత్వాన్ని ప్రేరేపిస్తుండటం! మరోవైపు సుసంపన్నమైన దేశంగా పరిగణన పొందుతున్న మన నేలలో ఆకలి చావులతో మరణిస్తున్న వారి సంఖ్య పెరగడం ఆశ్చర్యం కలిగించే విషయం. ముఖ్యంగా అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. కుల, మత, అసమానతలు నిరంతరం వృద్ధి చెందుతున్నాయనీ; అణచివేతలు, గృహహింస విపరీతంగా పెరిగిపోతున్నాయనీ సామాజిక సర్వేలు చెపుతున్నాయి. ఇదే సమయంలో కార్పొరేట్ పెట్టుబడిదారీ సామ్రాజ్యాన్ని కొన్ని శక్తులు యథేచ్ఛగా విస్తరించుకుంటూ వెళ్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ ప్రైవేటు వ్యక్తులకు అధీనం చేయడం వల్ల భారతదేశంలో దళిత బహుజన యువకులకు ఉద్యోగ వసతి గగన కుసుమం అయింది.



వ్యవసాయరంగం దారుణంగా దెబ్బతిన్నది. అయితే ఇది వ్యవసాయ ఉత్పత్తులు తగ్గడం మూలాన కాదు. వ్యవసాయ ఉత్పత్తి ధరలు విపరీతంగా పడిపోవడం వల్ల. దీంతో వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోయింది. రైతులు రుణగ్రస్థులయ్యారు. లక్షలాదిమంది జీవన వ్యవస్థలు కుంటుపడ్డాయి. గ్రామాల నుంచి వలసలు పెరిగాయి. ఈ సంక్షోభం నుండి రైతాంగాన్ని కాపాడటానికి బదులు పాలకులు వ్యవసాయ రంగం కార్పొరేటీకరణను ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచ వాణిజ్య (డబ్ల్యూటీఓ) షరతులు కూడ మన దేశ రైతాంగానికి ప్రతికూలంగా ఉన్నాయి. అధికార పార్టీ తన సంఖ్యాబలంతో పార్లమెంటరీ కమిటీల పరిశీలనలు, పార్లమెంటరీ ప్రొసీజర్లు లేకుండానే చట్టాలకు దారి ఏర్పరుచుకుంటోంది. ముఖ్యమైన చట్టాలు ఎలాంటి చర్చ లేకుండా గందరగోళాల మధ్యనే ఆమోదం పొందుతున్నాయి. అందుకే పార్లమెంట్‌లో అంతర్గత నియంతృత్వం కొనసాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. పార్లమెంట్ పట్ల తన జవాబుదారీతనం నుండి ప్రభుత్వం తప్పుకుంటున్నది. నూట పదకొండుమంది ఎస్సీ, ఎస్టీ ఎంపీలు పార్లమెంట్‌లో సామాజిక న్యాయాన్ని సాధించటంలో నిరంతరం విఫలం అవుతున్నారు. మహిళా ఎంపీల హక్కుల పోరాట స్వరాలు నిష్ఫలం అవుతున్నాయి.

సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు వంటి వాటన్నింటినీ వాగ్దానం చేస్తున్న భారత రాజ్యాంగ నిర్దేశాలకు విలువే లేకుండాపోతోంది. పేదలకు భూమి పంపకం లేదు. గిరిజనుల భూములకు రక్షణ లేదు. ఆదివాసుల జీవన ప్రమాణాలు, విద్యా వైద్య వసతులు నానాటికీ కుంటుపడుతున్నాయి. రక్తలేమితో బాధపడుతున్న స్త్రీల సంఖ్య పెరుగుతోంది. గర్భవతులకు, వితంతువులకు సంరక్షణ లేదు. ఆర్థిక సామాజిక, రాజకీయ అంతరాలు ఎక్కువవుతున్నాయి. అతి కొద్ది మందిగా ఉన్న అత్యధిక సంపన్నులు ఒకవైపు, అత్యధికులైన అతి పేదలు మరొక వైపు అన్నట్లుగా ఉంది. ఈ విషయంగా మనం తప్పక బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలను మననం చేసుకోవలసిన అవసరం ఉంది.

సామాజిక అసమానతల్ని తొలగించే క్రమంలోనే ఆర్థిక అసమానతలూ తొలగాలని చెబుతూ అంబేడ్కర్... శ్రామికవర్గం హక్కులు, ప్రాతినిధ్యం, సాధికారతల గురించి చాలా నిశితమైన వివరణల్ని 1943 సెప్టెంబర్ 6, 7 తేదీల్లో కొత్త ఢిల్లీలో జరిగిన కార్మిక సమ్మేళనంలో వ్యక్తపరిచారు. అందులోని చాలా అంశాల ఉల్లంఘన నేడు మనకు దృశ్యీకృతం అవుతోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ కింద అత్యధికుల అభీష్టం మేరకు శాసన, పాలనా విధానాలు అమలవుతున్నాయి.

ఎవరైతే సంఘానికి ఆర్థిక నిర్మాణాన్ని దేశ సామాజికత ఆధారంగా రూపకల్పన చేయదలిచారో... వారు ప్రాథమిక ఆవశ్యకతను విస్మరించకుండా తమ లక్ష్యాన్ని పూర్తిచేయాలని గుర్తుంచుకోవాలి. సంఘ ఆర్థిక నిర్మాణాన్ని రాజ్యాంగం నిర్దేశించాలన్న ప్రతిపాదన నిర్వివాదాంశం. ఆర్థిక నిర్మాణ విధానం ఎలా ఉండాలన్నదే మిగిలి ఉన్న ప్రశ్న. దానిని ఈ మూడు విధానాల నుండి ఎంపిక చేయాలి. 1. పెట్టుబడిదారీ విధానం, 2. సోషలిజం, 3. కమ్యూనిజం. మరి శ్రామికుల ఎంపిక ఎలా ఉండాలి? శ్రామికులు పెట్టుబడిదారీ విధానాన్ని ఎంపిక చేసుకోలేరు, ఆ విధంగా పెట్టుబడిదారీ విధానాన్ని ఎంపిక చేసుకుంటే శ్రామికులు వారి స్వేచ్ఛను కోల్పో తారు. అందుకే వారి భవితవ్యానికి ముఖ్యమైన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ, సంతోషాలు పొందడంలో ప్రజాస్వామ్య దేశాలు అవలంబించవలసిన మార్గాలు ఏంటంటే... ప్రభుత్వ అధికారాన్ని రాజకీయ రంగంలో తక్కువగా జోక్యం చేసుకోనివ్వడం; చాలా శక్తిమంతమైన వ్యక్తుల ఆధిక్యతను అణచటానికి సాధారణ శాసనాధికారాన్ని మేల్కొల్పి, తక్కువ శక్తిమంతమైన ఆర్థికరంగంపై అసంబద్ధమైన ఇబ్బందులను విధించకుండా ఉండడం.

ఈ విధమైన అంబేడ్కర్ ఆలోచనలు రాను రాను భారతీయ సమాజాన్ని పునర్నిర్మించడానికి అత్యవసరం అవుతున్నాయి. ఆయన రాజ్యాంగ రచనకు ముందూ, వెనుకా అన్ని తరగతుల ప్రజల జీవన ప్రమాణాలను దర్శించారు. ''భారతదేశానికి అనేక మతాలు వచ్చాయి, అనేక మతాలు ఇక్కడే ఆవిర్భవించాయి. అయితే ఏ మతాధిపత్యంలోకీ భారతదేశం వెళ్లకూడదు. భారతదేశం లౌకిక రాజ్యంగానే మనగలగాలి. భారతదేశంలో ప్రతీ పౌరుడు ఒకే సామాజిక, ఆర్థిక, రాజకీయ గౌరవాన్ని కలిగి ఉండాలి. అలా ఉన్నప్పుడే నేను రూపొందించిన రాజ్యాంగం అన్ని దిశలా ప్రతిఫలిస్తుంది'' అని అంబేడ్కర్ భావించారు. రాజ్యాంగ రూపకల్పన కృషిలో అంబేడ్కర్ తన ఆరోగ్యాన్ని కూడా పణంగా పెట్టారు. భారతదేశంలోని ప్రజలందరూ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సాంకేతిక రంగాలన్నింటిలో సమానతను సాధించుకోవడమే ఈ రాజ్యాంగం లక్ష్యమని ఆయన ప్రకటించారు. ఆ మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళిత ఉద్యమ నేత । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చిక్కిపోతోంది



వాస్తవంగా చూస్తే కనుక (ఇన్ రియల్ టెర్మ్స్) బడ్జెట్‌లో పిల్లల పోషకాహారానికి దక్కుతున్న ప్రాధాన్యం 2014–15 సంవత్సరం నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చి ఇప్పుడు 40 శాతానికి పైగా పడిపోయింది. చూస్తూ ఉందాం... ఇంకా వీళ్లెంత కిందికి దించేస్తారో!

– రోడ్ స్కాలర్స్, ఎన్జీవో

గ్రేట్ ఇండియన్ సర్కస్



ఈ సర్కస్‌లో చాలా రింగ్‌లు ఉన్నాయి. రింగ్‌లో మళ్లీ రింగులు ఉన్నాయి. మన భారతీయ ప్రజలం వట్టి విదూషకులం. మరి రింగ్ మాస్టర్ ఎవరు? చెప్పండి ఎవరో? (అదానీ గ్రూప్ గురించి).

– విశాల్ దద్లానీ, సంగీతకారుడు

స్లోగన్ మార్చండి



'ఖర్చుపెట్టండి – నిర్మించండి – అభివృద్ధి చెందండి'... అన్ని పడవల్నీ ఆటుపోట్ల నుంచి ఒడ్డుకు చేర్చే నినాదం! అదే మనుషులు. అవే మాటలు! పని చేయని మంత్రాన్ని ప్రతి ఏడూ వినీ వినీ అలసట వస్తోంది.

– సునీత్ అరోరా, జర్నలిస్ట్

మీ మీదే నమ్మకం



మూడు దశాబ్దాలుగా ఇండియా ప్రపంచ స్థాయి స్టాక్ మార్కెట్‌ను నిర్మించుకుంటూ వస్తోంది. మధ్యతరగతికి ఎంతో సంపదను అందించింది. ఇప్పుడు ఈ వ్యవస్థ అనేక సందేహాలకు గురవుతున్నందుకు బాధగా ఉంది. రెగ్యులేటర్‌లు రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా తమ పాత్రను పోషించినప్పుడే తిరిగి పరిస్థితి చక్కబడుతుంది.

– షోయబ్ డ్యానియేల్, పొలిటికల్ ఎడిటర్

వింగ్ మాస్టర్



పాకిస్తాన్ ముస్లిం లీగ్ తన యూత్ వింగ్ అధ్యక్షుడిగా 60 ఏళ్ల కెప్టెన్ సఫ్దర్‌ను నియమించింది. తర్వాత అతను యు–19 క్రికెట్ జట్టులో కనిపించినా ఆశ్చర్యం లేదు.

– ఇంతియాజ్ మహమూద్, ఫ్రీ థింకర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మెయిన్స్ సమస్య

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 మెయిన్స్ ప్రధాన పరీక్షలను ఒక్క హైదరాబాద్‌లోనే నిర్వహించాలని అనుకోవడం సరికాదు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షలు రాసే వేల అభ్యర్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వారం రోజులు వివిధ హాస్టళ్లలో, హోటళ్లలో ఉంటూ పరీక్షలు రాయడం అనేది ఆర్థికంగానే కాక... మానసిక, శారీరక, సర్దుబాటు సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీనివల్ల అందరు అభ్యర్థుల సమాన అవకాశాలు దెబ్బ తింటాయి.

యూపీఎస్సీ మెయిన్స్, జేఈఈ మెయిన్స్ పరీక్షలు దేశవ్యాప్తంగా అనేక రోజులు జరుగుతుండగా టీఎస్ పీఎస్సీ కేవలం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించలేదా? ఇంతకుముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు అనేక నగరాల్లో ప్రశాంతంగా నిర్వహించింది. మొన్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా జరుగగా హైదరాబాద్‌లోనే సమస్యలు తలెత్తాయి. వికేంద్రీకరణ యుగంలో టీఎస్‌పీఎస్సీ తన సౌలభ్యం దృష్ట్యా కాక, అభ్యర్థుల సౌకర్యార్థం దృష్ట్యా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో అయినా గ్రూప్–1 ప్రధాన పరీక్షలు నిర్వహించాలి. అలా కాకపోతే రాజ్యాంగం ప్రసాదించిన సమాన అవకాశ హక్కును అందరూ పొందకుండా నిరోధించడమే !

– శాగ శ్రీనివాస్, చిన్న పెండ్యాల, జనగామ జిల్లా

పాత మోటర్లతోని ఫాయిద లేదు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులు గా పాన్ డబ్బ కాడ జమైతరు. సిగిలేట్లు దాగెటోల్లు సిగిలేట్లు దాగుతుంటరు. పాన్లు దినెటోల్లు పాన్లు దింటుంటరు. గీ సంగతి గా సంగతి అనకుంట అన్నిటి మీద నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెడుతుంటరు.

నేను బోక ముందు గాల్లు ఏం మాట్లాడింర్రో నాకైతె ఎక్కలేదు. గని నేను బోయినంక గాల్లు గిట్ల ముచ్చట బెట్ట బెట్టిన్రు.

''తెలంగానలనే గాకుంట కడ్మ రాష్ట్రలల్ల బీఆర్‌ఎస్ ఆఫీస్లు తెర్సెతందుకు కేసీఆర్ ఒక్క తీర్గ కోషిష్ జేస్తున్నడు'' అని సత్నారి అన్నడు.

''ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్ గీనడ్మనే బీఆర్‌ఎస్ల గల్సిండు. గాయిన దప్పు గొట్టుట్ల మషూర్. ఇక ముంగట గాయిన దేసంల కేసీఆర్ దప్పు గొడ్తడు'' అని ఇస్తారి అన్నడు.

''గమాంగ్ అసువంటోల్ల గురించే బీఆర్‌ఎస్ ఒక్క తీర్గ లెంకుతున్నది. కేసీఆర్ అస్సయ్ అంటె అదే సై. దులా అంటె ఇదే సై అనేటి లీడర్లు గావాలె. గాయిన పాటనే పాడేటి చెంచగాల్లు గావాలె. గసువంటోల్ల గురించి కేసీఆర్ దుర్బిని దీస్కోని లెంకుతున్నడు.''

''గాంది దేసంకు సతంత్రం దెచ్చిండు. గదే తీర్గ కేసీఆర్ తెలంగానకు సతంత్రం దెచ్చిండు. గాయిన జాతి పిత అయితె గీయిన తెలంగాన పిత. అశోకుడు చెట్లు బెట్టిచ్చిన తీర్గ కేసీఆర్ యాద్గిరి గుట్ట గుడి గట్టించెను. వాస్తు ప్రకారం సెక్రటేరియట్ గట్టిచ్చెను. పెద్ద అంబేడ్కర్ బొమ్మ పెట్టిచ్చెను. గీ తీర్గ రాసిన పాటాలు పదో తరగతి చరిత్ర వయ్యిల ఉంటయట. కేసీఆర్ బొమ్మ బెట్టి దినాం గా దాన్కి పాలతోని అబిసేకం జేస్తరట. దేసమంతట కేసీఆర్ బజన సంగాలు బెడ్తరంట''

''ఎండల తిర్గకుంటె విటమిన్ డి తక్వ అయితది. విటమిన్ డి తక్వ అయితె పెయ్యి కరాబైతది. రోగాలొస్తయి. గదే తీర్గ జెనం నడ్మ లీడర్లు ఒర్గకుంటె గాల్ల పేరు కరాబైతది. గాల్లకు, గాల్ల పార్టీలకు ఓట్లు ఎవ్వరు ఎయ్యరు. గీ సంగతి ఎర్కయ్యే బట్కెనే రాహుల్ గాంది కన్యాకుమారి కెల్లి కశ్మీర్ దాంక భారత్ జోడో పాదయాత్ర జేసిండు. పాదయాత్ర జెయ్యక ముందు గాయినను అందరు పప్పు అనెటోల్లు. గని గిప్పుడు నిప్పు అంటున్నరు. పప్పు లోకేశ్ గుడ్క యువగళం అన్కుంట పాదయాత్ర షురువు జేసిండు. యువగళం టీడీపీకి సర్వ మంగళం అని కొందరంటున్నరు. తెలంగానల కాంగ్రెస్ లీడర్లు హాత్ సే హాత్ జోడో పాదయాత్రలు జేస్తమంటున్నరు. బీజేపీ తెలంగాన ప్రెసిడెంట్ బండి సంజయ్ పాదయాత్ర జేసిండు. గాయిన లెక్కనే అన్ని రాష్ట్రాల బీజేపీ లీడర్లు పాదయాత్రలు జెయ్యాలె. నేనైతే



గాలిమోటర్ల దిర్గుత అని 'అందర్కీ బాత్ల' ప్రతాని మోదీ అన్నడు''

''మోదీది దన్ కీ బాత్. నాది మన్ కీ బాత్. నా మనసుల ఉన్న మాటనే నేను మీదికి జెప్త. గిప్పుడు మా పార్టీ బొంత పురుగసుంటిది గాదు. రంగు రంగుల సీతాకోక చిల్క. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్. అంటె రైతే రాజు. రాజు అయ్యేటి రైతెవ్వడు? అని కొందరన్న అడుగుతరు. నేను యాడాదిల ఎక్వ దినాలు ఫాం హౌస్లనే ఉంటున్న. ఫాం హౌసంటె ఏంది. పొలంల ఇల్లు. గా ఇంట్లనే ఉండుకుంట నేను ఎవుసం జేస్తున్న. ఎవుసం జెయ్యబట్కె నేను రైతును. అంటె కిసాన్‌ను. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటె అబ్ కీ బార్ కేసీఆర్ సర్కారని అర్థం''

''గాడెవడో మస్తు పైసలున్నోడు ముసలితనం రాకుంట ఉండెతందుక్కు పదిమంది డాక్టర్లతోని ఇలాజ్ జేయించుకుంటున్నడు. గందుకు దినాం కోట్ల రూపాయలు కర్సు జేస్తున్నడు. ఎలచ్చన్ల ఓడకుంట ఉండెతందుక్కు లీడర్లు కోట్ల రూపాయలు కర్సు జేస్తున్నరు. ఎలచ్చన్లను దీసెయ్యాలె. జెనంకు ఓట్లేసే పని లేకుంట జెయ్యాలె. పోలింగ్ వొంతకు హర్రాజ్ బెట్టాలె. హర్రాజ్ల ఎక్వ పాట బాడి నోనికే ఎమ్మెల్యే కుర్సి ఇయ్యాలె. హర్రాజ్ల వొచ్చిన రూపాయలతోని కొత్త పద్కాలు బెట్టొచ్చు. హర్రాజ్ల వొచ్చిన రూపాయలను ఉన్న పద్కాల కోసం కర్సు జెయ్యొచ్చు'' అని సిగిలేటు దాక్కుంట యాద్గిరి అన్నడు.

''యాదాడి కెల్లి దలిత బందును బంద్ బెట్టింద్రు. సర్పంచులకు ఫండ్స్ ఇస్తలేరు. సర్కార్ జీతగాల్లకు పహిలి తారీఖ్‌కు జీతాలు బడ్త లేవు. గని కొత్త సెక్రెటేరియట్ల సీఎం పేషిని శాన్దార్ల గట్టింద్రు. గది మయసబ లెక్క ఉన్నదంటున్నరు. లోపటి పరే షాని ఎవ్వలికి గండ్లబడదు. మీది షేర్వాని అందరికి గండ్ల బడ్తది. గందుకే షేర్వాని అసువంటి సీఎం పేషిని రాజ మందిరం లెక్క గట్టింద్రని బీఆర్‌ఎస్ లీడర్లు అంటున్నరు'' అని పాన్ దినుకుంట లచ్చినారి అన్నడు.

''పార్లమెంటుల ఆర్తిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ స్పీచ్ గొట్టుకుంట రీప్లేసింగ్ ఓల్డ్ పొలిటికల్ అని నాల్కె కొరుక్కోని రీప్లేసింగ్ ఓల్డ్ పొల్యూటెడ్ వెహికల్స్ అని అన్నది. అంటె పొగ ఇడ్సేటి పాత మోటర్లను దీసెయ్యాలె అని అనబోయి తీసెయ్యాలె పాత రాజకీయ అని నడ్మల ఆపేసి గామె నాల్కె కొరుక్కున్నది. పాత రాజకీయ నాయకులను తీసెయ్యాలె అని గామె అనబోయినట్లు గొడ్తున్నది. పాత మోటర్లు ఇడ్సేటి పొగతోని గాలి కరాబైతది. కరాబైన గాలితోని రోగాలొస్తయి. ఆర్థిక మంత్రి తప్పితారి నిజమే జెప్ప బోయింది. పాత లీడర్లు పాత మోటర్ల అసుంటోల్లే గదా'' అని లచ్చినారి.


నాత్రి తొమ్మిది గొట్టెదాంక ముచ్చట బెట్టి ఎవలింటికి గాల్లం బోయినం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

ప్రశ్నించే ధైర్యాన్నిచ్చి...

భారతదేశ తాత్విక ఉద్యమాలలో భక్తి కవులదొక అధ్యాయం. ఆ కవులలో సంత్ రవిదాస్ ఒకరు. పధ్నాలుగో శతాబ్దంలో హిందూ సమాజంలో కులం పేరుతో అసమానతలు, అంటరానితనం తీవ్రంగా ఉన్న రోజుల్లో తన భక్తిగీతాల ద్వారా భక్తి ఉద్యమానికి ఆయన పూనుకున్నారు. చర్మకారుల కుటుంబంలో పుట్టి సామాజిక తత్త్వవేత్తగా అనేకమందిని ఆకట్టుకున్న ప్రబోధకుడు ఆయన. అంబేడ్కర్ స్ఫూర్తి పొందిన భక్తి కవులలో కబీర్, సంత్ రవిదాస్‌లు ముఖ్యులు. కులం మానవత్వానికి అడ్డుగోడలు కడుతుందని ఆనాడే ఆయన హెచ్చరించారు. ఇటీవల ఆయన బంగారు విగ్రహాన్ని జలంధర్ నుంచి కాశీ వరకూ కొందరు మోసుకొచ్చారంటే... ఆయన ప్రభావమేమిటో అర్థం చేసుకోవచ్చు.

సంత్ రవిదాస్ క్రీ.శ. 1377లో కాశీవద్ద సీర్ గోవర్ధనపురం అనే గ్రామంలో, మాఘ పూర్ణిమ రోజున జన్మించారు. అంటరానివారి కోసం ఆధ్యాత్మిక రంగంలో ఆయన ఉద్యమించారు. సంత్ జీవితాంతం తన చర్మకార వృత్తిని అవలంబిస్తూనే అత్యంత నిరాడంబరంగా బతికారు. ఆయన శిష్యులలో కాశీమహారాజు, రాజస్థాన్‌కు చెందిన భక్త మీరాబాయి, ఆమె అత్త రాణీ ఝాలీదేవి వంటి కులీనులూ; పండితులూ, సామాన్యులూ... ఇలా అన్ని వర్గాలవారూ ఉన్నారు. చిత్తోడ్ రాజు రాణా సంగా, రాణి ఝాలీ దేవిల అభ్యర్థన మేరకు రవిదాస్ దంపతులు చిత్తోడ్ వెళ్లారు. వీరికి అక్కడ రాజమర్యాదలతో స్వాగతం లభించింది. మహారాజు వద్ద అతిథులుగా కొంతకాలం రవిదాస్ దంపతులు ఉన్నారు. చిత్తోడ్ కోటలోనే ఆయన తన 120వ ఏట భగవంతునిలో లీనమయ్యారని చెపుతారు.



'ఎక్కడైతే అందరికీ భోజనం లభిస్తుందో, ఎవరూ ఆకలితో నిద్రపోరో, ఎక్కడ ఎక్కువ తక్కువల అసమానతలు లేకుండా ప్రజలు జీవిస్తూ ఉంటారో... అలాంటి సమాజాన్నీ, అలాంటి పాలనా వ్యవస్థనూ' రవిదాస్ ఆశించారు. 'కులం గురించి ఎవరూ, ఎవర్నీ అడగకూడదు. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అందరూ మనిషి కులానికి చెందినవారే. మానవత్వమే పరమ ధర్మం' అని ఆయన బోధించారు. రవిదాస్ భక్తి ఉద్యమంలో కుల వ్యతిరేక పోరాట దృక్పథం ఉంది. మతాలూ, కులాలూ, దేవుళ్లూ... మానవత్వం తరువాతేనని ఆయన ప్రబోధించారు. రవిదాస్ తనను తాను చమర్‌గా పేర్కొంటూ... కులాలను దేవుడు సృష్టించలేదనీ, వాటిని మనిషే సృష్టించాడనీ స్పష్టంగా చెప్పారు. మనిషి పీల్చుతున్న శ్వాస బ్రాహ్మణుడిదైనా, చండాలునిదైనా ఒక్కటే అయినప్పుడు మనుషులలో ఎక్కువ తక్కువలు ఎందుకని ప్రశ్నించాడు.

ఆయన పదాలు బనారస్ దాటి ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్‌ల వరకూ ప్రవహించాయి. తన సాహిత్యం ద్వారా ఎవరినైనా ప్రశ్నించవచ్చనే ధైర్యాన్ని ప్రజలలో నింపారు. ఆ స్ఫూర్తితోనే ఇప్పటికీ కొనసాగుతున్న అసమానతలను రూపు మాపాలి.

– సాకి, కరీంనగర్ । మొబైల్: 99493 94688
(రేపు మాఘ పూర్ణిమ నాడు సంత్ రవిదాస్ జయంతి)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

కనుల పండువగా నృసింహుని కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

యాదగిరిగుట్ట: యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు కల్యాణతంతు నిర్వహించారు. గజవాహనంపై స్వామి వారు, ప్రత్యేక పల్లకీపై శ్రీలక్ష్మీదేవి ఆలయం నుంచి ఆస్థాన కల్యాణ మండపానికి చేరుకున్నారు. వేదపండితులు విష్వక్సేనుడిని ఆరాధించి కల్యాణతంతు ప్రారంభించారు. జంధ్యధారణ, జీలకర్ర బెల్లం ఘట్టాలయ్యాక ఆచార్యులు నిర్ణయించిన శుభముహూర్త ఘడియలు 9.40 గంటలకు శ్రీనృసింహస్వామి వారు శ్రీలక్ష్మీదేవికి మాంగల్యధారణ గావించారు. ఉదయం హనుమంత వాహన సేవపై శ్రీస్వామి వారు ఆలయ తిరువీధుల్లో ఊరేగారు.

మినీ మేడారానికి భక్తుల తాకిడి



సమ్మక్క గద్దెపై మొక్కులు అప్పజెబుతున్న భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క–సారలమ్మల మినీ మేడారం జాతరకు శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. రాష్ట్రాలు, జిల్లాలు దాటొచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, సారె, ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

హాస్టళ్లకు ప్రహరీలు కట్టరుకానీ.. సెక్రటేరియట్ కావాలా?



లక్డీకాపూల్(హైదరాబాద్): హాస్టళ్లకు ప్రహరీగోడలు వద్దు కానీ.. సెక్రటేరియట్‌కు కావాలా? అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆక్షేపించారు. తెలంగాణలో అనేక పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవని, విద్యార్థులకు యూనిఫాంలు ఇవ్వడం లేదని, కానీ సెక్రటేరియట్‌కు రూ.1,200 కోట్ల డబ్బులు ఎలా వచ్చాయని నిలదీశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గానికి చెందిన సీపీఎం మాజీ నేత, సాహసం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ముప్పారం ప్రకాశ్ తన అనుచరులతో కలసి బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఎస్పీని స్థాపించిన కాన్షీరాం, పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతికి ఫాం హౌస్‌లు లేవన్నారు. కేసీఆర్ కుటుంబంలా ఫాంహౌస్‌లు కట్టుకుని, స్కాంలు చేసే పార్టీ కాదన్నారు. దోపిడీ పాలనను అంతం చేసే ఏకైక పార్టీ బీఎస్పీ అని అన్నారు.

కార్యకర్తల అభిప్రాయాలను బట్టే భవిష్యత్ ప్రణాళిక



సాక్షి, మహబూబాబాద్: 'కార్యకర్తలే నాకు బలం. వారి అభిప్రాయాలను బట్టే ఏ పార్టీలో చేరాలనే విషయాన్ని ప్రకటిస్తాను' అని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో పొంగులేటి, కోరం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో తమ అనుచరులను బరిలోకి దింపుతామని చెప్పారు. కేవలం టికెట్ ఇచ్చి నామినేషన్ వేయించడమే కాకుండా వారి గెలుపు బాధ్యత కూడా తనపై వేసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇల్లెందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు సీఎంఆర్ గడువు

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది వానాకాలం, యాసంగికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గడువును కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించింది. ఇప్పటికే పలుమార్లు పెంచిన సీఎంఆర్ గడువు జనవరి 31తో ముగిసినప్పటికీ, ఇంకా 23 లక్షల మెట్రిక్ టన్నుల మేర బియ్యం మిల్లర్ల నుంచి రావలసి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఫిబ్రవరి 28 వరకు సీఎంఆర్ గడువు పొడిగిస్తూ కేంద్ర పౌరసరఫరాల శాఖ కార్యదర్శి అశోక్‌కుమార్ వర్మ లేఖ రాశారు.

కన్నపేగు కన్నీరు!

కన్నబిడ్డలు దూరంపెట్టడంతో అనాథలుగా అమ్మానాన్నలు

కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు ఆమె. ఆమె కొడుకు, ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు అయ్యాయి. కొడుకు, కోడలు ఆమెను ఊళ్లోనే వదిలేసి కామారెడ్డికి వలస వెళ్లారు. తర్వాత కొడుకు బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. ఆమె వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో వంట కూడా చేసుకోలేక ఆకలితో అలమటించింది. కోడలికి సమాచారం ఇచ్చినా రాకపోవడంతో గ్రామస్తుల సాయంతో పోలీసులను ఆశ్రయించింది. వారు కోడలిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం లేదు. వృద్ధురాలు ఇరుగుపొరుగు వారు నాలుగు మెతుకులు పెడితే తిని కాలం వెళ్లదీసేది. ఆవేదనతో ఓ రోజు ఉరివేసుకుంది.



- చివరి మజిలీలో అవస్థలు, అనారోగ్యంతో ఇబ్బందులు
- పిడికెడు మెతుకుల కోసం అలమటిస్తున్న తీరు
- ఇలాంటి బతుకు వద్దంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న కొందరు
- ఆవేదనతోనే జీవచ్ఛవాల్లా గడుపుతున్నవారు ఎందరో..
- ప్రభుత్వమే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలంటున్న సామాజిక వేత్తలు

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బందరామేశ్వర్‌పల్లికి చెందిన ఓ వృద్ధుడు తన కొడుకు పట్టించుకోవడం లేదంటూ ఇటీవల పోలీసులను ఆశ్రయించాడు. ఆయన కష్టపడి ఎనిమిది ఎకరాల భూమి సంపాదించి పెట్టాడు. కుమార్తెలకు పెళ్లిళ్లు అయిపోయాయి. భార్య చనిపోయింది. తాను కష్టపడి సంపాదించిన భూమిని సాగు చేసుకుంటున్న కొడుకు తనకు తిండి కూడా పెట్టక పోవడంతో తల్లడిల్లిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కొడుకును పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా మార్పు రాలేదని ఆ వృద్ధుడు ఆవేదన చెందుతున్నాడు.

సాక్షి, కామారెడ్డి

వారు వయసు మీద పడిన వృద్ధులు.. పిల్లా జెల్లా అంతా ఉన్నా పట్టించుకునేవారు లేక బాధపడుతున్నవారు.. నడిచే శక్తి, పలికే ఓపిక లేక ఇబ్బందిపడుతున్నవారు.. పిడికెడు మెతుకులు పెట్టి, కాసింత చోటు ఇస్తే.. బిడ్డల నీడలో కన్నుమూస్తామని ఆరాటపడుతున్నారు. ఇలాంటి వృద్ధ దంపతుల్లో ఇద్దరు ఉన్నంత కాలం ఎలాగోలా బతికేస్తున్నా.. ఎవరైనా ఒకరు దూరమైన తర్వాత ఒంటరి జీవితం నరకప్రాయంగా మారుతోంది. తోడు కోల్పోయి, బిడ్డల ఆదరణ కరువై మానసికంగా కుంగిపోతున్నారు. వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతూ.. సరైన వైద్యం అందక కన్నుమూస్తున్నారు. మరికొందరు ఈ జీవితం మాకొద్దంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవలికాలంలో చాలా చోట్ల వృద్ధుల బలవన్మరణాలు వెలుగు చూస్తున్నాయి.

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై..

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లోనూ చాలా వరకు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కొన్ని కుటుంబాల్లో తండ్రులే కాదు తాతలు కూడా కలిసి జీవించారు. ఆ పెద్దల మాట మేరకు ఎవరి పనివారు చేసుకుంటూ ఉండేవారు. కొన్నేళ్లుగా ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాయి. చాలా కుటుంబాల్లో కన్నవారిని కూడా భారంగా భావించే పరిస్థితి నెలకొంది. ఉద్యోగం, వ్యాపారం పేరుతో పట్టణాలకు వెళ్తున్నవారు కన్నవారిని ఇంటి దగ్గరే వదిలేస్తున్నారు. ఊర్లలోనూ విడిగా ఉంటున్నారు. దీనితో వృద్ధులు ఒంటరిగా మిగిలిపోతున్నారు.

ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు

ఆర్థికంగా కాస్త వెసులుబాటు ఉన్న కుటుంబాల్లో కొందరు కన్నవారిని ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. తాము ఉద్యోగాలు, వ్యాపారాల్లో బిజీగా ఉండి ఆలనా పాలనా చూడటం ఇబ్బందని చెప్తుకొంటూ డబ్బులు కట్టి ఆశ్రమాల్లో చేర్పిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇలాంటివి ఎక్కువగా ఉంటున్నాయి. ఆశ్రమాల్లో ఉన్న అలాంటి వృద్ధులను కదిలిస్తే చాలు కన్నీటి పర్యంతమవుతున్నారు. అయినా తమ పిల్లలకు చెడ్డ పేరు రావొద్దని బాధను దిగమింగుకుంటున్నారు.

కొందరిని బతికిస్తున్న 'ఆసరా'

ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు ఎంతో మంది వృద్ధుల బతుకులకు 'ఆసరా'గా నిలుస్తున్నాయి. రాష్ట్ర జనాభాలో 41 లక్షల మంది వృద్ధులు ఉండగా.. 15,94,650 మందికి వృద్ధాప్య పింఛన్ అందుతోంది. మందులు, నిత్యావసరాలకు కొంత వరకు పింఛన్ సొమ్ము ఉపయోగపడుతోంది. ఇదే సమయంలో కన్నవారి పింఛన్ డబ్బుల కోసం పిల్లలు వేధిస్తున్న ఘటనలూ ఉన్నాయి.

ఆత్మహత్యల్లో 14% వృద్ధులవే..

తెలంగాణలో జరుగుతున్న ఆత్మహత్యల ఘటనల్లో 14 శాతం వృద్ధులవే ఉంటున్నాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక పేర్కొంటోంది. కన్నబిడ్డల ఆదరణ లేకపోవడం, ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో వృద్ధులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఏడాదిలో తెలంగాణలో 8 వేల పైచిలుకు ఆత్మహత్యలు జరిగితే.. అందులో 12 వందల మంది వరకు వృద్ధులు ఉంటున్నారు.

రాష్ట్ర జనాభాలో వృద్ధులు 11 శాతం

తెలంగాణ జనాభాలో వృద్ధులు పదకొండు శాతం ఉన్నారు. 2021 అంచనాల ప్రకారం రాష్ట్ర జనాభా 3.77 కోట్లుకాగా.. ఇందులో వృద్ధుల సంఖ్య 41 లక్షలు దాటింది. ఇందులో 60–64 ఏళ్ల మధ్య వయసు వారు 12.77 లక్షల మంది.. 65–69 ఏళ్లవారు 10.18 లక్షలు, 70–74 ఏళ్లవారు 8.33 లక్షలు, 75–79 ఏళ్లవారు 5.62 లక్షలు, 80ఏళ్లు పైబడినవారు 4.70 లక్షల మంది ఉన్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ప్రభుత్వం కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



చాలా కుటుంబాల్లో పేదరికం ఇబ్బందులు సృష్టిస్తోంది. తాను, భార్యాపిల్లలు బతకడమే కష్టమని, ముసలివాళ్లను ఎలా పోషించాలంటూ కొందరు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆర్థికంగా ఉన్న కుటుంబాల్లో మరో రకమైన సమస్య ఉంటోంది. తమకు ముసలివాళ్లు అడ్డుగా ఉంటున్నారంటూ ఆశ్రమాలకు పంపడమో, వేరుగా ఉంచడమో చేస్తున్నారు. ఒంటరితనం, సరైన ఆహారం దొరకకపోవడం, పిల్లలు పట్టించుకోకపోవడంతో వృద్ధులు మానసికంగా కుంగిపోతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొన్ని కుటుంబాల్లో చాదస్తం ఎక్కువైందంటూ వృద్ధులను ఇబ్బంది పెడుతుంటారు. నెలలు, ఏళ్ల తరబడి ఒకేచోట ఉండటంతో చాదస్తం వస్తుంది. అందుకే పెద్దలకు నలుగురితో కలిసి ముచ్చటించుకునే అవకాశం కల్పించాలి. మన దగ్గర ప్రభుత్వమే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ సి.వీరేందర్, సైకాలజిస్ట్, హైదరాబాద్



కామారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

దండెత్తిన డ్వాక్రా మహిళలు

కామారెడ్డి టౌన్ : స్త్రీ నిధి, అభయహస్తం, వడ్డీలేని రుణాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డ్వాక్రా మహిళా సంఘాలకు చెందిన 7 వేల మంది మహిళా సభ్యులు శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ గంజ్ నుంచి ర్యాలీ ప్రారంభమై సిరిసిల్ల రోడ్, స్టేషన్‌రోడ్, రైల్వే బ్రిడ్జి మీదుగా నిజాంసాగర్ చౌరస్తాకు చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు రావలసిన రూ.6 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం త్వరలోనే చెల్లించాలన్నారు. రెండ్రోజుల్లో బకాయిలు చెల్లించకుంటే ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు నిరాహారదీక్షకు దిగుతామని స్పష్టం చేశారు. అప్పటికీ స్పందించకుంటే 10 నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

యాదాద్రీశుడి సేవలో గవర్నర్ తమిళిసై

- స్వాగతం పలికిన కలెక్టర్ పమేలా సత్పతి



గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

సాక్షి, యాదాద్రి: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆమెకు ఆలయ తూర్పు త్రితల రాజగోపురం వద్ద ఆచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేకంగా తయారు చేసిన లడ్డూప్రసాదాన్ని దేవస్థానం ఇన్‌చార్జి ఈవో రామకృష్ణారావు గవర్నర్‌కు అందజేశారు. కలెక్టర్ పమేలా సత్పతి పట్టువస్త్రాలు అందజేశారు. గవర్నర్ రోడ్డు మార్గం గుండా యాదాద్రికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గవర్నర్ ఉన్న సమయంలో భక్తులను ఆలయంలోకి అనుమతించలేదు. అంతకుముందు కొండపైన వీఐపీ గెస్ట్‌హౌస్ వద్ద గవర్నర్ పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. విలేకరులు మాట్లాడించేందుకు ప్రయత్నించగా అందరూ సంతోషంగా ఉండాలని అన్నారు.

ఆ కేటాయింపులతో బీసీలకు బిస్కెట్లు కూడా రావు



కాచిగూడ(హైదరాబాద్): కేంద్రం ప్రవేశ పెట్టిన రూ.45 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించి తీరని అన్యాయం చేసిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 వేల కోట్లతో దేశంలోని 75 కోట్ల మంది బీసీలకు పంచడానికి బిస్కెట్లు, చాక్లెట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా దానిని సవరించి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల ఎంత వ్యతిరేకంగా ఉందో బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతోందని, బీసీ వ్యతిరేక వైఖరిని బీజేపీ విడనాడకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జాతీయ బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారే కానీ, ఆర్థికపరమైన స్కీములను ప్రకటించడంలేదన్నారు. సమావేశంలో నీల వెంకటేశ్, గుజ్జ సత్యం, కోల జనార్దన్, భూపేష్ సాగర్, రాజ్‌కుమార్, సుధాకర్, నంద గోపాల్, వేముల రామకృష్ణ, బి.కృష్ణ, శివమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

కళాతపస్వికి కన్నీటి వీడ్కోలు

- అంతిమయాత్రలో పెద్దసంఖ్యలో పాల్గొన్న అభిమానులు
- నివాళులర్పించిన రాజకీయ, సినీప్రముఖులు



భర్త భౌతికకాయం వద్ద విలపిస్తున్న విశ్వనాథ్ భార్య

బంజారాహిల్స్/సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్ (92)కు అశేష అభిమానగణం కన్నీటి వీడ్కోలు పలికింది. ఆయన అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం పంజగుట్ట హిందూ శ్మశాన వాటికలో సంప్రదాయబద్ధంగా జరిగాయి. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి అపోలో ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే. విశ్వనాథ్ పార్థివ దేహాన్ని ఆస్పత్రి నుంచి గురువారం రాత్రి ఒంటి గంటకు ఫిలింనగర్‌లోని స్వగృహానికి తరలించారు. రాత్రి నుంచే విశ్వనాథ్ భౌతికకాయాన్ని సందర్శించేందుకు సినీ, రాజకీయ ప్రముఖులతోపాటు అభిమానులు భారీగా విచ్చేయడంతో పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. శుక్రవారం ఆయన నివాసం నుంచి పంజగుట్ట శ్మశాన వాటిక వరకు అంతిమయాత్ర సాగింది. కళాతపస్విని కడసారి చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం శ్మశాన వాటికలో ఆయన పార్థివదేహాన్ని ఖననం చేశారు.

కన్నీరుమున్నీరైన చంద్రమోహన్

విశ్వనాథ్ భౌతికకాయాన్ని శుక్రవారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీ సంతోష్ కుమార్, సినీ ప్రముఖులు మెగాస్టార్ చిరంజీవి, వెంకటేష్, పవన్ కల్యాణ్, శరత్ కుమార్, రాధిక, రాజశేఖర్, జీవిత, కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం, కె.రాఘవేంద్రరావు, త్రివిక్రమ్ శ్రీనివాస్, రాజమౌళి, అల్లు అరవింద్, బోయపాటి శ్రీను, శేఖర్ కమ్ముల, ఆది శేషగిరిరావు, దగ్గుబాటి సురేష్‌బాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. విశ్వనాథ్ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విశ్వనాథ్ దర్శకత్వంలో సిరిసిరిమువ్వ సినిమాలో హీరోగా నటించిన చంద్రమోహన్ కన్నీరుమున్నీరయ్యారు. విశ్వనాథ్ భౌతికకాయాన్ని చూడటంతోనే ఆయన విలపిస్తూ అక్కడే కుప్పకూలిపోయారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

విశ్వనాథ్ మృతి బాధాకరం: మంత్రి తలసాని

కళాతపస్వి విశ్వనాథ్ మృతి బాధాకరమని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తలసాని ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలు, కళల విశిష్టతను చాటేలా అనేక చిత్రాలు నిర్మించిన గొప్ప దర్శకులంటూ కొనియాడారు.

ఏపీ ప్రభుత్వం తరపున..

విశ్వనాథ్ అంత్యక్రియల్లో ఏపీ ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. ఆయన విశ్వనాథ్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, సంగీత సాహిత్యాలను సృజనాత్మక శైలిలో ప్రేక్షకులకు అందించిన కళాతపస్వి మరణించడం సినీ పరిశ్రమకు తీరని లోటని చెప్పారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి విశ్వనాథ్: ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. 'సినీ ప్రపంచంలో కె.విశ్వనాథ్ ఒక దిగ్గజం. సృజనాత్మక దర్శకుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా సినీలోకంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. వివిధ ఇతివృత్తాలతో తీసిన అతని సినిమాలు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించాయి'.. అని శుక్రవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

అసమాన ప్రతిభావంతుడు: గవర్నర్ తమిళిసై

కె.విశ్వనాథ్ మృతిపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక దిగ్గజ దర్శకుడు, నటుడిని తెలుగు సినీ పరిశ్రమ కోల్పోయిందని తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన తన అసమాన ప్రతిభతో సినీ పరిశ్రమపై చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు.

అరుదైన దర్శక దిగ్గజం: కేసీఆర్

ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ మృతికి సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపం తెలిపారు. అతి సామాన్యమైన కథను ఎంచుకొని.. తన అద్భుతమైన ప్రతిభతో.. వెండి తెర దృశ్య కావ్యంగా మలిచిన అరుదైన దర్శకుడు కె.విశ్వనాథ్ అని కొనియాడారు. గతంలో విశ్వనాథ్ ఆరోగ్యం బాగా లేనప్పుడు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించిన సమయంలో.. సినిమాలు, సంగీతం, సాహిత్యంపై తమ మధ్య జరిగిన చర్చను సీఎం గుర్తు చేసుకున్నారు.

తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారు: జగన్

సాక్షి, అమరావతి: సినీ దర్శక దిగ్గజం కె. విశ్వనాథ్ తెలుగు వారి గుండెల్లో కళాతపస్విగా శాశ్వతంగా నిలిచిపోతారని ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన ట్విట్టర్ ఖాతాలో ట్వీట్ చేశారు. 'విశ్వనాథ్ గారి మరణం తీవ్ర విచారానికి గురిచేసింది. తెలుగు సంస్కృతికి, భారతీయ కళలకు నిలువుటద్దం విశ్వనాథ్ గారు. ఆయన దర్శకత్వం రూపుదిద్దుకున్న చిత్రాలు తెలుగు సినీ రంగానికి అసమాన గౌరవాన్ని తెచ్చాయి' అని పేర్కొన్నారు.

స్పీకర్, మంత్రుల సంతాపం

కె.విశ్వనాథ్ మరణంపై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

సినిమా తీయాలనుకున్నా

విశ్వనాథ్‌తో సినిమా తీయాలన్న తన ఆశ కలగానే మిగిలిపోయిందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. కె.విశ్వనాథ్ మృతికి టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర సంతాపం తెలిపారు.

అంబేడ్కర్ జయంతి రోజే ప్రారంభించాలి

సాక్షి, హైదరాబాద్: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ శుక్రవారం శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో అసెంబ్లీ గేటు దగ్గరకు వచ్చి హడావుడి చేశారు. తాను అసెంబ్లీ లోపలికి వెళ్తానంటూ అధికారులను అడిగారు. పాస్ ఉండాలని పోలీసు చెప్పడంతో.. పార్కుకు వెళ్తానన్నారు. దీనితో పోలీసులు ఆయనను అక్కడి నుంచి తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ కేఏ పాల్ మీడియాతో మాట్లాడుతూ.. మొన్న సచివాలయానికి వెళ్తానంటే అడ్డుకుని అరెస్టు చేశారు. ఇప్పుడు అసెంబ్లీకి వెళ్తానంటే అడ్డుకుంటున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యం అంటారా? అని నిలదీశారు. సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టిన ప్రభుత్వం.. సీఎం కేసీఆర్ పుట్టిన రోజున కాకుండా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదంతో దేవుడే సచివాలయాన్ని ఇప్పుడే ప్రారంభించొద్దని చెప్పాడని అన్నారు. సచివాలయం బిల్డింగే పూర్తికానప్పుడు హడావుడి ఎందుకుని నిలదీశారు. ఇప్పటికైనా పశ్చాత్తాప పడాలని, మనసు మార్చుకోవాలని కేఏ పాల్ హితవు పలికారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY KAKINADA
KAKINADA - 533003, Andhra Pradesh, India.
ENGINEERING DEPARTMENT
e-Procurement Tender Notice
Tender Notice No.04/JNTUK/ED/KKD/ELEC/2022-23, Date:03-02-2023

Sl.No	Name of the Work	Value in Rs. (Approx)
	JNTUK, KAKINADA CAMPUS	
1	Supply, Transportation, Installation, Testing and Commissioning of 315 kVA 3 Phase copper wound transformer for JNTUK Kakinada.	Rs.12.41 Lakhs

The bidders can view/download doc from www.apeprocurement.gov.in market place. Further details contact at Office of Chief Engineer, JNTUK Kakinada. Sd/- Chief Engineer, Ph. No.0884-2300864

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
టెండరు కోరుతూ ప్రకటన
తితిదే ముద్రణాలయానికి 40,000 సం.ల తెలుగు పంచాంగములు 2023-2024 ముద్రించడానికి మరియు సరఫరా చేయడానికి ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు వివరాల కోసం NIT. Roc.No.TTD-44021(39)/1/2021-Press SEC-TTD చూడండి. http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌కు లాగాన్ అవండి. తదుపరి వివరాలకు సంప్రదించండి: 0877-2264355 (లేదా) 0877-2264292
Roc No.PR4/13951/Adv.No.377/PRO/2023, Dt: 03.02.2023 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

సదాశివపేట మున్సిపాలిటీ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు నోటీస్ నం.E1/TO/01/SSPT/e-proc/2022-23, తేదీ: 03.02.2023
సదాశివపేట మున్సిపాలిటీలో వివిధ గ్రాంట్లు/స్కీమ్స్ క్రింద అభివృద్ధి/ నిర్వహణ పనుల కోసం టెండర్లు పిలువబడినవి. వివరాలు దిగువ తెలుపబడినవి. ఆన్‌లైన్‌లో బిడ్ల దాఖలు కోసం ప్రారంభ తేదీ, సమయము: 04-02-2023న ఉ.11.30 గం.ల నుండి, ఆన్‌లైన్‌లో బిడ్ల దాఖలుకు ముగింపు తేదీ, సమయం: 10-02-2023న మ.2.30 గం.వరకు, బిడ్లు తెరచుట: 10-02-2023న సా.5.00 గం.లు, సంప్రదించు వివరాలు: మున్సిపల్ కమిషనర్, సదాశివపేట మున్సిపాలిటీ, సెల్ నం. 9849905918, ఇ-మెయిల్: mc_sadasivpet@yahoo.com. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చును. పనుల డౌన్‌లోడింగ్ ప్రారంభం: 04-02-2023, ఉ.11.30 గం.ల నుండి.
DIPR RO No.12155-PP/CL/Advt/1/2022-23, Dt 03/02/2023 సం/- కమిషనర్, సదాశివపేట మున్సిపాలిటీ

ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Lr.No.MCG/E1/58,59,60,61,62/2022-23, తేది: 02-02-2023
ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిల్‌లో మున్సిపల్ జనరల్ ఫండ్స్, పట్టణ ప్రగతి గ్రాంట్స్, 15వ FC గ్రాంట్స్ క్రింద రూ.34.30 లక్షల కొరకు అభివృద్ధి పనులు (5 పనులు) చేపట్టేందుకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం https://tender.telangana.gov.in లో ఆన్‌లైన్ టెండర్లు కోరబడినవి మరియు దిగువ తెలిపిన షెడ్యూల్ తేదీలలో సైటును దర్శించవచ్చును. బిడ్ ప్రారంభ తేది: 03-02-2023న ఉ.10.00 గం.లు, బిడ్ ముగింపు తేది: 07-02-2023న ఉ.11.00 గం.లు, బిడ్ తెరచు తేది: 07-02-2023న ఉ.11.01 గం.లు, ఏమేని ఇతర వివరాల కోసం కార్యాలయ వేళలలో క్రింది సంతకందారుని సంప్రదించవచ్చును.
సం/- కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ
DIPR RO No.12136-PP/CL/Advt/1/2022-23, Dt 03.02.2023

తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Lr.No.E1/565/2023 తేది:04-02-2023
రూ.86.50 లక్షల మొత్తముతో సి.సి. రోడ్డు పనుల చేయుటకు, రూ.28.60 లక్షల మొత్తముతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణము చేయుటకు, రూ.11.50 లక్షల మొత్తముతో సి.సి మరియు డ్రైన్ పనులు, రూ.2.00 లక్షల మొత్తముతో సి.సి స్లాబ్ వర్క్ చేయుటకు, రూ.5.00 లక్షల మొత్తముతో ఆఫీస్ స్టోర్ ఫర్నీచర్ పనులు చేయుటకు, రూ.2.00 లక్షల మొత్తముతో మ్యాన్‌హోల్ రైజింగ్ చేయుటకు, రూ.2.20 లక్షల మొత్తముతో అంగన్‌వాడీ రిపేర్లు చేయుటకు, రూ.16.00 లక్షల మొత్తముతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపట్టుటకు (2వ పిలుపు), రూ.4.00 లక్షల మొత్తముతో సి.సి రోడ్డు వేయుటకు (2వ పిలుపు), రూ.5.00 లక్షల మొత్తముతో టాయిలెట్ గదుల నిర్మాణము చేపట్టుటకు (2వ పిలుపు), రూ.12.00 లక్షల మొత్తముతో టిఎస్ బిపాస్ ఏర్పాటు చేయుటకు మరియు రూ.2.50 లక్షల మొత్తముతో ట్రాక్టర్ ట్రాలీ కొనుగోలు చేయుటకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. టెండరు షెడ్యూలు దిగువ విధంగా ఉన్నది. టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది: 04-02-2023 ఉదయం 10.00 గం. నుండి 13-02-2023 సా.4.00 గం.వరకు కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ వారిచే స్వీకరించబడును మరియు టెండర్లను తెరచు తేది: 13-02-2023 సా.4.01 గం.కు కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ లేదా వారి డిప్యూటీ తెరువబడుతుంది. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in దర్శించండి లేదా తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించు నెం.8639160741, 8978455983.
DIPR RO No.12149-PP/CL/Advt/1/2022-23, Dt 03.02.2023 సం/- కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

పర్వతగిరి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలంలో శుక్రవారం తన పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ విద్య, రైతు రుణమాఫీ వంటి హామీలు ఇచ్చి మాటతప్పారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే మొట్టమొదటగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి సంతకం చేస్తానని, గ్రామాల్లో బెల్ట్ షాపులు నిషేధిస్తామని అన్నారు. ఎనిమిదేళ్లుగా ఉద్యోగాలు లేక వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఎయిరిండియా విమానం ఇంజిన్‌లో మంటలు

న్యూఢిల్లీ: అబుదాబి నుంచి కేరళలోని కోజికోడ్ (కాలికట్)కు వెళ్తున్న ఎయిరిండియా విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కాసేపటికే ఇంజిన్‌లో మంటలు రావడంతో అధికారుల సూచనల మేరకు విమానాన్ని పైలట్ తిరిగి అబుదాబి విమానాశ్రయానికి తీసుకెళ్లినట్లు డీజీసీఏ తెలిపింది. మొత్తం 184 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు డీజీసీఏ పేర్కొంది.

ఎంపీ ప్రణీత్ కౌర్‌ను బహిష్కరించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ సీఎం అమరీందర్ సింగ్ భార్య, పటియాలా లోక్‌సభ ఎంపీ ప్రణీత్ కౌర్‌ను పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలపై కాంగ్రెస్ శుక్రవారం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. మూడు రోజుల్లోగా ఆమె నుంచి వివరణ కోరింది. కౌర్ బీజేపీకి సాయం చేస్తున్నారంటూ పీసీసీ చీఫ్‌తో పాటు పలువురు నేతల నుంచి ఫిర్యాదులందాయని ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్య కార్యదర్శి తారిఖ్ అన్వర్ తెలిపారు.

అమూల్ పాల ధర లీటర్‌కు రూ.2 పెంపు

ఆనంద్: అమూల్ పాల ధర లీటరుకు రూ.2 చొప్పున పెరిగింది. విక్రయ సంస్థ గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ సమాఖ్య (జీసీఎంఎంఎఫ్) ఈ మేరకు పేర్కొంది. గుజరాత్ మినహా దేశంలోని మిగతా ప్రాంతాలకు పెరిగిన ధర వర్తిస్తుందని స్పష్టత నిచ్చింది. దాంతో శుక్రవారం నుంచి లీటరు తాజా మిల్క్ ప్యాకెట్ ధర రూ.54కు, అమూల్ గోల్డ్ ప్యాకెట్ ధర రూ.66కు చేరింది. లీటరు ఆవు పాల ధర రూ.56కు, అమూల్ ఏ2 గేదె పాల ప్యాకెట్ ధర రూ.70కి పెరిగినట్లు పేర్కొంది.

ముంబైలో ఉగ్రదాడి అంటూ ఎన్‌ఐఏకి బెదిరింపు మెయిల్

ముంబై: తాలిబన్ ఉగ్రవాది ముంబైపై దాడి చేయనున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ)కు శుక్రవారం మెయిల్ అందింది. దాంతో ముంబై పోలీసులను, మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దళం (ఏటీఎస్)ను ఎన్‌ఐఏ అధికారులు అప్రమత్తం చేశారు. బెదిరింపు ఇ-మెయిల్‌లో సీఐఏ అని మాత్రమే ఉందని, ఇంటర్నెట్ ప్రొటోకాల్ అడ్రస్ పాకిస్తాన్‌కు చెందినదిగా తేలిందని అధికారులు తెలిపారు. గత నెలలోనూ ఎన్‌ఐఏకు ఇలాంటి బెదిరింపు మెయిలే అందిందన్నారు. ఇది ఆకతాయిల పని కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, సీఐఏ అమెరికాకు చెందిన నిఘా సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ.

డొక్కు బండ్లు తుక్కుకే..

దేశవ్యాప్తంగా 4.50 కోట్లకు పైగా పాత వాహనాలు ● దశల వారీగా అన్నీ తొలగింపు



పర్యావరణ పరిరక్షణలో భాగంగా కర్బన ఉద్గారాల తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. కర్బన ఉద్గారాల విషయంలో 'కాలం చెల్లిన వాహనాల' వాటా గణనీయంగానే ఉంది. దేశంలో 4.50 కోట్లకు పైగా పాత వాహనాలు రోడ్లపై తిరుగున్నాయి. కాలుష్యానికి కారణమవుతున్న డొక్కు వాహనాలను రోడ్లపైకి అనుమతించరాదని నిపుణులు తేల్చిచెబుతున్నారు. 2021–22 బడ్జెట్‌లో 'వెహికల్ స్క్రాపింగ్ పాలసీ'ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన 9 లక్షలకు పైగా డొక్కు వాహనాలను ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి తుక్కు(స్క్రాప్)గా మార్చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవలే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వానికి చెందిన పాత వాహనాలను, పాత అంబులెన్స్‌లను తుక్కుగా మార్చడానికి, వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయడానికి అదనంగా నిధులు సమకూరుస్తామని 2023–24 బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు అందుబాటులో ఉన్న విధానం ఏమిటో తెలుసుకుందాం..

పాత వాహనాలు అంటే?

- రవాణా వాహనం(సీవీ) రిజిస్ట్రేషన్ గడువు సాధారణంగా 15 సంవత్సరాలు ఉంటుంది. ఈ తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవడంలో విఫలమైతే స్క్రాపింగ్ పాలసీ ప్రకారం ఆ వాహనం రిజిస్ట్రేషన్ రద్దవుతుంది. అప్పుడు దాన్ని తుక్కుగా మార్చేయాల్సిందే.
- ప్యాసింజర్ వాహనాల(పీవీ) రిజిస్ట్రేషన్ గడువు 20 ఏళ్లు. గడువు ముగిశాక వెహికల్ అన్‌ఫిట్ అని తేలినా లేక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను రెన్యువల్ చేసుకోవడంలో విఫలమైనా రిజిస్ట్రేషన్ రద్దవుతుంది. వెహికల్‌ను స్క్రాప్‌గా మార్చాలి.
- 20 ఏళ్లు దాటిన హెవీ కమర్షియల్ వాహనాలకు(హెచ్‌సీవీ) ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లలో ఫిట్‌నెట్ పరీక్షలు నిర్వహిస్తారు.
- ఇతర కమర్షియల్ వాహనాలకు, వ్యక్తిగత, ప్రైవేట్ వాహనాలకు జూన్ 1 నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ టెస్టులో ఫెయిలైన వాహనాలను ఎండ్-ఆఫ్-లైఫ్ వెహికల్(ఈఎల్‌వీ)గా పరిగణిస్తారు.
- ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గిన వాహనాలపై 10 శాతం నుంచి 15 శాతం దాకా గ్రీన్ ట్యాక్స్ విధిస్తారు.
- రిజిస్ట్రేషన్ అయిన తేదీ నుంచి 15 ఏళ్లు దాటిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, మున్సిపల్ కార్పొరేషన్ల, రాష్ట్ర రవాణా సంస్థల, ప్రభుత్వ రంగ సంస్థల, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలకు చెందిన అన్ని వాహనాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, తుక్కుగా మార్చాలని స్క్రాపింగ్ పాలసీ నిర్దేశిస్తోంది.
- ప్రస్తుతం దేశవ్యాప్తంగా 4.50 కోట్లకు పైగా పాత వాహనాలు రోడ్లపై తిరుగున్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వాస్తవానికి వీటన్నింటినీ తుక్కుగా మార్చాలి.
- ప్రతి నగరంలో కనీసం ఒక స్క్రాపింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వాహనదారులకు ప్రోత్సాహకాలు

- కాలం చెల్లిన వాహనాన్ని తుక్కుగా మార్చేందుకు ముందుకొచ్చిన వాహనదారులకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఇస్తుంది. ఇందుకోసం ఏం చేయాలంటే..
- తొలుత ఏదైనా రిజిస్టర్డ్ స్క్రాపింగ్ కేంద్రానికి వాహనాన్ని తరలించి, తుక్కుగా మార్చాల్సి ఉంటుంది.
- ఆ వాహనం స్క్రాప్ విలువ ఎంత అనేది స్క్రాపింగ్ కేంద్రంలో నిర్ధారిస్తారు. సాధారణంగా కొత్త వాహనం ఎక్స్-షోరూమ్ ధరలో ఇది 4–6 శాతం ఉంటుంది. ఆ విలువ చెల్లిస్తారు. స్క్రాపింగ్ సర్టిఫికెట్ అందజేస్తారు.
- స్క్రాపింగ్ సర్టిఫికెట్ ఉన్న వాహనదారులు కొత్త వ్యక్తిగత వాహనం కొనుగోలు చేస్తే 25 శాతం వరకూ రోడ్డు ట్యాక్స్ రిబేట్, వాణిజ్య వాహనం కొంటే 15 శాతం వరకూ రోడ్డు ట్యాక్స్ రిబేట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. స్క్రాపింగ్ సర్టిఫికెట్ ఉన్న వాహనదారులకు కొత్త వాహనం విలువలో 5 శాతం డిస్కౌంట్ ఇవ్వాలని వాహనాల తయారీ సంస్థలను కోరింది.
- పాత వాహనాన్ని తుక్కుగా మార్చి, కొత్తది కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ ఫీజులోనూ మినహాయింపు ఇస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

స్క్రాప్ రంగంలో కొత్తగా 35,000 ఉద్యోగాలు!

పాత వాహనాలను తుక్కుగా మార్చేయడం ఇప్పటికే ఒక పరిశ్రమగా మారింది. కానీ, ప్రస్తుతం అసంఘటితంగానే ఉంది. రానున్న రోజుల్లో సంఘటితంగా మారుతుందని, ఈ రంగంలో అదనంగా రూ.10,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని, కొత్తగా 35,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ అంచనా వేస్తోంది.

ప్రత్యామ్నాయాలు ఏమిటి?

పెట్రోల్, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాలను దశల వారీగా తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. ప్రత్యామ్నాయ వాహనాలు క్రమంగా అందుబాటులోకి వస్తున్నాయి. విద్యుత్‌తో నడిచే (ఎలక్ట్రిక్) వాహనాల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్‌లో పలు రాయితీలు ప్రకటించారు. రాబోయే రోజుల్లో వీటి ధరలు భారీగా తగ్గనున్నాయి. సమీప భవిష్యత్తులో ఇథనాల్, మిథనాల్, బయో-సీఎన్‌జీ, బయో-ఎల్‌ఎన్‌జీ వాహనాలు విరివిగా అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఎన్నెన్నో ప్రయోజనాలు

- కాలం తీరిన వాహనాలను తుక్కుగా మార్చడం ప్రధానంగా పర్యావరణానికి మేలు చేయనుంది. కాలుష్య ఉద్గారాలు భారీగా తగ్గుతాయి. ఆధునిక వాహనాలతో ఉద్గారాల బెడద తక్కువే.
- పర్యావరణహిత, సురక్షితమైన, సాంకేతికంగా ఆధునిక వాహనాల వైపు వాహనదారులను నడిపించాలన్నది ప్రభుత్వ ఆలోచన.
- పాత వాహనాల స్థానంలో కొత్తవి కొంటే వాహన తయారీ రంగం పుంజుకుంటుంది. ఈ రంగంలో నూతన పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తాయి.
- కొత్త వాహనాలతో యజమానులకు నిర్వహణ భారం తగ్గిపోతుంది. చమురును ఆదా చేయొచ్చు. తద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు.
- స్క్రాప్ చేసిన వెహికల్స్ నుంచి ఎన్నో ముడిసరుకులు లభిస్తాయి. ఆటోమొబైల్, స్టీల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు తక్కువ ధరకే ఈ ముడిసరుకులు లభ్యమవుతాయి.

అమెరికా అణుస్థావరంపై చైనా బెలూన్

ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు ● బ్లింకెన్ చైనా పర్యటన వాయిదా



వాషింగ్టన్/బీజింగ్: చైనాకు చెందిన నిఘా బెలూన్ అమెరికా గగనతలంపై, అదీ అణు స్థావరం వద్ద తచ్చాడటం కలకలం రేపింది. దీనిపై అమెరికా తీవ్రంగా స్పందించింది. విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చైనా పర్యటనను వాయిదా వేసుకున్నారు. మూడు బస్సుల పరిమాణంలో ఉన్న ఈ బెలూన్ కొన్ని రోజులుగా తమ గగనతలంలో అగుపిస్తోందని, అది గురువారం మొంటానాలో ప్రత్యక్షమైందని పెంటగాన్ పేర్కొంది. అది అత్యంత ఎత్తులో ఎగురుతున్నందున వాణిజ్య విమానాల రాకపోకలకు అంతరాయమేమీ లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో సున్నిత సమాచారం లీకవకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించింది. బెలూన్‌ను కూల్చేస్తే దాని శకలాల వల్ల ప్రజలకు హాని కలగవచ్చని ఆర్మీ భావిస్తోంది. అన్ని అంశాలను అధ్యక్షుడు బైడెన్‌కు వివరించినట్లు పెంటగాన్ ప్రకటించింది. అమెరికాలోని మూడు భూగర్భ అణు క్షిపణి కేంద్రాల్లో ఒకటి మొంటానాలోనే ఉంది. దాంతో ఈ పరిణామం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసినట్లయింది. చైనాతో చర్చల నిమిత్తం శుక్రవారం రాత్రి బయల్దేరాల్సిన విదేశాంగ మంత్రి బ్లింకెన్ పర్యటన వాయిదా పడింది. వాతావరణ పరిశోధన కోసం ప్రయోగించిన బెలూన్ దారి తప్పి అమెరికా గగనతలంలోకి ప్రవేశించిందని చైనా పేర్కొంది. ఈ అనుకోని పరిణామానికి చింతిస్తున్నట్లు చెప్పింది. ఈ వివరణతో అమెరికా సంతృప్తి చెందలేదు. ''మా గగనతలంలోకి చైనా బెలూన్ రావడం మా సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే. చైనా చర్య ఆమోదయోగ్యం కాదు. ఈ సమయంలో బ్లింకెన్ పర్యటన సరికాదని భావిస్తున్నాం'' అని అమెరికా అధికారి ఒకరన్నారు. పరిస్థితులు అనుకూలించాక బ్లింకెన్ చైనా పర్యటన ఉంటుందన్నారు.

అమెరికా హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీ నుంచి

ఇల్హాన్ ఒమర్ తొలగింపు



వాషింగ్టన్: 'కశ్మీర్‌పై అమెరికా మరింత శ్రద్ధ పెట్టాలి' అని వ్యాఖ్యానించి భారత్ ఆగ్రహానికి గురైన అమెరికా ప్రతినిధుల సభ సభ్యురాలు ఇల్హాన్ ఒమర్‌కు షాక్ తగిలింది. శక్తిమంతమైన హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీ నుంచి ఆమెను తొలగించారు. డెమొక్రటిక్ సభ్యురాలైన ఒమర్ తీరుపై రిపబ్లికన్ సభ్యులు చాలా రోజులుగా మండిపడుతున్నారు. ఇజ్రాయెల్, యూదులకు వ్యతిరేకంగా ఇష్టారాజ్యంగా ప్రకటనలు చేసిన ఆమె విదేశీ వ్యవహారాల కమిటీలో ఉండడానికి అర్హురాలు కాదని వారు వాదిస్తూ వచ్చారు. ఓటింగ్ నిర్వహించగా కమిటీ నుంచి ఆమె తొలగింపుకు అనుకూలంగా 218 ఓట్లు, వ్యతిరేకంగా 211 ఓట్లు వచ్చాయి. కమిటీలో లేనంత మాత్రాన తన గళాన్ని ఎవరూ అణచివేయలేరని, తాను మరింతగా రాటుదేలుతానని ఒమర్ వ్యాఖ్యానించారు. ఆమె గతంలో పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో పర్యటించారు. అప్పటి పాకిస్తాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌తో సమావేశమయ్యారు.



బిల్‌గేట్స్ రోటీ!

సెలిబ్రిటీ చెఫ్ ఈటన్ బెర్నాథ్‌తో కలిసి తాను తయారు చేసిన రోటీతో ఫొటోకు పోజిస్తున్న ప్రపంచ కుబేరుడు బిల్ గేట్స్. ఈ వీడియోకు 75 వేల వ్యూస్ వచ్చాయి! ఇటీవలి భారత్‌లో పర్యటనలో తాను రోటీ తయారీ మెలకువలు నేర్చుకున్నట్టు ఈటన్ ట్వీట్ చేయడం తెలిసిందే.

ఇబ్బందికరంగా కేంద్రం తీరు

కొలీజియం సిఫార్సుల పెండింగ్‌పై సుప్రీం

- హైకోర్టు జడ్జీల బదిలీలెందుకు తొక్కిపట్టారు?
- చేతులు ముడుచుకు కూచోవాలనుకుంటున్నారా?
- మూడో శక్తి మాతో ఆటలాడటాన్ని సహించబోం
- కఠినమైన నిర్ణయాలు తీసుకుంటాం: ధర్మాసనం
- సుప్రీం జడ్జిలుగా ఐదు పేర్లకు త్వరలో ఆమోదం: ఏజీ



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా గత డిసెంబర్లో కొలీజియం సిఫార్సు చేసిన ఐదు పేర్లను త్వరలో ఆమోదించనున్నట్టు కేంద్రం పేర్కొంది. రాజస్తాన్, పట్నా, మణిపూర్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ సంజయ్‌కరోల్, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్‌తో పాటు పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ మిశ్రా వీరిలో ఉన్నారు. కొలీజియం సిఫార్సులను కేంద్రం పెండింగ్‌లో పెడుతున్న వైనంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకా ధర్మాసనానికి అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి శుక్రవారం ఈ మేరకు సమాచారమిచ్చారు. ''ఆ ఐదు సిఫార్సులు గత డిసెంబర్ 13న చేసినవి. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చింది'' అని ధర్మాసనం గుర్తు చేయగా, ఆదివారానికల్లా నియామక ఉత్తర్వులు రావచ్చని బదులిచ్చారు.

కోర్టులపై దాడి పరిపాటైంది: జస్టిస్ కౌల్

కొలీజియం సిఫార్సులను తొక్కిపడుతున్న తీరుపై ధర్మాసనం ఈ సందర్భంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తుల నియామకం, బదిలీల సిఫార్సు సంగతేమిటని ప్రశ్నించింది. అందుకు ఇంకాస్త సమయం పడుతుందని ఏజీ చెప్పగా మండిపడింది. ''ఇది చాలా చాలా సీరియస్ అంశం. ఈ విషయంలో కేంద్రం వైఖరి మమ్మల్ని ఎంతగానో ఇబ్బంది పెడుతోంది. బదిలీ సిఫార్సులను కూడా పెండింగ్‌లో పెడితే మేమింకేం చేయాలని మీరు ఆశిస్తున్నట్టు? మీరు ఉత్తర్వులిచ్చే దాకా సదరు న్యాయమూర్తులు చేతులు ముడుచుకుని కూర్చోవాలా? మీరదే కోరుకుంటున్నారా?'' అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించింది. ''ఈ విషయంలో మేం ఒక వైఖరికి వచ్చి అతి కఠినమైన నిర్ణయాలు తీసుకునేలా చేస్తున్నారు. అది అంతిమంగా అందరికీ చాలా అసౌకర్యంగా ఉంటుంది'' అంటూ ఏజీని హెచ్చరించింది. ''హైకోర్టు న్యాయమూర్తుల బదిలీల్లో జాప్యాన్ని అస్సలు అనుమతించేది లేదు. ఎందుకంటే ఈ విషయంలో కేంద్రం పాత్ర అతి స్వల్పం. ఈ విషయమై ఎవరో మూడో శక్తి మాతో ఆటలాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోం. మీ జాప్యం వల్ల న్యాయ, పాలనపరమైన విధులకు విఘాతం కలగడం అస్సలు ఆమోదనీయం కాదు'' అంటూ మండిపడింది. ''హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి ఒక న్యాయమూర్తి పేరును కొలీజియం సిఫార్సు చేస్తే ఇప్పటిదాకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. మరో 19 రోజుల్లో ఆయన రిటైరవుతున్నారు. సీజే అవకుండానే రిటైరవాలని మీరు ఆశిస్తున్నట్టా?'' అని నిలదీసింది. ఇది తమ దృష్టిలో ఉందని, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏజీ బదులిచ్చినా సంతృప్తి చెందలేదు. ''కొలీజియం సిఫార్సులను ఒక్కోసారి రాత్రికి రాత్రే ఆమోదిస్తున్నారు. మరికొన్నిసార్లు విపరీతంగా జాప్యం చేస్తున్నారు'' అంటూ తీవ్రంగా తప్పుబట్టింది. కొలీజియం పునరుద్ఘాటించిన పేర్లనూ పెండింగ్‌లో పెడుతున్నారని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కోర్టులపై బయట తీవ్ర దాడికి పాల్పడుతున్నారని మరో న్యాయవాది ఆరోపించగా వీటికి అలవాటు పడిపోయామని జస్టిస్ కౌల్ ఆవేదన వెలిబుచ్చారు. విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేశారు.

కొలీజియం విషయమై కేంద్రానికి, న్యాయ వ్యవస్థకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొనడం తెలిసిందే. కొలీజియం సిఫార్సులను కేంద్రం పెండింగ్‌లో పెట్టడం దాన్ని మరింత పెంచింది. తాజాగా అలహాబాద్, గుజరాత్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల పేర్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని కొలీజియం జనవరి 31న సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులకు గాను ప్రస్తుతం 27 మందే ఉన్నారు.

వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యం

మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నాం: మోదీ



గువాహటి: దేశాభివృద్ధి కోసం ప్రభుత్వం తపిస్తోందని, అణగారిన, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అస్సాం రాష్ట్రం బార్పేట జిల్లాలో శుక్రవారం 'కృష్ణగురు ఎక్ నామ్ అఖండ్ కీర్తన్' కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ''మహిళల ఆదాయం పెరిగితే సాధికారత సాధ్యం. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్‌తో వారికి కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. అనుసంధానం, అభివృద్ధి విషయంలో ఈశాన్య రాష్ట్రాలు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ ప్రాంతంపై ఎనిమిదేళ్లుగా ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ఈశాన్య ప్రజల సంప్రదాయ నైపుణ్యాలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తోంది. వారి ఉత్పత్తులను ప్రదర్శించుకోవడానికి యూనిటీ మాల్ ఏర్పాట్లు చేస్తాం'' అన్నారు.

'బీబీసీ' రికార్డులు సమర్పించండి: సుప్రీం

న్యూఢిల్లీ: బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధానికి సంబంధించిన ఒరిజినల్ రికార్డులు సమర్పించాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్, అనంతరం రెండు వారాల్లోగా రిజాయిండర్ దాఖలు చేయాలని పేర్కొంటూ కేంద్రానికి, సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసింది. గుజరాత్ అల్లర్లకు ప్రధాని మోదీయే బాధ్యుడన్న సదరు వివాదాస్పద డాక్యుమెంటరీని నిషేధించడాన్ని సవాలు చేస్తూ జర్నలిస్టు ఎన్.రామ్, తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా, లాయర్లు ప్రశాంత్‌భూషణ్, ఎంఎల్ శర్మ తదితరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. వాటిపై న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. దీనిపై హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని పిటిషనర్లను ప్రశ్నించింది. విచారణ ఏప్రిల్‌కు వాయిదా వేసింది.

నిమిషానికి 2.25 లక్షల టికెట్లు: రైల్వే మంత్రి

న్యూఢిల్లీ: రైల్వే టికెట్ రిజర్వేషన్ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న నిమిషానికి 25 వేల నుంచి 2.25 లక్షల టికెట్లకు పెంచేందుకు కృషి చేస్తున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంక్వైరీ విభాగం నిమిషానికి 40 వేల కాల్స్ తీసుకుంటుడగా, ఈ సామర్థ్యాన్ని 4 లక్షలకు పెంచుతామని శుక్రవారం మీడియాకు తెలిపారు. 2022–23లో కొత్తగా 4,500 కిలోమీటర్ల రైల్వే లైన్ (రోజుకు 12 కి.మీ.) వేయాలన్న లక్ష్యాన్ని సాధించాం. ఈ ఏడాది 7,000 కి.మీ. రైలు మార్గం నిర్మించనున్నాం'' అన్నారు.

పారిస్ ఒలంపిక్స్‌ను బహిష్కరించాలి: పోలండ్

వార్సా: 2024 పారిస్ ఒలంపిక్స్‌లో రష్యా, బెలారస్‌ల ప్రాతినిధ్యాన్ని అంగీకరిస్తే తీవ్ర పరిణామాలుంటాయని పోలండ్ హెచ్చరించింది. రష్యా, బెలారస్‌లు ఒలంపిక్స్ పాల్గొనే పక్షంలో పోలండ్, లిథువేనియా, ఎస్టోనియా, లాట్వియా దేశాలు ఆ క్రీడలను బహిష్కరిస్తాయని పోలండ్ మంత్రి కమిల్ చెప్పారు. ఆ రెండు దేశాల క్రీడాకారులకు అవకాశమివ్వాలన్న అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ నిర్ణయాన్ని ఖండించారు. ఈ నెల 10న జరిగే ఐవోసీ భేటీలో ఈయూ, యూకే, అమెరికా, కెనడాలతోపాటు ఉక్రెయిన్‌పై రష్యా ఆక్రమణను వ్యతిరేకించే 40 దేశాలు గ్రూపుగా ఏర్పడాలన్నారు. ఈ 40 దేశాలు గనుక బహిష్కరిస్తే ఒలంపిక్స్ నిర్వహణకు అర్థమే లేకుండా పోతుందని చెప్పారు. రష్యా పాల్గొంటే తాము ఒలంపిక్స్‌ను బహిష్కరిస్తామని ఉక్రెయిన్ ఇప్పటికే స్పష్టం చేసింది.

పేలుడు కేసు నిందితుడికి ఎంఏ గోల్డ్‌మెడల్

గువాహటి: బాంబు పేలుడు ఘటనలో నిందితుడిగా జైలులో ఉన్న మాజీ విద్యార్థి ఒకరికి అస్సాం గవర్నర్ బంగారు పతకం అందజేశారు. 2019లో గువాహటిలో తీవ్రవాద సంస్థ ఉల్ఫా జరిపిన బాంబు పేలుడు ఘటనలో నిందితుల్లో ఒకరైన సంజీవ్ తాలూక్‌దార్ (29) ప్రస్తుతం జైలులో ఉన్నాడు. జైల్లోంచే ఓపెన్ యూనివర్సిటీ నుంచి సోషియాలజీలో ఎంఏ పూర్తి చేశాడు. అంతేగాక అత్యధికంగా 71% మార్కులు సాధించాడు! గురువారం జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జగ్దీశ్ ముఖి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు.

బాబీ.. ఓ కురు వృద్ధ శునకం!

గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం



లిస్బన్: పోర్చుగల్ వాసికి చెందిన బాబీ అనే కుక్క ప్రపంచంలోనే అత్యంత వృద్ధ శునకంగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. రఫీరో డో అలెంటెజో జాతికి చెందిన ఈ కుక్క వయసు ఫిబ్రవరి 1 నాటికి 30 ఏళ్ల 226 రోజులు. ఆస్ట్రేలియాకు చెందిన బ్లూవై అనే కుక్క 29 ఏళ్ల 5 నెలలు జీవించి 1939లో చనిపోయింది. ఈ రికార్డును బాబీ తుడిచిపెట్టింది. పోర్చుగల్ ప్రభుత్వ పెట్ డేటాబేస్ ప్రకారం దాని వయస్సును నిర్ధారించారు. ఈ జాతి కుక్కల సరాసరి ఆయుర్దాయం 12–14 ఏళ్లు. బాబీ యజమానులు పోర్చుగల్‌లోని కాంకెయిరోస్ గ్రామానికి చెందిన కోస్టా కుటుంబం. ఈ కుటుంబంలోని లియోనెల్ కోస్టా అనే కుర్రాడికి 8 ఏళ్లుండగా బాబీ పుట్టింది. ఇంట్లో చాలా పెంపుడు కుక్కలుండటంతో కొన్నింటిని వదిలి పెట్టినా ఇది మాత్రం తప్పించుకుంది. ''ఇంట్లో వాళ్లు తినేది ఏం పెట్టినా బాబీ తినేది. అనారోగ్య సమస్యల్లేకుండా హుషారుగా ప్రశాంతంగా ఉండేది. అదే దాని ఆయుష్షును పెంచి ఉంటుంది' అంటారు కోస్టా. వయో భారంతో బాబీ ఇప్పుడు చురుగ్గా నడవలేకపోతోందట! చూపు కూడా తగ్గిందని కోస్టా చెప్పారు.



మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లోని కౌలాలంపూర్ టవర్ పైనుంచి దూకుతున్న బేస్ జంపర్స్ జంట

'అదానీ'పై అదే రగడ

పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాల ఆందోళన

- హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాలని పట్టు
- ఉభయ సభలూ సోమవారానికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు, తద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్ల పతనం కారణంగా తలెత్తిన పరిస్థితులపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ ప్రారంభించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఏకతాటిపైకి వచ్చిన విపక్ష సభ్యుల ఆందోళనతో శుక్రవారం లోక్‌సభ, రాజ్యసభ స్తంభించాయి. మిగతా సభా కార్యకలాపాలను పక్కనపెట్టి హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చించాల్సిందేనంటూ ప్రతిపక్షాలన్నీ పట్టుబట్టడంతో వరుసగా రెండోరోజు కూడా ఎలాంటి చర్చలు లేకుండానే ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. శుక్రవారం సమావేశాలకు ముందే తీసుకున్న సంయుక్త నిర్ణయం 15 పార్టీలు వాయిదా తీర్మానాలిచ్చాయి. లోక్‌సభ ఆరంభమై ప్రశ్నోత్తరాలను ప్రారంభించిన వెంటనే విపక్ష ఎంపీలు హిండెన్‌బర్గ్ నివేదికపై చర్చకు పట్టుబడుతూ ఆందోళనకు దిగారు. బిగ్గరగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకురావడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత విపక్ష ఎంపీలు ఆందోళన కొనసాగించారు. దీంతో సభ సోమవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.



విచారణ జరిపించాల్సిందే...

అదానీ గ్రూప్ పట్ల వచ్చిన ఆరోపణలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) లేదా సుప్రీంకోర్టు నియమించిన ప్యానెల్‌తో విచారణ జరిపించాలని విపక్షాలు పునరుద్ఘాటించాయి. అత్యంత కీలకమైన ఈ అంశంపై చర్చకు అంగీకరించకపోవడం ఏమిటని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

చర్చించే దాకా పట్టు!

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో మోదీ సర్కారుపై దాడిని మరింత తీవ్రతరం చేయాలని విపక్షాలు నిర్ణయించాయి. ఇందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు రాజ్యసభలో విపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాంబర్లో 16 ప్రతిపక్ష పార్టీలు శుక్రవారం ఉదయం సమావేశమయ్యాయి. ఈ భేటీలో కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ, ఆప్, బీఆర్ఎస్, శివసేన, ఆర్జేడీ, జేడీ(యూ), సీపీఎం, సీపీఐ, ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (జోస్ మణి), కేరళ కాంగ్రెస్ (థామస్), ఆరెస్పీ ఇందులో ఉన్నాయి. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్ అవకతవకలపై సభలో చర్చ జరిగేదాకా పట్టుబట్టాల్సిందేనని పార్టీలన్నీ ఏకగ్రీవంగా నిర్ణయించాయి. దాంతోపాటు అదానీ గ్రూప్ అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సంయుక్త పార్లమెంటరీ సంఘంతో దర్యాప్తుకు కేంద్రం అంగీకరించేదాకా ఉభయ సభల్లోనూ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశాయి. అదానీ అవకతవకలపై స్వతంత్ర దర్యాప్తు జరగాల్సిందే. అప్పుడు మాత్రమే వాటిలో ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, ఎస్‌బీఐ పెట్టుబడులకు భద్రత'' అని భేటీ అనంతరం కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మీడియాతో అన్నారు. అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టేలా ప్రధాని మోదీయే వాటిపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. అదానీ గ్రూప్ పెద్ద ఎత్తున ఆర్థిక, అకౌంటింగ్ అవకతవకలకు పాల్పడిందంటూ న్యూయార్క్‌కు చెందిన షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల దెబ్బకు గ్రూప్ విలువ చూస్తుండగానే ఏకంగా 100 బిలియన్ డాలర్ల మేరకు పడిపోయింది.

సాక్షి
హైదరాబాద్

శనివారం ; 4 ; ఫిబ్రవరి ; 2023



టూరిజం హబ్‌గా తెలంగాణ

రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం పర్యాటక కేంద్రంగా మారనుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాచకొండ బుద్ధ విహార ట్రస్ట్ ఆవిర్భావ సభ నిర్వహించారు. -8లో



ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన ఉండాలి

ఎన్నికలకు సంబంధించి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు అవగాహన ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ పేర్కొన్నారు. -8లో

నగరానికి ఈ-రేసింగ్ ఎస్కార్ట్ వాహనాలు



శంసాబాద్: ఈ-రేసింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఎస్కార్ట్‌గా వినియోగించే కార్లు హైదరబాద్‌కు చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం రియాద్ నుంచి కార్గో విమానంలో వచ్చిన ఐదు ఎస్కార్ట్, రెన్యూ కార్లను శంషాబాద్ జీఎంఆర్ కార్గో టెర్మినల్‌లో ప్రత్యేక కార్గో హ్యాండ్లింగ్ యంత్రాల ద్వారా ప్రక్రియ పూర్తి చేశారు.

న్యూస్‌రీల్

హస్త కళాకృతుల ప్రదర్శన



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో హస్తకళాకృతుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ప్రదర్శన ఈ నెల 12 వరకు కొనసాగుతుంది. హస్తకళలను సంరక్షించడం, అభివృద్ధిపర్చడం, సరైన మార్కెటింగ్ సౌకర్యాలు పెంచి వాటి ఉన్నతికి, హస్త కళాకారుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. కలంకారి ప్రింటింగ్, పెయింటింగ్‌లు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లేస్ అల్లికలు, చెక్కతో తయారు చేసిన కళాకృతులు, టెర్రాకోట కేన్ వస్తువులు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్, హైదరాబాద్ ముత్యాలు, లోహపు వస్తువులు, సిల్వర్ ఫిలిగ్రి, తంజావూర్, మైసూర్ పెయింటింగ్‌లు ఇక్కడ అమ్మకానికి ఉంచారు.

పాలు బలవర్ధకమైన ఆహారం

- రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ
- హైటెక్స్‌లో డైరీ, ఫుడ్ ఎక్స్‌పోలు ప్రారంభం

మాదాపూర్: పాలు బలవర్ధకమైన ఆహారమని రాష్ట్ర హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం డైరీ, ఫుడ్ ఎక్స్‌పోలను ఆయన ప్రారంభించారు. పాడి, ఆహార పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ మాట్లాడుతూ.. ఒకప్పుడు మూతపడుతుందని ఊహించిన విజయడెయిరీ బాగా పని చేస్తోందన్నారు. రూ.700 కోట్ల టర్నోవర్ సాధించి రూ.1000 కోట్ల లక్ష్యంతో ఉందన్నారు. ఎక్స్‌పోలో 105 మంది ఎగ్జిబిటర్లు పాల్గొన్నట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌ను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు రెండు ఎక్స్‌పోల నిర్వాహకుడు ముదస్సిర్ అహ్మద్ చెప్పారు. ఉత్తమ సేవలు, యంత్రాలు, పరికరాలు, సాంకేతికత, ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.

కాపురానికి రావడంలేదని ఇల్లాలిని కడతేర్చాడు

నడిరోడ్డుపై భార్యను చంపిన భర్త



కరీనా బేగం

లంగర్‌హౌస్: కాపురానికి రావడంలేదని భార్యపై కక్ష పెంచుకున్న భర్త ఆమెను నడిరోడ్డుపై దారుణంగా హత్య చేసిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ హకీంపేట్‌కు చెందిన మొహమ్మద్ యూసుఫ్‌కు కరీనా బేగంతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. యూసుఫ్ ఫాల్‌సీలింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా.. ఈ దంపతులు తరచూ గొడవపడేవారు. దీంతో ఏడాదిన్నర క్రితం భర్తకు దూరంగా ఉండాలని కరీనా బేగం నిర్ణయించుకుని ఈ విషయం తన తల్లితో చెప్పింది. ఆమె ఇందుకు ఒప్పుకొని కూతురుకు తోడుగా ఉండేందుకు వచ్చింది. పిల్లలు, తల్లితో కలిసి కరీనా లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటోంది. జీవనోపాధి కోసం ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోంది. యూసుఫ్ ఆమెను పలుమార్లు రోడ్డుపై ఆపి కాపురానికి రావాలంటూ వేధిస్తుండటంతో పెద్దలతో పంచాయితీ పెట్టించి మందలించింది. కరీనా ఏ ప్రాంతంలో నివసిస్తోందో తెలియని యూసుఫ్.. ఆమె ఏ వీధి నుంచి వస్తోందో పసిగట్టి అదను కోసం వేచి చూడసాగాడు. శుక్రవారం ఉదయం కరీనా పాఠశాలకు వెళ్తున్న సమయంలో వెనక నుంచి వచ్చి ఇనుప రాడ్డుతో తలపై బాదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.



అసెంబ్లీ ఎదుట భారీ బందోబస్తు



రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం నాంపల్లిలోని అసెంబ్లీ ఎదుట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ట్రాఫిక్‌జాం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.



లేటైనా లేటెస్ట్‌గా!

అమరవీరుల స్మారకం మరింత ఆలస్యం!!

- ఈ నెల 17న ప్రారంభం అనుమానమే
- త్వరితగతిన కొనసాగుతున్న పనులు
- ఈ నెలాఖరు వరకు పూర్తయ్యే అవకాశం
- ప్రపంచంలోనే అరుదైన పర్యాటక కేంద్రం
- అమరుల గ్యాలరీ, వీడియో, ఆడియో సెంటర్
- విశాలమైన సమావేశ మందిరం, రెస్టారెంట్ వసతులు





కొనసాగుతున్న పనులు

ఇదీ భవన నిర్మాణం..

సుమారు 3.2 ఎకరాల విస్తీర్ణంలో హుస్సేన్ సాగర్ తీరాన లుంబిని పార్కును ఆనుకొని చేపట్టిన తెలంగాణ అమరవీరుల స్మారకాన్ని ఎలాంటి అతుకులు లేని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మిస్తున్నారు. సాధారణంగా పాలు, వంటనూనెలు సరఫరా చేసే ట్యాంకర్ల కోసం 304 స్టెయిన్‌లెస్ స్టీల్‌ను వినియోగిస్తారు. కానీ.. దీని కోసం 316ఎల్ స్టీల్‌ను వినియోగించారు. దుబాయ్‌లోని ఫ్యూచర్ మ్యూజియానికి వినియోగించిన స్టీల్‌కు అతుకులు ఉన్నాయి. కానీ.. ఈ స్మారకానికి ఎలాంటి అతుకులు లేకపోవడమే ప్రత్యేకత. 85000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. ప్రతి ఫ్లోర్‌కు ఒక ప్రత్యేకత ఉంటుంది. సందర్శకులు దియా (జ్యోతి) వరకు వెళ్లగలుగుతారు. అక్కడ ఉండే విశాలమైన ప్రాంతంలో ఒకవైపున రెస్టారెంట్ ఉంటుంది.

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్మారకం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. వేగంగా పనులు కొనసాగుతున్నప్పటికీ ఈ నెల 17వ తేదీన సచివాలయంతో పాటు ఈ చారిత్రక కట్టడాన్ని కూడా ప్రారంభించడం సాధ్యం కాకపోవచ్చు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి, రెండు అంతస్తుల భవనాలు పూర్తయ్యాయి. కానీ ఫ్లోరింగ్ పనులతో పాటు తుది మెరుగుల దిద్దాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయి. అలాగే పైన స్టెయిన్‌లెస్ స్టీల్ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఆవరణలో రెండు వైపులా ల్యాండ్‌స్కేప్ పనులు చేపట్టారు. ఫౌంటెన్ నిర్మాణం పూర్తయింది. కానీ చుట్టూ గ్రిల్స్ వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అలాగే గ్రౌండ్‌ఫ్లోర్‌లో అమరవీరుల చిత్రపటాలు, స్మారకాలతో మ్యూజియం ఏర్పాటు చేయాలి. మరోవైపు రూ.179 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రపంచంలోనే అరుదైన చారిత్రక కట్టడం తెలంగాణ అమరవీరుల స్మారకం పనులు ఇప్పటి వరకు 90 శాతం పూర్తయ్యాయని ఆర్కిటెక్టర్ ఎంపీ రమణారెడ్డి తెలిపారు. సాధ్యమైనంత వరకు పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఉన్న అంచనాల ప్రకారం ఈ నెల 17న కాకుండా ఈ నెలాఖరు వరకు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు కనిస్తోంది.

ఇదీ భవన నిర్మాణం..

సుమారు 3.2 ఎకరాల విస్తీర్ణంలో హుస్సేన్‌సాగర్ తీరాన లుంబిని పార్కును ఆనుకొని చేపట్టిన తెలంగాణ అమరవీరుల స్మారకాన్ని ఎలాంటి అతుకులు లేని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మిస్తున్నారు. సాధారణంగా పాలు, వంటనూనెలు సరఫరా చేసే ట్యాంకర్ల కోసం 304 స్టెయిన్‌లెస్ స్టీల్‌ను వినియోగిస్తారు. కానీ.. దీని కోసం 316ఎల్ స్టీల్‌ను వినియోగించారు. దుబాయ్‌లోని ఫ్యూచర్ మ్యూజియానికి వినియోగించిన స్టీల్‌కు అతుకులు ఉన్నాయి. కానీ.. ఈ స్మారకానికి ఎలాంటి అతుకులు లేకపోవడమే ప్రత్యేకత. 85000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. ప్రతి ఫ్లోర్‌కు ఒక ప్రత్యేకత ఉంటుంది. సందర్శకులు దియా (జ్యోతి) వరకు వెళ్లగలుగుతారు. అక్కడ ఉండే విశాలమైన ప్రాంతంలో ఒకవైపున రెస్టారెంట్ ఉంటుంది.

త్యాగాలను ఎత్తిపట్టేలా..

తెలంగాణ అమరవీరుల త్యాగాలను, వీరోచిత పోరాట గాథలను స్మరించుకొనేలా గ్రౌండ్‌ఫ్లోర్‌లో చిత్రపటాలు, చారిత్రక చిహ్నాలు ఉంటాయి. ప్రేక్షకులు వీక్షించేందుకు లేదా విని తెలుసుకొనేందుకు ఆడియో, వీడియో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ ఘట్టాలను తెలుసుకోవచ్చు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో వివిధ ప్రాంతాలకు చెందిన అమరవీరులు సాగించిన పోరాటల తీరుతెన్నులు తెలుసుకొనే అకాశం ఉంటుంది. మ్యూజియంలోనే అక్కడక్కడా కియోస్కులు, టచ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా కూడా తెలంగాణ ఉద్యమ చరిత్ర విశేషాలను తెలుసుకొనే అవకాశం ఉంటుంది.

సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు..

పై అంతస్తులో 600 మంది కూర్చునేందుకు అనువైన కన్వెన్షన్ హాల్ ఉంటుంది. రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సులు, సాహిత్య సదస్సులు, కవి సమ్మేళనాలు, అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇది ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ హాల్‌లో ఏర్పాటు చేసే కుర్చీలను సభాకార్యక్రమాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు. అలాగే ఆర్ట్ గ్యాలరీలు వంటివి కూడా ఈ హాల్‌లో ఏర్పాటు చేయవచ్చు.

టెర్రస్ పై 'దియా'..

టెర్రస్‌పైన అమరవీరులకు నివాళులర్పిస్తున్న స్ఫూర్తిని కలిగించే వెలిగే ఆకృతిలో దియా (జ్యోతి) ఉంటుంది. మరొకవైపు రెస్టారెంట్ ఉంటుంది. ఈ రెస్టారెంట్‌లో వంటగ్యాస్ వినియోగించేందుకు అనుమతి ఉండదు. కేవలం ఎలక్ట్రిక్ పొయ్యిలను మాత్రమే వినియోగించాలి. టీ, కాఫీ, స్నాక్స్ వంటివి మాత్రమే అందుబాటులో ఉంటాయి. టెర్రస్‌పై కూర్చుంటే 180 డిగ్రీల కోణంలో చుట్టూ ఉన్న పరిసరాలను వీక్షించవచ్చు. సెక్రటేరియట్, అంబేడ్కర్ విగ్రహం, ఐమాక్స్, బిర్లా మందిర్ స్పష్టంగా కనిపిస్తాయి.

ఇవీ సదుపాయాలు..

- సందర్శకులు అత్యవసర పరిస్థితుల్లో పై నుంచి నేరుగా కిందకు చేరుకొనేందుకు రెండు వైపులా మెట్లు ఏర్పాటు చేశారు.
- రెండు లిఫ్టులు, ఎస్కలేటర్లు అందుబాటులో ఉంటాయి. అన్ని ఫ్లోర్‌లలో వాష్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.
- భవనానికి ప్రధాన ద్వారంతో పాటు మరో నాలుగు చోట్ల చిన్న చిన్న నిష్క్రమణ ద్వారాలను ఏర్పాటు చేశారు.
- ప్రాంగణంలో పచ్చదనం ఉట్టిపడే ల్యాండ్‌స్కేప్‌లు, వాటర్ ఫౌంటెన్‌లు, తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేకంగా ఆకట్టుకోనున్నాయి. సందర్శకులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకొనేందుకు విశాలమైన ఆవరణ ఉంది.

ఎట్టకేలకు పచ్చజెండా

- వచ్చే ఏడాది పట్టాలెక్కనున్న రైళ్లు
- ఆరు మార్గాల్లో ఎంఎంటీఎస్ పరుగులు
- ఇప్పటికే చాలా వరకు పూర్తయిన పనులు
- చర్లపల్లి టర్మినల్‌కు మరో రూ.82 కోట్లు

ఎంఎంటీఎస్ రెండో దశకు రూ.600 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు ఎంఎంటీఎస్ రెండో దశ పరుగులు పెట్టనుంది. నిధుల కొరత కారణంగా తీవ్ర జాప్యం నెలకొన్న రెండో దశను పట్టాలెక్కించేందుకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించినట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. నగరంలోని శివారు ప్రాంతాలను కలిపేలా ఆరు మార్గాల్లో 2012లో చేపట్టిన ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టులో ఇప్పటికే చాలా వరకు డబ్లింగ్, విద్యుదీకరణ వంటి పనులు పూర్తయ్యాయి. మూడు స్టేషన్‌లను కొత్తగా ఏర్పాటు చేశారు. కానీ నిధుల కొరత కారణంగా కొత్త రైళ్ల కొనుగోళ్లు నిలిచిపోయాయి. కొన్ని రూట్‌లలో చివరిదశ పనులకు ఆటంకం ఏర్పడింది. తాజాగా బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో పనుల్లో వేగం పెంచనున్నట్లు జీఎం పేర్కొన్నారు. 2024 నాటికి రెండో దశ రైళ్లను పట్టాలెక్కించనున్నట్లు చెప్పారు.

ఆరు మార్గాల్లో..

హైదరాబాద్ మహానగరం ఔటర్‌ను దాటుకొని శరవేగంగా విస్తరిస్తోంది. వందలాది కాలనీలు, నివాస ప్రాంతాల్లో కొత్తగా అందుబాటులోకి వస్తున్నాయి. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని రెండో దశ ప్రాజెక్టుకు 2009లోనే ద.మ. రైల్వే సన్నాహాలు చేపట్టింది. కానీ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేయాల్సిన ప్రాజెక్టు కావడంతో రెండు ప్రభుత్వాల మధ్య సమన్వయలోపం, నిధుల కేటాయింపుల్లో జాప్యం కారణంగా 2012లో పనులు ప్రారంభించారు. రూ.817 కోట్ల అంచనాలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనుల జాప్యం కారణంగా ఏటా భారంగా మారింది. 2015 నాటికి రూ.1050 కోట్లకు చేరుకుంది. నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. ఏడాదికి ఒకటి, రెండు లైన్‌ల చొప్పున విద్యుదీకరణ, డబ్లింగ్, కొత్తలైన్‌ల నిర్మాణం వంటి పనులు చేపట్టారు.

కొత్త రైళ్లు లేనట్లే...

- సికింద్రాబాద్–వారణాశి, నాంపల్లి– శబరిమలై, సికింద్రాబాద్–షిరిడీ వంటి రూట్లలో కొత్త రైళ్లు వస్తాయని భావించినప్పటికీ ఈసారి నిరాశే మిగిలింది. ప్రస్తుతం ప్రతిరోజు వందలాది మంది భక్తులు వారణాసికి వెళ్తున్నారు. కానీ ప్రస్తుతం దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఒక్కటే అందుబాటులో ఉంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రూట్‌లో మరో రెగ్యులర్ రైలు నడపాలనే ప్రతిపాదన చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది.

చర్లపల్లికి రూ.82 కోట్లు...

నగరంలోని సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లపై ఒత్తిడిని తగ్గించేందుకు నాలుగో టర్మినల్‌గా చర్లపల్లి స్టేషన్ అభివృద్ధికి రెండేళ్ల క్రితం పనులు చేపట్టారు. స్టేషన్ విస్తరణ, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రయాణికుల రాకపోకల కోసం రోడ్ల నిర్మాణం తదితర మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంది. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో రూ.82 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది జూన్ నాటికే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పనుల్లో జాప్యం కారణంగా వచ్చే ఏడాది వరకు పూర్తికానున్నట్లు అధికారులు తెలిపారు.

ఇప్పుడు ఇలా...

- మల్కాజిగిరి– బొల్లారం మధ్యలో 14 కిలోమీటర్‌లు డబ్లింగ్‌తో పాటు విద్యుదీకరించారు. దీంతో సికింద్రాబాద్ నుంచి నేరుగా బొల్లారం వరకు రైళ్లు నడిపేందుకు మార్గం సుగమమైంది.
- తెల్లాపూర్–రామచంద్రాపూర్ మధ్య 6 కిలోమీటర్‌లు పూర్తి చేయడమే కాకుండా రెండు చోట్ల ఎంఎంటీఎస్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. లింగంపల్లి నుంచి రామచంద్రాపురం వరకు ప్రయోగాత్మకంగా రైళ్లను నడిపారు.
- మేడ్చల్– బొల్లారం మధ్య 14 కిలోమీటర్‌లు, మౌలాలీ–ఘట్కేసర్ మధ్య 12.2 కి.మీ, ఫలక్‌నుమా–ఉందానగర్ మధ్య 13.5 కి.మీ మేర మార్గాలు చాలా వరకు పూర్తయ్యాయి.
- సనత్‌నగర్ నుంచి మౌలాలీ మార్గంలో కొత్తగా 5 కి.మీ నిర్మించాల్సి ఉంది. ఈ రూట్‌లో 2 కి.మీ కోసం రక్షణశాఖ నుంచి భూమి సేకరించాల్సి ఉంది. రైల్వే, రక్షణశాఖల మధ్య చర్చలు ఫలప్రదం కావడంతో త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.
- మౌలాలీ నుంచి మల్కాజిగిరి మీదుగా సీతాఫల్‌మండి వరకు డబ్లింగ్ చేసి విద్యుదీకరించాల్సి ఉంది. ఈ రెండు మార్గాలను 2024 నాటికి పూర్తి చేసి రైళ్లను నడపనున్నారు. ఇందుకోసం కొన్ని కొత్త రైళ్లను కొనుగోలు చేయనున్నారు.



హైరైజ్ లగ్జరీ @ 'ద ట్రిలైట్'



- కోకాపేట్‌లో ప్రపంచ శ్రేణి జీవన టవర్లు
- నగరంలోనే అత్యంత ఎత్తయినవి
- 56, 49, 46 అంతస్తులుగా నిర్మాణం

టవర్స్ నమూనాను విడుదల చేస్తున్న డైరెక్టర్లు

మణికొండ: ప్రపంచ శ్రేణి జీవనంతో పాటు నగరంలోనే అత్యంత ఎత్తయిన టవర్ల నిర్మాణానికి డీ బ్లూ ఓక్ కన్‌స్ట్రక్షన్, పి మంగతరామ్ డెవలపర్లు సంయుక్తంగా 'ట్రిలైట్ డెవలపర్స్' పేరుతో లగ్జరీ హైరైజ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ 'ద ట్రిలైట్'ను శుక్రవారం రాత్రి కోకాపేటలో ప్రారంభించారు. సంస్థల డైరెక్టర్‌లు సంజయ్ గులాబానీ, అమిత్‌గులాబానీ, జక్కిరెడ్డి సంజీవరెడ్డి, జక్కిరెడ్డి, సుభాస్కర్‌రెడ్డిలు 56,49,46 అంతస్తుల్లో నిర్మించే భవన నమూనాను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నివాసితులకు ప్రపంచ శ్రేణి జీవన అనుభవాలను అందించటంతో పాటు మూడు క్లబ్ హౌస్‌లు, విభిన్న లెవల్స్‌లో ఉంటాయన్నారు. లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలో గ్రౌండ్ నుంచి 6వ అంతస్తు వరకు వైట్ గ్లోవ్స్, 14నుంచి 16 అంతస్తుల వరకు అప్‌అండ్ ఎబౌవ్, 47,48 అంతస్తులలో థౌజండ్స్ ఆఫ్ స్టార్స్ ఉంటాయని నిర్మాణ విశిష్టతలను వివరించారు. 47వ అంతస్తులో ఇన్ఫినిటీ పూల్, సెంట్రల్ కోర్ట్ యార్డ్ ఉంటుందన్నారు. అత్యాధునిక ఫిట్‌నెస్ సెంటర్, లాంజ్, గోల్ఫ్ సిమ్యులేటర్ జోన్, టెన్నిస్‌కోర్ట్, గ్రాండ్ బాంక్వెట్స్, గెస్ట్‌ల కోసం సర్వీస్ రూమ్స్, బహుళ టెర్రస్ గార్డెన్‌లు ఉంటాయని వివరించారు. అత్యున్నత ప్రమాణాలతో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా టాటా ప్రాజెక్ట్ నిర్మిస్తోందన్నారు. వినియోగదారులు పూర్తి మానసిక ప్రశాంతతో 'ద ట్రిలైట్'లో నివసించవచ్చని వారు తెలిపారు.

రికార్డుస్థాయిలో మిర్చి ధర

- మలక్‌పేట్ మార్కెట్‌లో క్వింటాల్ రూ.21,000
- గతేడాది ఇదే సీజన్‌లో రూ.14,000
- దిగుమతులు తగ్గడంతోనే డిమాండ్ ఎక్కువ



సాక్షి, సిటీబ్యూరో: నగర మార్కెట్లకు ఎండు మిర్చి అనుకున్న స్థాయిలో దిగుమతులు లేకపోవడంతో ధర ఎక్కువ పలుకుతోంది. ఈ సీజన్‌లో మిర్చి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.18 వేల నుంచి రూ.21 వేల వరకు ధరలు నమోదయినట్లు మార్కెట్ అధికారులు చెప్పారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం నుంచే కాకుండా ఏపీలోని గుంటూరు, కర్నూలు నుంచి కూడా పెద్దగా మిర్చి హైదరాబాద్‌కు దిగుమతి కావడం లేదని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. . గత సంవత్సరం క్వింటాల్ మిర్చి ధర అత్యధికంగా రూ.14 వేలు పలకగా ఈసారి మాత్రం రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు రూ.18 వేల నుంచి రూ. 20 వేల వరకు పలుకుతోంది. మిర్చిలో అత్యంత నాణ్యమైనదిగా భావించే తేజా రికార్డు స్థాయిలో ధర పలుకుతున్నట్లు హోల్‌సేల్ మిర్చి వ్యాపారులు తెలిపారు.

రోజు మార్కెట్‌కు 20 వేల క్వింటాళ్లు

సాధారణంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో మార్కెట్‌కు వచ్చే మిర్చి ఉత్పత్తులు గతేడాదితో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. గతేడాది డిసెంబర్ నుంచే మార్కెట్‌ను ముంచెత్తుతోంది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి నెల ప్రాంభమైనా ఇంకా దిగుమతులు ఉపందుకోలేదని వ్యాపారులు పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లు మలక్‌పేట, ఉస్మాన్‌గంజ్, బోయిన్‌పల్లితో పాటు ఇతర చిన్న మార్కెట్లకు నిత్యం 40 నుంచి 60 లారీల సరుకు వస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. గత సంవత్సరం కంటే ఈసారి మిర్చి ఉత్పత్తి బాగా తగ్గిందంటున్నారు. కాగా.. సాధారణంగా ఉత్పత్తి బాగా పెరిగితే ధర పడిపోతుంది. దిగుమతి తగ్గడంతో ధరలు ఎక్కువగానే ఉంటాయి. . అయితే కొందరు వ్యాపారులు మాత్రం మిర్చిని అక్రమంగా నిల్వ చేసుకుని కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ముందస్తుగా ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకపోతే ఉల్లి మాదిరిగానే మిర్చి ధరలూ పెరిగిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

జలమండలికి నిధుల వరద పారేనా!

రూ.5,970 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు

- సుంకిశాల సహా పలు కీలక పథకాలకు నిధులు కావాలి
- ఈ నెల 6న రాష్ట్ర బడ్జెట్

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 6న ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల వరద పారుతుందని జలమండలి 'కోటి' ఆశలతో ఎదురు చూస్తోంది. మహానగర తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ పనులకు భారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ఆర్థిక శాఖకు సమర్పించింది. ఇందులో పలు కీలక పథకాలున్నాయి. ప్రధానంగా కృష్ణా మూడుదశల ప్రాజెక్టులు, గోదావరి మొదటి దశ పథకాల పూర్తికి వివిధ ఆర్థిక సంస్థల నుంచి సేకరించిన రుణాలపై వడ్డీ చెల్లింపులకు రూ.700 కోట్లు విడుదల చేయాలని సర్కారును కోరింది. సుంకిశాల వద్ద చేపట్టిన భారీ ఇన్‌టేక్ వెల్ నిర్మాణానికి రూ.1400 కోట్లు ప్రతిపాదించింది. నగరంలో నూతనంగా మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణానికి మరో రూ.1400 కోట్ల మేర ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

- ఔటర్ రింగ్ రోడ్డు లోపలున్న పంచాయతీలు, నగరపాలక సంస్థల పరిధిలో ఓఆర్‌ఆర్ ఫేజ్–2 పథకాన్ని పూర్తి చేసేందుకు మరో రూ.1200 కోట్లు కోరింది. పాతనగరంలో జోన్–2 మురుగునీటి పారుదల వ్యవస్థ పూర్తికి మరో రూ.300 కోట్ల మేర ప్రతిపాదనలు సిద్ధంచేసి ఆర్థిక శాఖకు సమర్పించింది. ఇతర అభివృద్ధి పథకాలకు మరో రూ.970 కోట్లు కోరినట్లు జలమండలి వర్గాలు తెలిపాయి.
- ఉచిత తాగునీటి పథకం అమలుతో నెలవారీగా నీటిబిల్లులతో రావాల్సిన ఆదాయన్ని బోర్డు గణనీయంగా కోల్పోయింది. దీంతో ప్రస్తుతం జలమండలి తీవ్రమైన ఆర్థిక నష్టాలతో నెట్టుకొస్తోంది. మరోవైపు శివారు ప్రాంతాల్లోనూ రోజువిడచి రోజు తాగునీటిని సరఫరా చేసేందుకు ఓఆర్‌ఆర్ ఫేజ్–2 పథకాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తేనే సుమారు 50 లక్షలమంది దాహార్తి సమూలంగా తీరనుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బడ్జెటరీ నిధులు అందితేనే పలు కీలక పథకాలు ఈ ఏడాదైనా పూర్తయ్యే అవకాశాలుంటాయని బోర్డు వర్గాలు స్పష్టంచేస్తున్నాయి.



హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాల కాలేజ్ జట్టు



వీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల జట్టు

హోరాహోరీగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్

SPL SAKSHI PREMIER LEAGUE | SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్-4 (ఎస్‌పీఎల్) పోటీలు శుక్రవారం కూడా హోరాహోరిగా జరిగాయి.

విజేతల వివరాలు...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–1

- మొదటి మ్యాచ్‌లో ఎస్పీ కాలేజ్ 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసి పరాజయం పాలైంది. ఎస్పీ కాలేజ్‌కు చెందిన ఇశాన్ 26 బంతుల్లో 75 పరుగులు, ఎడ్వాన్ 18 బంతుల్లో 39 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించారు.
- రెండవ మ్యాచ్‌లో సీఎంఆర్–ఎ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన లయోలా డిగ్రీ జట్టు 8.2 ఓవర్లలో 89 పరుగులు చేసి విజయం సాధించింది.
- మూడవ మ్యాచ్‌లో వీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసి ఓడిపోయింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో కేఎల్ హైదర్‌బాద్ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన హోలీమేరీ అటానామస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 75 పరుగులకు ఆలౌట్ అయి ఓడిపోయింది. కేఎల్ జట్టు క్రీడాకారుడు అయాన్ 25 బంతుల్లో 61 పరుగులు చేయగా, కౌషిక్, షన్ముక్ మూడేసి వికెట్లు తీశారు.
- రెండో మ్యాచ్‌లో హోలీమేరీ–ఎ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన వేదా డిగ్రీ–బి జట్టు 10 ఓవర్లలో 110 పరుగులు చేసి ఓడింది. హోలీమేరీ జట్టు క్రీడాకారుడు సర్దార్ 19 బంతుల్లో 61 పరుగులు చేశాడు.
- మూడవ మ్యాచ్‌లో అవినాష్ డిగ్రీ కాలేజ్ జట్టు 9.4 ఓవర్లలో 91 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన భారత్ ఫార్మసీ జట్టు 5 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేసి పరాజయం పాలయింది.

ఉద్యోగులను వేధిస్తున్న ఇన్‌చార్జి డీసీపై చర్యలు తీసుకోండి

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు టీజీహెచ్ఎంఈయూ వినతి

సాక్షి, సిటీబ్యూరో: మహిళా ఉద్యోగులను అసభ్య పద జాలంతో దూషిస్తున్న ముషీరాబాద్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ వైఖరితో సర్కిల్‌లోని ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, మహిళా ఉద్యోగి ఒకరు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేశారని టీజీహెచ్ఎంఈయూ అధ్యక్షుడు కె.బాలకృష్ణ జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. హరికృష్ణపై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం సమర్పించారు. గతంలోనూ ఇలాగే ప్రవర్తించిన ఆయన తమ యూనియన్ చేపట్టిన ఆందోళనతో మహిళా సిబ్బందికి క్షమాపణలు తెలిపారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మహిళా ఉద్యోగి ఆత్మహత్యకు ప్రయత్నించిన సందర్భంలో తమ యూనియన్ సభ్యులకు తెలియడంతో ఆ ప్రయత్నాన్ని విరమింపజేశారని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ సైతం ఆయన వైఖరి తెలిసి అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఆయన వేధింపుల వల్ల ఉద్యోగులు, సిబ్బంది ప్రశాంతంగా పనిచేసే పరిస్థితి లేదని, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఆయనను వెంటనే బదిలీ చేయాల్సిందిగా కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

చనిపోయిన ఉద్యోగికి పోస్టింగ్!

డిస్కంలో చర్చనీయాంశంగా మారిన హెచ్ఆర్ డైరెక్టర్ పనితీరు

సాక్షి, సిటీబ్యూరో: పదవీ విరమణ చేసిన ఓ ఇంజనీర్‌కు ఏకంగా ఎనిమిదేళ్ల పాటు డబుల్ శాలరీ ఇచ్చిన అంశాన్ని ఇంకా పూర్తిగా మరిచిపోక ముందే...తాజాగా చనిపోయిన మరో ఇంజనీర్‌కు ఏకంగా పదోన్నతి కల్పించడంతో పాటు పోస్టింగ్ కూడా ఇచ్చిన ఉదంతం వెలుగు చూసింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ హెచ్ఆర్ విభాగంలోని అధికారుల తప్పిదాలకు సంస్థ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు ప్రజల్లో అభాసుపాలవుతోంది.

రెండేళ్ల క్రితమే చనిపోయిన మల్లయ్య..

పి.మల్లయ్య (ఐడీ నంబర్ 1077222) మొదట్లో మెట్రోజోన్ పరిధిలోని డీఈ కేబుల్ ఆఫీసులో సబ్ ఇంజనీర్‌గా పనిచేశారు. అటు నుంచి బంజారాహిల్స్‌కు సబ్‌ఇంజనీర్‌గా బదిలీపై వెళ్లారు. అనారోగ్య కారణాల వల్ల ఆయన సుమారు రెండేళ్ల క్రితమే మృతి చెందారు. డిస్కం ఉన్నతాధికారులు చనిపోయిన మల్లయ్య స్థానంలో కారుణ్య నియామకం కింద ఆయన కుమార్తెకు సబ్ ఇంజనీర్‌గా ఉద్యోగం ఇప్పించారు. ప్రస్తుతం ఆమె సైబర్‌సిటీ సర్కిల్ ఆఫీసులోని కమర్షియల్ సబ్ ఇంజనీర్‌గా పని చేస్తోంది.

రెండు రోజుల క్రితం పదోన్నతి

రెండు రోజుల క్రితం 49 మంది సబ్ ఇంజనీర్లకు డిస్కం ఏఈలుగా పదోన్నతులు కల్పించింది. వీరిలో ఆ మేరకు పదోన్నతులు పొందిన వారి పేర్లతో సహా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే డిస్కం జారీ చేసిన ఈ జాబితాలో చనిపోయిన మల్లయ్య పేరు ఉండటమే కాకుండా ఆయనకు సబ్ ఇంజనీర్ నుంచి ఏఈగా పదోన్నతి కల్పించారు. ఏకంగా ఆయనకు వికారాబాద్‌లో పోస్టింగ్ కూడా ఇచ్చేశారు. ఏఈల జాబితాలో చనిపోయిన మల్లయ్య పేరు ఉండటాన్ని చూసి తోటి ఇంజనీర్లు ఆశ్చర్యపోయారు. అదేమిటని సంబంధిత సెక్షన్ అధికారులను, హెచ్ఆర్ డైరెక్టర్‌ను నిలదీశారు. దీంతో చేసిన తప్పిదాన్ని ఆ తర్వాత సరిదిద్దుకున్నారు.

ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన ఉండాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలకు సంబంధించి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు) సహాయ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓలు) పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి డిప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్స్)లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ఖర్చు, మాక్ పోల్, బ్యాలెట్ పత్రాలపై తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవీఎంల పనితీరును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం–6, 7, 8లకు సంబంధించి ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

FREE TRAINING

■ పేద అమ్మాయిలకు హైదరాబాద్ కూకట్‌పల్లి లో ఫ్రీ వసతితో 120డేస్ ఫ్రీ–ట్రైనింగ్, HR+ కమ్యూనికేషన్ + కంప్యూటర్ లర్నింగ్, ప్రాక్టీస్ తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆదాయం+మంచి భవిష్యత్తు. స్మార్ట్ ఫోన్ మస్ట్: 9032944447. [HA-5585]

Real Estate

■ Chance To Get Monthly income* Invest 10L-36L in commercial property&get 6k-54k monthly life long 4 details sms monthly to 7013732055 [H-792918]

BUILDING CONSTRUCTION

■ ఇల్లు కట్టి ఇవ్వబడును. 100% వాస్తు క్వాలిటీ మెటీరియల్‌తో 20 సం॥ అనుభవం గల ఇంజనీర్లు, మేస్త్రీలు మీ బడ్జెట్‌లో కట్టి ఇవ్వబడును. Ph: 7386082969 [H-792648]

FOR SALE

■ Khajaguda Main Road Flat For Resale Niharika INTER LAKE 5th Floor, 4 BHK N/F 2600 sft 3 car park Ph: 7680802498 9490759634 [WB-51611]

FLAT FOR SALE

■ Near ECIL Cross Road 2, 3BHK Flats for Resale: Gated Community Club House, Swimmingpool. No GST: Brand New Call: 9502277099. [H-793315]

■ 1900 Sft, 3BHK, E/F, W/F, Luxury, Flats for Sale, Ready to Occupy, Near A.S. Rao Nagar, ECIL Contact. 9866053685, 9949437555, 9392400065. [HA-89860]

■ Jeedimetla TSIIC Colony, Shapur Elite County, 2 & 3 BHK, 1000sft.-1550Sft. GYM, Function Hall, Play Area, Ready to Occupy. Ph: 8790738313, 8008813256 [H-792792]

HOUSE FOR SALE

■ 2BHK Flats & INDP Houses with Furniture HMDA, Near Hayathnagar, Gated Community, Loans, B. Bheem Reddy, Ph: 8885060741, 9700974808. [HA-10077]

■ Boduppal Venkat Reddy Nagar New Indp.Houses, 133yds, G+1, E/F, Rs.1.30Cr. Neg. Investment Plots also avail. Ph:9848415855 [HA-10080]

LAND FOR SALE

■ 200చ॥ గజాల ఈస్ట్ ఫేసింగ్ ప్లాటు అమ్మబడును, మహేశ్వరం మండల హెడ్ క్వార్టర్ కు ఆనుకొని ఉన్నది. గజం : 7999/–. ఫోన్ : 9966521191. [H-792822]

PLOT FOR SALE

■ హైదరాబాద్ టు ముంబాయి హైవేలో వోక్సెన్ యూనివర్సిటీ దగ్గరలో DTCP అప్రూవ్డ్ లేఅవుట్ వెంచర్ నందు రెసిడెన్షియల్ ప్లాట్లు అన్ని డెవలప్‌మెంట్స్ తో అవుట్ రేట్‌లో చ॥గ॥10,000కు అమ్మబడును. ఫోన్: 7032715288. [HA-947]

■ అతి తక్కువ ధరలో గేటెడ్ కమ్యూనిటీ Flats (Hyd- నారపల్లి) ఫామ్ ప్లాట్లు (ఆలేరు) స్విమ్మింగ్ పూల్, కాటేజ్, క్లబ్ హౌస్, ఫంక్షన్ హాల్, కాంపౌండ్ వాల్ తో కలవు. ఫోన్ : 9396910449. [HA-92016]

■ తూముకుంట, షామీర్‌పేట్, తుర్కపల్లి, HMDA, DTCP & GP లేఅవుట్ ప్లాట్స్ 150 నుండి 2000 చ॥గ॥ నియర్ కరీంనగర్ హైవే. HMDA 50ఎ. న్యూ లేఅవుట్ @ 30k, DTCP @ 10k, GP@5500/- to 12000/- ఫోన్ : 9505899055. [HA-919]

■ వరంగల్ హైవే యాదాద్రి–వంగపల్లి హైవే DTCP ఫైనల్ అప్రూవ్డ్ లేఔట్‌లో గ॥ 6999/–, రూ. 1,60,200, 400 గ॥ ప్లాట్లు అన్ని డెవలప్‌మెంట్స్‌తో, స్వా॥రి॥, 5 గ్రా॥ గోల్డ్ ఫ్రీ, ఫోన్ 8885505308 [HA-2414]

■ హైదరాబాద్ @ రామోజీఫిల్మ్‌సిటీ దగ్గర కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ & HMDA లాజిస్టిక్ హబ్ పక్కనే ఉన్న మాన్యూ HMDA వెంచర్‌లో ఇల్లు కట్టుకునే ప్లాట్లు కలవు. ఫోన్ :9666645756. [HA-5582]

■ వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరం షాద్‌నగర్ టౌన్, R.R.(D) 147గ. నుండి విల్లా ప్లాట్స్ గ॥ 7000/లు, DTCP, RERA అప్రూవ్డ్, లిమిటెడ్ ప్లాట్స్, విలేజ్ ప్రక్కన, 100% వాస్తు. 9494256069. [HA-10820]

■ సాగర్ హైవే Nr. ఫార్మాసిటీ, యాచారం, ఇన్వెస్టర్ ప్రైస్ 4,999/– వీకెండ్ ఫాం ప్లాట్స్, గేటెడ్ కమ్యూనిటీ (12yrs మామిడి చెట్లు) గెస్ట్ హౌస్‌తో రెడీ టూ కన్‌స్ట్రక్షన్. Ph: 9121687916 [H-792578]

■ షాద్‌నగర్ @ రాజాపూర్ దగ్గర 0% ఇంట్రెస్ట్ తో 30 నెలల EMIతో అన్ని డెవలప్‌మెంట్స్‌తో 147 గజాల MUDA=(HMDA) లేఔట్లో ఓపెన్ PLOTS కలవు. ఫ్రీ సైట్ విజిట్‌కు సంప్ర.: 9949695027 [HA-950]

■ విజయవాడ హైవే @ రామోజీఫిల్మ్‌సిటీ, వరంగల్ హైవే @ వంగపల్లి నందు HMDA & DTCP అప్రూవల్ కలిగి ఇళ్ళ నిర్మాణం జరుగుతున్న వెంచర్‌లో డైరెక్ట్ కంపెనీ ప్లాట్లు కలవు. 9515438614 [G-3064]

■ సిద్దిపేట జిల్లా, కొమురవెల్లి టెంపుల్ దగ్గర లో కొత్త DTCP అప్రూవ్డ్ లేఅవుట్ ఓపెన్ ప్లాట్స్ కలవు, క్లియర్ టైటిల్, LP No. 15/2022 DTCPO/SDPT. ఫోన్: 8886302029 [H-787375]

■ VRK Green Vally Mega Launching offer Hmda LP Aprvd for sq.yd 18000/- Offer 15,999/- per Sq.yd. SPOT REG 15grms gold Near Masenpally Subanpur. Ph: 7780238388 [HA-28752]

■ Warangal Highway, Yadadri Temple & Sagar Highway, Open Plot TS & Independent House available. Ph: 9398495831, 6302551064. [HA-2405]

■ HMDA & DTCP Open Plots for sale on Sagar highway& Sri Sailam Highway Spot Registration, Bank Loans, 9493080626, 9640173579. [HA-10753]

Services

■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1746]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792810]

BUSINESS OFFER

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 9494995999 [H-787432]

■ ఒక సరైయిన రోజువారి ఆదాయ అవకాశం. కేవలం అతి తక్కువ పెట్టుబడితో ఒక మంచి ప్రయత్నం ఇప్పుడే ప్రారంభించండి. Dont Miss. సంప్ర॥ 7793987988 [G-776082]

■ Home / Mortgage Loans Plan Deviations Residence/ Commercial, CC & OD Facility DSA SBI & TATA Fin. Call: 9052123435. [H-786799]

■ We arrange all types of Loans. Private Finance, Third Party Collateral, Chits & Sureties with / without Income Basis. Ph: 6300084535. [H-787484]

BEAUTY CARE TRAINING

■ ఉచిత బ్యూటీషియన్ కోర్స్ నేర్పించబడును. హన్నబ్యూటీ ట్రైనింగ్ అకాడమీ సికింద్రాబాద్. సంప్రదించవలసిన నెంబర్ 8688274335 [H-793505]

HOME NEEDS

PEST CONTROL

■ KS పెస్ట్ కంట్రోల్ టెర్మైట్ 2B/R 1800/- 3B/R 2300/- 10 స॥ల గ్యారంటీ, చెదలు, బొద్దింకలు, నల్లులు, బల్లులు, జెల్ 450/– ఫోన్: 8686101598, 9494914020 [HA-5229]

■ Reddorkins Pest Control: ఫోన్: 9989956152, కాక్రోచ్‌జెల్, చెదలు, ఫర్నీచర్ పౌడర్ రాలుట, నల్లులు, బల్లులు, చీమలు, ఎలుకలు, తేనెటీగలు, దోమలు. Covid Sanitization Treatment [HA-89894]

PERSONAL CARE

LOST

■ (మం) అబ్దుల్లాపూర్‌మెట్, (గ్రా) మునుగనూర్ రెవెన్యూ పరిధిలో సర్వే నెం. 60, 74, 75, 76 లోగల ప్లాట్ నెం. 405, 200 గజాలు గల డాక్యుమెంట్ నెం. 7657/1988 ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. మేము ఇబ్రహీంపట్నం లో బస్ లో వెళుతూ ఉండగా దారి మధ్యలో పోయినవి. పేరు: వి. మాధురి W/o. వి. జటధర్, H.No. 11-13-135/2, టెలిఫోన్ కాలనీ, కొత్తపేట్, సరూర్ నగర్, రంగారెడ్డి – 500035. ఫోన్ నం. 9985058909 [H-787376]

■ I.Mohammed Mahaboob Ali S/o. Late Burhansab. aged67yrs. R/o. 8415/ 71, Saptagiri Colony, miyapur. Hyd, TS-500090. I have lost my passport vide Passport No U6717601 if found Call.9959999044 [H-792798]

■ I M.VIJAY KRISHNA S/o M. Madhan mohan 50yrs R/o. 2-3-597/3, Amberpet, Hyderabad-13, Have Lost my sale deed document No.4150/1980 SRO Hayathnagar, while traveling by bus on 01/02/2023 from Amberpet to Uppal 'X' Road, any body found please Cont:9348889900 [H-787433]

OLD AGE HOME

■ లేపాక్షి హెల్త్‌కేర్ 24/7 గం॥లు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు కేర్‌టేకర్స్/నర్సులను మీ ఇంటికీ పంపబడును. తెలంగాణ. Ph: 9640400073 [HA-940]

Wanted

■ ఆడ వంట మనిషి కావలెను / ఒక కుటుంబానికి వంట చేయటానికి వెజ్ అండ్ నాన్ వెజ్ వండుటకు/నల్లకుంట హైదరాబాద్ నందు కావలెను. ఫోన్ : 7013922389. [H-792589]

■ శ్రీకృష్ణ హోమ్‌కేర్ (Govt. Reg.) Hyd లో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబికేర్, ఇంటి/ వంటపనికి స్త్రీలు/పు॥ కావలెను (ఏజెంట్లకు మంచి కమీషన్) జీ: 15,000-25000/– రూం+భో॥ ఫ్రీ. ఫోన్ : 9000448989. [H-793506]

■ స్కూలోనే ఉంటూ స్కూల్లో పని చేయుటకై భార్య (ఆయా), భర్త (వాచ్‌మన్) కావలెను, రూమ్ ఇవ్వబడును. S.R నగర్, ఫోన్: 9985187777. [H-793317]

■ అమీర్‌పేట్, మైత్రివనం దగ్గర ప్రముఖ రియల్ ఎస్టేట్ కం॥లో పనిచే॥ (F) టెలికాలర్స్, (M/F) మార్కెటింగ్ ఎగ్జి॥ జీతం+ఇన్సెంటివ్. VRS, LIC, Chits, Rtd Emp. హౌస్‌వైఫ్స్ సంప్ర: 7842161232 [H-793310]

■ ఆడపనిమనిషి కావలెను ఒక కుటుంబానికి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నల్లకుంట హైదరాబాద్ నందు పని చేయుటకు కావలెను. ఫోన్ : 7013922389. [H-792590]

■ అనుభవం గల హెవీ/లైట్ డ్రైవర్లు, గ్రాఫిక్, డిజైనర్, అకౌంటెంట్, హౌ॥కీ॥ బాయ్స్, లోడింగ్/అన్‌లోడింగ్ బాయ్స్ కావలెను. బ్యాచిలర్స్‌కు ఉచిత వసతి లక్డీకాపూల్. Ph: 9100222333, 8885992363 [H-793554]

■ స్పాట్ జాయినింగ్ జీ: 30,000 (Fixed) HDFC, ICICI, SBI, Axis బ్యాంక్‌లకై M/F ఆఫీస్ స్టాఫ్ కావలెను. All Areas. Q: 10th - PG, Age: 18-30 ఫోన్: 7997067340 [HA-10074]

■ Part Time Job ఇంటి వద్దనే వుంటు లేడీస్ మొబైల్ ఫోన్ ద్వారా నెలకు 2,000 to 6,000 వరకు సంపాదన No. Fee, No. Target Call: 9949712349, 9395305921. [HA-10070]

■ క్రాంతిరోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటోనగర్ ఆఫీస్ నందు గుమస్తాలుగా పనిచేయుటకు 10th ఆపై చదివినవారు 30 సం॥లోపు గల మేల్ అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెం. నందు సంప్రదించగలరు. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. ✆ 87901 91999 [B-3]

■ Need News యాంకర్స్ & కంప్యూటర్ ఆపరేటర్స్, Prathibha News ఛానల్‌లో ఫీమేల్ యాంకర్స్ ఇద్దరు కావలెను. Age: 19-35yrs, Sal: 10k upto 20k Locations, Hayathnagar. Ph: 9550129486 [H-792967]

■ హైదరాబాద్‌లో ఇంటిపని, వంటపని మరియు పిల్లలను చూసుకొనుటకు 45 సం॥లోపు ఆడ పనివాళ్ళు కావలెను. జీతం: 15,000/–, భోజన వసతి కల్పించబడును. ఫోన్: 9063005675. [HA-13889]

■ ప్రముఖ R.E కంపెనీ (బంజారాహిల్స్)కి టెలీకాలర్స్, మార్కెటింగ్ సిబ్బంది & సోషల్ మీడియా ఎక్స్‌పర్ట్ కావలెను. చిరు నిరుద్యోగులు, రిటైర్డ్, ఫుల్/పార్ట్, సాలరీ/కమీషన్+Inc.ఫోన్: 9440190279, 8919735040. [HA-5987]

■ ప్రహస్య బేబీకేర్ పిల్లలను చూడటానికి, పెద్దలకు సేవ చేయటానికి మహిళలు కావలెను. 12 Hrs or 24 Hrs, హైదరాబాద్. ఫోన్ : 9533909627, 8125784389. [H-787377]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779878]

■ తక్షణమే వాలెట్ పార్కింగ్ డ్రైవర్ కావలెను గచ్చిబౌలిలో చేరిన వెంటనే సంప్రదించండి. ఫోన్: 7386843005, 040-40068674 [HA-10081]

■ అర్జెంటుగా (తెలుగు) మాట్లాడే టెలికాలర్స్, సె॥గార్డ్స్, డేటాఎంట్రీ Marketing (M/F) స్టాఫ్ కావలెను. Q:10th-PG (No-Target) Sal: 15k-20k స్పాట్ జాయినింగ్. 6309433980, 7396900132. [H-787492]

■ తెలంగాణ వార్తలు TV ఛానెల్ లో 1–2సం॥ల అనుభవం గల టెలికాలర్స్ (F) కావలెను, జీ: 15వేలు, Q: ఇంటర్, సన్ సిటీ Hyd. ఫోన్: 9494980424, 9391431692 [H-793556]

■ ప్రముఖ కం॥కి రిటైర్డ్ ఎంప్లాయీస్, హౌస్ వైఫ్, బిజినెస్ పర్సన్స్ కావలెను నెలకి ఇన్ కమ్ 30k-50k, Q: 10th- ఇంటర్ (వర్క్ ఫ్రం హోం జాబ్స్ కలవు) సంప్ర: 9949960103, 9849647373 [H-793360]

■ డైరెక్ట్ జాబ్: షాబాద్, షాద్‌నగర్, బూర్గుల కంపెనీలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, హెల్పర్స్ కావలెను. రూం ఫ్రీ, జీ: 13–18 వేలు, ఫోన్: 7207205071, 9959239357 [HA-10079]

■ Wanted Site Engineer (Gents), Architects (Gents or Ladies), Interior Designers (Ladies), Autocad Operator (Ladies) and Accountant with min 2 years Experience. Office at Himayat Nagar, Hyderabad Mail your resume to: akhilassociates@gmail.com [HA-10082]

■ Females as Spoken Eng Trainers at Hyd schools. Any qualification, any experience will do. Free training. salary upto 30,000/- PM. 8919641609 [H-793263]

■ Wanted Telecaller Executives Only for Girls 12k + Commission, Karkana, Secunderabad. Ph : 8297926316 [H-792820]

■ Site Engineers-2 (Diploma/BE Civil, 3-5Years Exp. Villa Constructions. Construction Manager: (BE.Civil, above 10yrs. Exp. Villa Construction. Immediate joiners Work & Site: Shankarpally. Walk-in Interview on Sunday from 9am-2pm on 4th Feb. @ Ridhira Living Pvt. Ltd. Gachibowli. Ph:7207925836. [HA-10075]

■ Sales Cum Marketing Person for Textile Dealer, Auto Drivers for City Sales& delivery for Whole sale Linning, Blouse, Crape,Raw Silk Free Delivery. 9391644112 [HA-10076]

■ Need Marketing Executives / Managers to meet Schools for book Publishers Salary 15000 -30000/ PM Call:8919641609 [H-793268]

FACULTY TEACHERS

■ Wanted Exp. and Trained Teachers to Handle Higher-Maths, Physics at Kakatiya High School, Warasiguda, Sec'bad. Ph: 9246224773, 9347616102, E: ktswarasiguda@gmail.com [HA-10066]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell :9912225453

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

లా పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ తొలగింపు అన్యాయం

ఉన్నతవిద్యా మండలి ఛైర్మన్‌కు విద్యార్థుల వినతి



ప్రొ.లింబాద్రికి వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ అనుబంధ బషీర్‌బాగ్ లా పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి అనురాధపై విచారణ చేపట్టకుండా పదవి నుంచి తొలగించడం తగదని లా విద్యార్థులు పేర్కొన్నారు. పదవి నుంచి తొలగించేందుకు గల కారణాలను వెల్లడించాలని గత రెండు రోజులుగా ఓయూలో ఆందోళనలు చేపట్టినా అధికారులు పట్టించుకోకపోడంతో శుక్రవారం ఉన్నతవిద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రికి వినతిపత్రం సమర్పించారు. కాలేజీలో చోటు చేసుకున్న సంఘటనలపై లింబాద్రికి వివరించి ప్రిన్సిపాల్‌గా అనురాధను కొనసాగించాలని కోరినట్లు దివాకర్, అమూల్య, ఆదిత్య, కిశోర్, నాగరాజు, చైతన్య తెలిపారు. ఓయూ న్యాయకళాశాలలో చిన్న వయసులోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించిన డాక్టర్ అనురాధ ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె. బషీర్‌బాగ్ లా పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసేందుకు సీనియర్ అధ్యాపకులు నిరాకరించడంతో గుమ్మడి అనురాధకు పాలన అనుభవం లేకున్నా ప్రిన్సిపాల్‌గా నియమించారు. అధ్యాపకుల కొరత కారణంగా ఆమె రాత్రింబవళ్లు విధులు నిర్వహించారని, హఠాత్తుగా తొలగించడంతో తీవ్రమనస్థాపానికి గురైనట్లు విద్యార్థులు పేర్కొన్నారు.



ట్రస్ట్ ఆవిర్భావ సభలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

టూరిజం హబ్‌గా తెలంగాణ


గన్‌ఫౌండ్రీ: రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం పర్యాటక కేంద్రంగా మారనుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో రాచకొండ బుద్ధ విహార ట్రస్ట్ ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ప్రకృతి సౌందర్యంతో పాటు చారిత్రాత్మక నేపథ్యం ఉందని పేర్కొన్నారు. భావితరాలకు గౌతమ బుద్ధుడి ఆలోచనలను అందజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. నల్గొండ జిల్లా శివన్నగూడ గ్రామంలో బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సుచిర్ ఇండియా సీఈఓ లయన్ కిరణ్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు పల్లె రవికుమార్, మేనేజింగ్ ట్రస్టీ గిరి నర్సింహ, వంగాల అమరేందర్ రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అందరితో చర్చించాకే విలీనం

- కంటోన్మెంట్‌పై రక్షణ మంత్రి హామీ
- పార్లమెంట్‌లో ఎంపీ రేవంత్‌రెడ్డి ప్రశ్నకు సమాధానం

కంటోన్మెంట్: భాగస్వామ్య పక్షాలు, ప్రజాప్రతినిధులతో చర్చించాకే కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ చేపడతామని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ స్పష్టం చేశారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఎ.రేవంత్ రెడ్డి పార్లమెంట్‌లో ప్రస్తావించిన ప్రశ్నకు శుక్రవారం ఆయన సమాధానం ఇచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని సివిలియన్ ప్రాంతాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు ఎనిమిది మంది సభ్యులతో కూడిన కమిటీ వేసింది నిజమేనా అని అడగ్గా అవును అని సమాధానం ఇచ్చారు. ఆ కమిటీలో ప్రజాప్రతినిధులైన ఎంపీ, ఎమ్మెల్యేలను ఎందుకు చేర్చలేదని రేవంత్ రెడ్డి అడిగారు. అయితే అందరు భాగస్వామ్య పక్షాలతో చర్చించాకే విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని రక్షణ మంత్రి వెల్లడించారు. సమీప మున్సిపాలిటీతో పోలిస్తే కంటోన్మెంట్ ప్రాంతాలు నగరీకరణ ప్రయోజనాలు తగిన రీతిలో అందడం లేదని గతంలో తాము ఏర్పాటు చేసిన సుమిత్ బోస్ కమిటీ తేల్చిందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్‌ల అభివృద్ధికి సుమిత్ బోస్ కమిటీ పలు ప్రతిపాదనలు చేసిందన్నారు.

10న సుచిత్ర సర్కిల్‌లో మానేపల్లి జ్యువెలర్స్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సుచిత్ర సర్కిల్ వేదికగా మానేపల్లి జ్యువెలరీస్ వారి ఆరవ షోరూంను ఈ నెల 10వ తేదీన ప్రారంభిస్తున్నామని సంస్థ డైరెక్టర్ గోపీకృష్ణ తెలిపారు. ఈ జ్యువెలరీ ప్రారంభోత్సవ తేదీ విడుదల కార్యక్రమాన్ని అమీర్‌పేట్‌లోని హోటల్ మేరీగోల్డ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీనటి సలోని అస్వానీ, మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ లిఖిత యలమంచలి పాల్గొన్నారు. ర్యాంప్ వాక్‌తో సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆభరణాల ప్రదర్శనలో పలువురు మోడల్స్, ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో అర్హత సాధించలేదని యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: సివిల్స్ పరీక్షలో అర్హత సాధించలేకపోయాననే ఆవేదనతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎం.పవన్ వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా మానేపల్లికి చెందిన నాగేంద్రుడి కుమారుడు కార్తీక్ (24) గత కొన్ని నెలల క్రితం సివిల్స్ కోచింగ్ కోసం నగరానికి వచ్చి అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో పాటు ఓ గదిలో అద్దెకు ఉంటున్నాడు. ప్రతిరోజు కోచింగ్ సెంటర్‌కు వెళ్లి క్లాసులకు హాజరయ్యేవాడు. ఇటీవల కార్తీక్‌కు ఆర్థిక ఇబ్బందులు రావడంతో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగం నచ్చకపోవడంతో కొన్ని రోజులకే మానేశాడు. జీవితంలో అనుకున్న లక్ష్యం నెరవేరలేదని, ఎన్నో నెలల నుండి సివిల్స్ పరీక్షల కోసం సన్నద్ధమైనా అర్హత సాధించలేదని స్నేహితుల వద్ద చెప్పుకుని బాధపడేవాడు. గురువారం శ్రీనివాస్ బయటకు వెళ్లగా కార్తీక్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శ్రీనివాస్ తిరిగి రాత్రి 10.30గంటలకు వచ్చి చూడగా కార్తీక్ గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. కార్తీక్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లిని దొంగిలించిన ముగ్గురు నిందితుల అరెస్టు



అల్వాల్: పెంపుడు పిల్లిని దొంగిలించి..కోసుకుని తిన్న ముగ్గురు నిందితులను నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నర్సింహస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ జీకే కాలనీలో నివాసం ఉండే తాలూరి రూత్ వర్ష పెంచుకుంటున్న పిల్లి గత నెల 29వ తేదీ నుండి కనిపించడం లేదు. ఇంట్లో సీసీ కెమెరాలను పరిశీలించడంతో ముగ్గురు వ్యక్తులు ఇంట్లో చొరబడి పిల్లిని అపహరించి సంచిలో వేసుకొని పారిపోయినట్లు గుర్తించారు. దీంతో నేరేడ్‌మెట్ పోలీసులకు రూత్‌వర్ష ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా వినాయక్‌నగర్‌కు చెందిన నర్సింహ, కిరణ్, శంకర్ నిందితులుగా గుర్తించి శుక్రవారం అరెస్టు చేశారు. ఆహారం కోసమే పిల్లిని దొంగిలించామని నిందితులు తెలిపారు.

క్లుప్తంగా

అభివృద్ధిలో ఆదర్శంగా తెలంగాణ

లిబర్టీ: అభివృద్ధి, ప్రజాసంక్షేమం విషయంలో తెలంగాణ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ శుక్రవారం శాసన సభలో ప్రసంగిస్తూ, ప్రగతిశీల సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తెలంగాణ ప్రగతి పథంలో సాగుతోందని పేర్కొనడం అభినందనీయమన్నారు. 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ సరఫరా, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా, ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమలును కూడా గవర్నర్ తన ప్రసంగంలో ప్రశంసించడం గొప్ప పరిణామం అని సందానంద్ అన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై మంత్రికి ఫిర్యాదు

ఫిలింనగర్: ఫిలించాంబర్, అపోలో పరిసర ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలంటూ జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ మంత్రి కేటీఆర్‌కు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అడుగడుగునా ఫుట్‌పాత్ ఆక్రమణలతో స్థానికంగా అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయని. పాదచారులు రోడ్డుపైనే నడవాల్సి వస్తోందని, ఇందుకు సంబంధించిన ఫొటోలను కూడా ఫిర్యాదుకు జతపర్చారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు ఇప్పటికే పదిసార్లు ఈ ఆక్రమణలపై ఫిర్యాదు చేశామన్నారు. రోజురోజుకూ ఫుట్‌పాత్ ఆక్రమణలు పెరిగిపోతుండటంతో నడిచి వెళ్లేందుకు కూడా వీల్లేకుండా పోతున్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వీరాంజనేయ గుడిలో ప్రత్యేక పూజలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న ఆలయ ధర్మకర్త లక్ష్మణ్‌గౌడ్

రహమత్‌నగర్: బోరబండ వినాయకరావునగర్ వీరాంజనేయ దేవస్థానంలో ఆలయ శిఖరం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పాన, అగ్ని ప్రతిష్ఠ, మంగళశాసనంతో పాటు గణపతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ, స్వామి ఆలయంలో ఈ నెల 5 వరకు ప్రత్యేక పూజలు కొనసాగుతాయని, భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని పిలుపు నిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు రమేశ్‌యాదవ్, జగన్నాథ్, రాములు ముదిరాజ్, మనోహర్ రెడ్డి, ఆనంద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా' గుర్తింపు కార్డుల పంపిణీ



దేవరకొండ బస్తీలో పెన్షన్ కార్డులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ దేవరకొండ బస్తీలో శుక్రవారం ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి డిజిటల్ పెన్షన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, దళారులను నమ్మొద్దని, ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాములు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి భవన్ ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ నాయకులు

పంజగుట్ట: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ప్రగతిభవన్ ముట్టడికి యత్నించారు. టూరిజం ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకొని 15 మందిని అదుపులోకి తీసుకుని ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ తరలించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, కుందన్ యాదవ్, అఖిల్ రెడ్డిలతో పాటు మరో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు.

ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ సంతాపం

ఖైరతాబాద్: కళాతపస్వి, దర్శకుడు కె.విశ్వనాథ్ మృతికి ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ సంతాపం తెలిపింది. శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో ఉత్సవ కమిటీ సభ్యులు విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. సభ్యులు రాజ్‌కుమార్, సందీప్‌రాజ్, మహేష్‌యాదవ్, గజ్జల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీచర్ బదిలీ దరఖాస్తుల పరిశీలన

- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- ఏప్రిల్‌లో హెచ్ఎంల నియామకాలు



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయ బృందం

బంజారాహిల్స్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియడంతో దరఖాస్తుల పరిశీలన ముమ్మరంగా జరుగుతోంది. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్, బోరబండ, రహ్మత్‌నగర్, షేక్‌పేట, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరిధిలో ఒకే చోట 8 సంవత్సరాలు పైబడి పని చేస్తున్న ఉపాధ్యాయులు 55 మంది ఉన్నారు. మరో 103 మంది తమను మరో చోటకు బదిలీ చేయాలని కోరుతూ రిక్వెస్ట్ దరఖాస్తు చేసుకున్నారు.

- ఇక షేక్‌పేట మండల పరిధిలోని 24 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 64 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 23 మంది ఒకే చోట 8 ఏళ్లు పైబడి పని చేస్తూ లాంగ్ స్టాండింగ్‌లో ఉన్నారు. మరో 41 మంది మరో చోటకు బదిలీ చేయాలంటూ రిక్వెస్ట్ పెట్టుకున్నారు.
- కొంత మంది ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఎడిట్ ఆప్షన్ ఉపయోగించుకొని తప్పులను సవరించుకున్నారు.
- ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే అందజేశారు.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి సర్వీస్ రిజిష్టర్‌ను కాంప్లెక్స్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరిశీలించి తప్పులను సవరించారు.
- అనంతరం వీటిని ధ్రువీకరించి మండల విద్యాధికారులకు అందజేశారు.
- మండల విద్యాధికారులు వీటిని ధ్రువీకరించి డీఈఓ కార్యాలయానికి సమర్పించనున్నారు. డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బృందాలు ఈ దరఖాస్తులను పరిశీలించనున్నాయి.
- ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ బుధవారం ముగిసింది. చాలా మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు.
- జోన్ పరిధిలో స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి గణితం, భౌతికశాస్త్రం, బయోసైన్స్, ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం రివైజ్డ్ సీనియారిటీ జాబితాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఆయా జాబితాలపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఫిర్యాదు చేయవచ్చునని అధికారులు ఇప్పటికే సూచించారు.

ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు...

- బదిలీల ప్రక్రియలో భాగంగా పలువురు ప్రధానోపాధ్యాయులను ఇక్కడి నుంచి బదిలీ చేయగానే పదోన్నతులు లభించనున్నాయి.
- ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు కూడా బదిలీల అనంతరం ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్లు లభించనున్నాయి. స్కూల్ అసిస్టెంట్లను ప్రధానోపాధ్యాయులుగా నియమిస్తారు.
- ఏప్రిల్ 23న బదిలీ అయిన వారంతా ఆయా పాఠశాలల్లో రిపోర్ట్ చేస్తారు. మొత్తానికి ఏప్రిల్ 23వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ పూర్తవుతుంది.
- మార్చి 4వ తేదీ లోపలే ఎవరెవరికి ఎక్కడెక్కడ పోస్టింగ్‌లు లభించాయో తెలిసిపోనుంది.

జాతీయ స్థాయి చెస్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సునీల్, రాజా రిత్విక్ తదితరులు

వెంగళరావునగర్: చదరంగం టోర్నమెంట్స్‌ను నిర్వహించి, ఆ ఆటను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు వి-ఫోర్ ట్రస్ట్ చేస్తున్న కృషి మరువలేనిదని పెన్నార్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కేఎం సునీల్ అన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం వి-ఫోర్ చెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన సునీల్ మాట్లాడుతూ, ఏకాగ్రతను పెంచే క్రీడ చెస్ అని, చిన్నారులు తప్పకుండా దీనిపై దృష్టి సారించాలని సూచించారు. అంతర్జాతీయ చెస్ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ మాట్లాడుతూ, మెదడుకు పదును పెడితేనే గ్రాండ్ మాస్టర్లు కాగలరన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ, గత డిసెంబర్‌లో రాష్ట్రస్థాయి టోర్నమెంట్, జనవరిలో అంతర్జాతీయ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించామన్నారు. కాగా తాజాగా నిర్వహించే ఈ టోర్నీ 1600 కంటే తక్కువ రేటింగ్ ఉన్న క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. శుక్రవారం నుంచి 5వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కంది రాము, అమిత్ పాల్ సింగ్, రిషిపాల్ సింగ్, బీనిష్ భాటియా తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ పోటీలకు దేశంలోని దాదాపు 20 రాష్ట్రాల నుంచి 512 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి



హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ కోరింది. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐయూటీసీ కార్యాలయం వద్ద కార్మికుల పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ స్టాఫ్-ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ డిమాండ్ మాట్లాడుతూ... మున్సిపాలిటీలు, పురపాలక సంఘాలు, కార్పొరేషన్లలో చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ నెలకు రూ. 24 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల నుంచి కార్మికులకు జీతాలు చెల్లించే విధానం రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు బోసు, బాలరాజు, వెంకటయ్య, రవిచంద్ర, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ డబ్బింగ్ కళాకారుల సమస్యలు పరిష్కరించండి



తలసానిని కలిసిన తెలంగాణ డబ్బింగ్ కళాకారుల కార్మిక సంఘం నేతలు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ టీవీ, సినీ డబ్బింగ్ కళాకారుల కార్మిక సంఘం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్నా తెలంగాణ కళాకారుల కార్మిక సంఘాలు చెల్లవని కొన్ని యూనియన్లు తప్పుడు ప్రచారాలు చేస్తూ కళాకారుల ఉపాధికి ఆటంకం కలిగిస్తున్నారని తెలంగాణ టీవీ, సినీ కళాకారుల కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వై. కిరణ్‌కుమార్, రాజేష్‌లాల్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌ను కలిసి డబ్బింగ్ కళాకారుల సమస్యలను వివరించి, పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్మిక సంఘంచే అనుమతులు పొంది ఉచితంగా డబ్బింగ్ కార్డులను అందిస్తూ వారికి సంఘం తోడుగా ఉందని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని, తెలంగాణ డబ్బింగ్ కళాకారులను ఆదుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నేతల అరెస్ట్



బంజారాహిల్స్: నూతన సచివాలయంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం మాక్ డ్రిల్‌పేరుతో పక్కదారి పట్టించాలని చూస్తోందని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సెక్రటేరియట్‌లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని పరిశీలించేందుకు కార్యకర్తలతో కలిసి వెళ్తుండగా ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. నేతలు, కార్యకర్తలను నిరోధించారు. ఈ సందర్భంగా పోలీసులకు, రోహిణ్‌రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు ఆయనను అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ అగ్ని ప్రమాద ఘటనపై అఖిల పక్షబృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ నేతలు కాటూరి రమేష్, అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.


స్టేడియం వద్ద కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

వెంగళరావునగర్: కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం తాము రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమకు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులు మాట్లాడుతూ, దాదాపు 200 మంది ఇక్కడ విధులు నిర్వహిస్తున్నామని, ప్రతి నెలా కాంట్రాక్టర్ తమకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. నెలకు కేవలం రూ.10 వేలు మాత్రమే ఇచ్చే జీతాలు కూడా మూడు నాలుగు నెలలుగా ఇవ్వకపోతే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి కాంట్రాక్టర్ ద్వారా తమకు జీతాలు ఇప్పించాలని కోరారు.

గణపతి చెంత 'సాగర సంగమం' షూటింగ్



ఖైరతాబాద్ గణపతి ఎదుట కమల్‌హాసన్‌తో పాట చిత్రీకరిస్తున్న విశ్వనాథ్



ఖైరతాబాద్: విశ్వఖ్యాతి సంపాదించుకున్న ఖైరతాబాద్ మహాగణపతి చెంత 1982లోనే దిగ్గజ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ సాగర సంగమం సినిమా చిత్రీకరించారు. కమల్‌హాసన్‌తో మహాగణపతి బ్యాక్‌డ్రాప్‌గా పాట చిత్రీకరించారు. ఈ షూటింగ్‌కు సంబంధించిన అనుభవాన్ని కొంత కాలం క్రితం 'సాక్షి'తో విశ్వనాథ్ పంచుకున్నారు...

విశ్వనాథ్ ఏమన్నారో ఆయన మాటల్లోనే...

'నేను హోటల్ నుంచి షూటింగ్‌కు వెళ్తున్నప్పుడల్లా ఖైరతాబాద్ వినాయ విగ్రహాన్ని చేస్తుండేవాడిని. మద్రాసు నుంచి వచ్చిన మాకు ఈ భారీ విగ్రహం తయారీ అంతా విచిత్రంగా అనిపించేది. ఎలాగైనా గణపతిని సినిమాలో చూపించాలని అప్పుడే మనస్సులో బీజం పడింది. అప్పుడు సాగర సంగమం షూటింగ్ చేస్తున్నాం. కథానాయకుడు తన ఆత్మసాక్షికి విరుద్ధంగా సినిమా నృత్యదర్శకుడు కోరినట్టుగా నృత్యం చేయాల్సి రావడం, ఎందుకిలా మంచి సాహిత్యాన్ని పాడుచేస్తున్నారనే సన్నివేశాన్ని చిత్రీకరించాలి. అప్పుడు నా మదిలో ఖైరతాబాద్ గణపతి గుర్తుకొచ్చాడు. విగ్రహం ఎదుట పశ్చాత్తాప దృశ్యాన్ని చిత్రీకరిస్తే బాగుంటుందనిపించింది. కమల్‌హాసన్‌ను హోటల్‌కి పిలిచి నా ఆలోచన వివరించా. ఆ తర్వాత ఖైరతాబాద్ గణపతి విగ్రహం ఎదుట సన్నివేశాన్ని చిత్రీకరించా. అలా నా సినిమాలో మహాగణపతిని చూపించా. 1982లో ఖైరతాబాద్‌లో 25 అడుగుల ఎత్తులో శిల్పి రంగారావు, ఆర్టిస్టుగా ఉన్న చిన్నస్వామి రాజేంద్రన్ నేతృత్వంలో తొమ్మిది ఎలుకలు రథం లాగుతున్న ఆకారంలో నిలబడి ఉన్న ఆకారంలో వినాయక విగ్రహాన్ని తయారు చేశారు.

భూమిని కాపాడుకుందాం

ఆకట్టుకున్న విద్యార్థిని వేసిన పెయింటింగ్



సేవ్ ఎర్త్ థీమ్‌తో చైత్ర వేసిన చిత్రం

బంజారాహిల్స్: ఇప్పటి నుంచే మనం భూమిని కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు కలిగించిన వారం అవుతామని, మొక్కలు నాటి కాలుష్యాన్ని అంతమొందిద్దామని ఓ విద్యార్థిని వేసిన పెయింటింగ్ టీచర్లను విశేషంగా ఆకట్టుకుంది. ఫిలింనగర్ వెంచర్- 2 లో నివసించే బొమ్మాలి చైత్ర ఫిలింనగర్ రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. స్కూల్ టీచర్ విద్యార్థులకు పర్యావరణ నేపథ్యంలో పెయింటింగ్ వేయాలని సూచించారు. చైత్ర సేవ్ ఎర్త్ థీమ్ తో వేసిన పెయింటింగ్ అందరినీ కదిలించింది. పచ్చదనం లేకపోతే పర్యావరణం దెబ్బతిని కాలుష్యం పెరుగుతుంది అని ఒక వైపు.., పచ్చదనం ఉంటే ధరిత్రి పరిఢవిల్లుతుందని మరోవైపు చూపించి గొప్ప సందేశం ఇచ్చింది. సర్కారు బడిలో చదువుతూ మంచి ఆలోచన చేసిన ఆ విద్యార్థిని అందరూ అభినందించారు.



ఫిలింనగర్‌తో విశ్వనాథ్‌కు ఎనలేని అనుబంధం



ఫిలింనగర్ కల్చరల్ సెంటర్లో కళాతపస్వి విశ్వనాథ్ కు సన్మానం (ఫైల్)

బంజారాహిల్స్: దిగ్గజ దర్శకుడు, రచయిత, నటుడు కళాతపస్వి విశ్వనాథ్ 35 సంవత్సరాల క్రితం హైదరాబాద్ వచ్చి ఫిలింనగర్‌లో ఇల్లు కట్టుకున్నారు. ఇక్కడే ఎక్కువ సినిమాలు నిర్మించారు. సాగర సంగమం సినిమాలో ఓ పాటను ఖైరతాబాద్ పెద్ద గణేష్ వద్ద కమలహాసన్ తో చిత్రీకరించారు. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయింది. దర్శకత్వ బాధ్యతలు తగ్గించి నటుడిగా ఎన్నో సినిమాలో ఇక్కడే నటించారు. సినీ కార్యక్రమాల్లో తరచూ పాల్గొనేవారు. ఆయనతో పాటు బాలసుబ్రహ్మణ్యంను ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ ఘనంగా సత్కరించారు. విశ్వనాథ్ ఫిల్మ్ నగర్ తో మంచి అనుబంధాన్ని కొనసాగించారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న కె.విశ్వనాథ్

లిబర్టీ: తెలుగు వెండి తెరకు వెలుగులు నింపిన గొప్ప దర్శకుడు కె.విశ్వనాథ్ అని భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కేపీఎస్ శర్మ అన్నారు. ఆయన మృతి చలన చిత్ర రంగానికి, ప్రేక్షకులకు తీరని లోటని అన్నారు. భారతీయ ధార్మిక సేవా సమితి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విశ్వనాథ్ శంకరాభరణం, స్వాతిముత్యం, శుభసంకల్పం, ఆపద్బాంధవుడు, సిరివెన్నెల వంటి అనేక సందేశాత్మకత సినిమాలు చిత్రీకరించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. విశ్వనాథ్ మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలని 21 మహాధర్నా

పంజగుట్ట: గత బడ్జెట్‌లో దళితబంధు పథకానికి కేటాయించిన నిధులు వెంటనే విడుదల చేసి ఈ యేడు బడ్జెట్‌లో తగు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ధర్నా కరపత్రాన్ని మహా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్యాపాక నర్సింగ్ రావు, తెలంగాణ దండోర వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము మాదిగలతో కలిసి ఆవిష్కరించారు. 21 నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున దళిత సామాజిక వర్గం వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ దళిత సంఘాల నాయకులు రాందాస్ మాదిగ, రమ్య, సరస్వతి, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ కార్యాలయ ముట్టడికి పోలీస్ అభ్యర్థుల యత్నం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయ ముట్టడికి యత్నించిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులను శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం పలువురు అభ్యర్థులు అక్కడికి చేరుకోవడం, అప్పటికే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఇదిలా ఉండగా, ఆందోళన చేస్తున్న 16 మంది అభ్యర్థులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరంతా రన్నింగ్‌లో క్వాలిఫై కాగా లాంగ్ జంప్‌లో అనర్హతకు గురయ్యారు. అయితే తమకు మెయిన్స్ రాసేందుకు అర్హత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పేదల పక్షపాతి కేసీఆర్

రహమత్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల పక్షపాతి అని, వారి కోసం ఆయన అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్‌కు చెందిన దుర్గాప్రసాద్, సయ్యద్ ఇలియాస్‌లకు సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.80 వేల చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ విజయ్‌సింహ,సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, సర్దార్, రమేశ్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో యువతి అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ గ్రామానికి చెందిన బజార్ పావని(20) బ్యూటీషియన్ కోర్సు చేసేందుకు నెల క్రితం హైదరాబాద్‌కు వచ్చి అపోలో ఆస్పత్రి సమీపంలోని సాయి గాయత్రి గర్ల్స్ హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 1న ఉదయం అల్పాహారం చేసిన అనంతరం హాస్టల్ నుంచి బ్యూటీషియన్ శిక్షణ కేంద్రానికి వెళ్లింది. సాయంత్రం హాస్టల్‌కు రాలేదు. తల్లి భీమమ్మ అదే రోజు మధ్యాహ్నం నుంచి కూతురుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఆందోళన చెందిన ఆమె 2వ తేదీ రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంది. హాస్టల్‌తో పాటు చుట్టుపక్కల విచారించినా పావని ఆచూకీ లభ్యం కాకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు పావని కోసం గాలిస్తున్నారు.

మటన్ క్యాంటీన్లు ఉపసంహరించుకోవాలి

లిబర్టీ: ప్రభుత్వం ఏర్పాటు చేసే మటన్ క్యాంటీన్లను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆరెకటిక అభివృద్ధి సంఘం ప్రతినిధి బృందం అసెంబ్లీలో కాంగ్రెస్ పక్ష నాయకుడు బట్టి విక్రమార్క, బీజేపీ శాసన సభ్యుడు రఘునందన్‌రావు, ఎంఐఎం శాసన సభ్యుడు కౌసర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆరెకటికె అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి ఆశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం వారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు నందీశ్వర్, దినేష్, శ్రీనివాస్, గోపాల్, సరస్వతి, జ్ఞానేశ్వరి తదితరులున్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

వెంగళరావునగర్: క్రీడలపై విద్యార్థులు, కాలనీవాసులు ఆసక్తి కనబర్చడం, ప్రతి ఒక్కరూ ఆటల పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని సినీనటి దివ్యవాణి, నటుడు విశ్వ కార్తికేయ అన్నారు. డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీ ఇండోర్ స్టేడియం, జిమ్ వార్షికోత్సవ కార్యక్రమం స్థానిక సాగి రామకృష్ణంరాజు ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దివ్యవాణి, విశ్వ కార్తికేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడలు మనసుకు ఎంతో ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడె సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణ చక్రవర్తి, నాయకులు దామోదర్‌రావు, అజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించి వివిధ క్రీడాపోటీల్లో పాల్గొన్న వారికి ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఏసీపీకి శుభాకాంక్షలు



పంజగుట్ట: పంజగుట్ట ఏసీపీగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఎస్.మోహన్ కుమార్‌ను సోమాజిగూడ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎ.మహేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మోహన్‌కుమార్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సమయంలో నేరాలను అదుపునకు అనేక చర్యలు తీసుకున్నారని, అందరితో స్నేహంగా మెలిగారని, ఇప్పుడు తిరిగి ఏసీపీగా రావడం ఎంతో సంతోషంగా ఉందని మహేష్ యాదవ్ అన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
910	244
60,842	17,854

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,168	▼	32
డోజోన్స్	34,117	▲	63
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,902	▲	82
డాక్స్	15,477	▼	33
షాంఘై	3,263	▼	22
నికాయ్	27,509	▲	107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	56,730
బంగారం (22 క్యారెట్)	54,030
వెండి (కిలో)	76,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.41	83.08
£	బ్రిటన్ పౌండ్	88.03	91.16
€	యూరో	98.76	102.13
¥	జపాన్ ఎన్ (100)	62.98	65.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	56.94	59.33
S$	సింగపూర్ డాలర్	61.69	63.75
SAR	సౌదీ రియాల్	20.24	22.01
UAE D	యూఏఈ దిర్హామ్	21.31	23.07
¥	చైనా యువాన్	10.26	12.85

జోయాలుక్కాస్ వాలెంటైన్స్‌డే ఆఫర్

హైదరాబాద్: వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రముఖ వజ్రాభరణాల సంస్థ జోయాలుక్కాస్ జ్యూవెలరీ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. తన సుప్రసిద్ధ ''బీ మెయిన్'' కలెక్షన్ పరంపరలో కొత్త శ్రేణి డిజైన్లను మార్కెట్లోకి విడుదల చేసింది. రోజ్ గోల్డ్, ఎల్లో గోల్డ్, డైమండ్‌తో రూపొందించిన హార్ట్-థీమ్డ్ జ్యూవెలరీ రింగులు, లాకెట్లు, పెండెంట్లు, బ్రాస్‌లెట్లను అందుబాటులో ఉంచింది. ఆఫర్‌లో భాగంగా వజ్రాలపై 25% డిస్కౌంట్‌ను పొందవచ్చు. ఫిబ్రవరి మూడో తేదీన మొదలైన ఈ ప్రత్యేక ఆఫర్ 14వ తేదీ వరకు కొనసాగుతుంది. కస్టమర్లంతా ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని గ్రూప్ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు వీమార్ట్ శ్రీకారం

ముంబై: ప్రముఖ ఫ్యాషన్ రిటైలర్ వీమార్ట్ దేశవ్యాప్తంగా 20 లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ఉత్పత్తులు, ప్రక్రియలు, సాంకేతికత రూపంలో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. సీఎస్ఆర్ కార్యక్రమం కింద పర్యావరణ పరిరక్షణ, సామాజికాభివృద్ధిపై ప్రధాన దృష్టి సారించామని పేర్కొంది. వాతావరణ మార్పుల సమస్యలకు దీర్ఘకాలం పాటు పెద్ద మొత్తంలో మొక్కలు నాటడం పరిష్కారమని కంపెనీ ఎండీ లలిత్ అగర్వాల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-2-2023	
విశాఖ	460-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	445-00
రిటైల్ ధర (డజను)	72.00
3-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	426-00
వరంగల్	428-00
రిటైల్ ధర	4.85

వారాంతాన భారీ లాభాలు

- ఒడిదుడుకుల ట్రేడింగ్ నుంచి ఉపశమనం
- బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్ల మద్దతు
- ఒకటిన్నర శాతం ర్యాలీ చేసిన సూచీలు
- సెన్సెక్స్ 973 పాయింట్లు ప్లస్
- 17,850 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: కొంతకాలంగా తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు ఎట్టకేలకు శుక్రవారం భారీ లాభాలను ఆర్జించగలిగాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు రాణించడంతో ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 418 పాయింట్లు పెరిగి 60,350 వద్ద మొదలైంది. నిఫ్టీ 112 పాయింట్లు పెరిగి 17,722 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఉదయమే ఉత్సాహంగా ప్రారంభమైన సూచీలు మిడ్ సెషన్ తర్వాత మరింత జోరును కనబరిచాయి. ఒక దశలో 973 పాయింట్లు బలపడి 60,905 వద్ద, నిఫ్టీ 244 పాయింట్లు దూసుకెళ్లి 17,854 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 910 పాయింట్ల లాభంతో



60,842 వద్ద, నిఫ్టీ 244 పాయింట్లు పెరిగి 17,854 వద్ద స్థిరపడ్డాయి. ఫార్మా, రియల్టీ, మెటల్, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉందంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యలతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్ షేర్లకు డిమాండ్ నెలకొంది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.932 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1265 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 34 పైసలు బలపడి 81.86 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. సూచీలు 1.5% లాభంతో బీఎస్ఈలో రూ.1.లక్షకోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.266.73 లక్షల కోట్లకు చేరింది.

లాభాలు ఎందుకంటే...: అదానీ గ్రూప్ గురించి కొన్ని సానుకూల సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల సైకిల్ ఈ ఏడాదితో ముగియవచ్చనే అంచనాలు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. భారతీయ ఫైనాన్షియల్ మార్కెట్‌కు ఢోకా లేదని ఆర్థిక మంత్రి సీతారామన్ వ్యాఖ్యలు మార్కెట్ వర్గాలకు ఉత్సాహాన్నిచ్చాయి.

అదానీ గ్రూప్‌లో 4 కంపెనీల షేర్లు అప్

ఫ్రెంచ్ ఎనర్జీ దిగ్గజం టోటల్ ఎనర్జీ సంస్థ సానుకూల సపోర్టుతో అదానీ గ్రూప్‌లోని పది కంపెనీలకు గానూ 4 కంపెనీల షేర్లు లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 35 శాతం నష్టపోయిన ఏడాది కనిష్టానికి(రూ.1,017) పతనమైన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు కోలుకుని 1.25% లాభంతో 1,584 వద్ద స్థిరపడింది. అదానీ పోర్ట్స్ 14.51%% నష్టపోయి రూ.395 వద్ద 52 వారాల కనిష్టాన్ని తాకింది. బౌన్స్‌బ్యాక్ ర్యాలీతో ఎనిమిదిశాతం లాభపడి రూ.499 వద్ద నిలిచింది. అంబుజా సిమెంట్స్, ఏసీసీ సిమెంట్స్ షేర్లు వరుసగా 6%, 4% చొప్పున లాభపడ్డాయి. అదానీ ట్రాన్స్‌మిషన్స్(10%), అదానీ గ్రీన్ ఎనర్జీ(10%), అదానీ పవర్(10%), అదానీ విల్మార్(5%), అదానీ టోటల్(5%), ఎన్‌డీటీవీ(5%) షేర్లు లోయర్ సర్క్యూట్ తాకాయి.

ఎస్‌బీఐ లాభం జూమ్

- క్యూ3లో రూ. 15,477 కోట్లు
- అదానీ రుణాలతో సమస్యల్లేవు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్- డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 62 శాతం జంప్‌చేసి రూ. 15,477 కోట్లను తాకింది. స్టాండెలోన్ నికర లాభం సైతం రూ. 8,432 కోట్ల నుంచి రూ. 14,205 కోట్లకు ఎగసింది. రుణ నాణ్యతతోపాటు, వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం రూ. 78,351 కోట్ల నుంచి రూ. 98,084 కోట్లకు పురోగమించింది. అయితే నిర్వహణ వ్యయాలు రూ. 20,839 కోట్ల నుంచి రూ. 24,317 కోట్లకు పెరిగాయి. మొండి రుణాలకు ప్రొవిజన్లు సగానికి తగ్గి రూ. 1,586 కోట్లకు పరిమితమయ్యాయి.

ఎన్‌పీఏలు తగ్గాయ్

క్యూ3లో ఎస్‌బీఐ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.50 శాతం నుంచి 3.14 శాతానికి తగ్గాయి. నికర వడ్డీ ఆదాయం 24 శాతం పుంజుకుని రూ. 38,069 కోట్లయ్యింది. ఇతర ఆదాయం రూ. 8,673 కోట్ల నుంచి రూ. 11,468 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ మార్జిన్లు 0.35 శాతం బలపడి 3.5 శాతానికి చేరాయి. దాదాపు 19 శాతం రుణ వృద్ధి నమోదైంది. అదానీ గ్రూప్‌నకు రూ. 27,000 కోట్ల రుణాలిచ్చినట్లు వెల్లడించింది. అయితే రుణ చెల్లింపుల్లో ఎలాంటి సమస్యలూ తలెత్తలేదని స్పష్టం చేసింది. తాజా స్లిప్పేజీలు రూ. 2,334 కోట్ల నుంచి రూ. 3,098 కోట్లకు పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 13.27 శాతంగా నమోదైంది.



డిపాజిట్లు ఓకే

డిపాజిట్ల సమీకరణలో తీవ్రపోటీ నేపథ్యంలో 8 శాతం వృద్ధిని సాధించాం. డిపాజిట్లను పెంచుకునేందుకు పలు చర్యలను తీసుకున్నాం. రూ. 3 లక్షల కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కలిగి ఉన్న నేపథ్యంలో రేట్ల పోటీకి తెరతీయబోము. – దినేష్ ఖారా, చైర్మన్, ఎస్‌బీఐ.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు బీఎస్ఈలో 3.2 శాతం జంప్‌చేసి రూ. 544 వద్ద ముగిసింది.

ఐటీసీ లాభం రూ. 5,070 కోట్లు

షేరుకి రూ. 6 డివిడెండు

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ, డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 5,070 కోట్లను అధిగమించింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 4,119 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు 4 శాతం వృద్ధితో రూ. 19,021 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 18,366 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. అయితే మొత్తం వ్యయాలు 3 శాతంపైగా తగ్గి రూ. 12,772 కోట్లకు పరిమితమయ్యాయి. వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున మధ్యంతర డివిడెండు ప్రకటించింది.

విభాగాలవారీగా..

క్యూ3లో సిగరెట్లుసహా మొత్తం ఎఫ్ఎంసీజీ విభాగం టర్నోవర్ 17 శాతం వృద్ధితో రూ. 12,935 కోట్లకు చేరింది. దీనిలో సిగరెట్ల ఆదాయం 16



శాతం ఎగసి రూ. 8,086 కోట్లను తాకింది. ఇతర ఎఫ్ఎంసీజీ నుంచి 18 శాతం అధికంగా రూ. 4,849 కోట్లు సమకూరింది. హోటళ్ల ఆదాయం 49 శాతం జంప్‌చేసి రూ. 739 కోట్లను దాటగా, గోధుమలు, బియ్యం ఎగుమతులపై ఆంక్షల కారణంగా అగ్రిబిజినెస్ 36 శాతం క్షీణించి రూ. 3,305 కోట్లకు పరిమితమైంది. పేపర్ బోర్డ్స్, ప్యాకేజింగ్ టర్నోవర్ 13 శాతం పుంజుకుని రూ. 2,306 కోట్లు కాగా.. ఇతర విభాగాల నుంచి రూ. 857 కోట్లు సమకూరింది. ఇది 18 శాతం అధికం.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో 0.5 శాతం బలపడి రూ. 381 వద్ద ముగిసింది.

బీవోబీ లాభం హైజంప్

క్యూ3లో రూ. 4,306 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్- డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 75 శాతం జంప్‌చేసి రూ. 4,306 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 75 శాతం పైగా ఎగసి రూ. 3,853 కోట్లను తాకింది. రుణ నాణ్యతతోపాటు, వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. నికర వడ్డీ ఆదాయం 27 శాతం పుంజుకుని రూ. 10,818 కోట్లయ్యింది. నికర వడ్డీ మార్జిన్లు 0.24 శాతం బలపడి 3.37 శాతానికి చేరాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 7.25 శాతం నుంచి 4.53 శాతానికి దిగివచ్చాయి.



ఫలితాల నేపథ్యంలో బీవోబీ షేరు 6.2 శాతం జంప్‌చేసి రూ. 164 వద్ద ముగిసింది.

నియంత్రణ సంస్థలు పక్కాగా ఉన్నాయి

- చక్కని నిర్వహణతో కొనసాగుతాయి
- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: భారత నియంత్రణ సంస్థలు ఎంతో కచ్చితత్వంతో, కఠినంగా పనిచేస్తుంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్లలో నెలకొన్న పరిణామాలు అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో అనిశ్చితికి దారితీశాయా? అంటూ గౌతమ్ అదానీ గ్రూప్ షేర్ల పతనం గురించి ఓ వార్తా సంస్థ అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించారు. దశాబ్దాలుగా ఎన్నో పాఠాలు నేర్చుకున్నామని చెబుతూ.. నియంత్రణ సంస్థలు మన మార్కెట్‌ను చక్కని, సరైన స్థితిలో నిలబెట్టినట్టు పేర్కొన్నారు. ముందున్నట్టే భారత్ ఇకమీదటా చక్కని నియంత్రణలతో కూడిన ఫైనాన్షియల్ మార్కెట్‌గా కొనసాగుతుందన్నారు. ''అంతర్జాతీయంగా ఎక్కువగా చర్చించుకుంటున్న ఓ సంఘటన భారత మార్కెట్లు ఎంత గొప్పగా నిర్వహించబడతాయనే దానికి నిదర్శనం కాబోదు'' అని మంత్రి పేర్కొన్నారు. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ అదానీ గ్రూపు కంపెనీలు, షేర్లపై ఆరోపణలతో ఓ నివేదిక విడుదల చేయడం తెలిసిందే. ఈ నివేదిక తర్వాత అదానీ గ్రూపు కంపెనీలు ఈ వారంలో ఊహించని విధంగా భారీ నష్టాలు చూశాయి. దీంతో ఆర్థిక మంత్రి దీనిపై స్పష్టత ఇచ్చారు.



మెరుగ్గా బ్యాంకింగ్ వ్యవస్థ

భారత బ్యాంకింగ్ వ్యవస్థ నేడు ఎంతో సౌకర్యంగా ఉందని మంత్రి సీతారామన్ స్పష్టం చేశారు. నికర నిరర్థక రుణాలు (ఎన్‌పీఏలు) చాలా కనిష్ట స్థాయికి దిగొచ్చినట్టు చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. కేబినెట్ ఆమోదం పొందిన పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణను ముందుకు తీసుకెళతామని ప్రకటించారు.

పోరాడి ఓడిన సాయిప్రణీత్

థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. భారత్ నుంచి బరిలో మిగిలిన ఏకైక ప్లేయర్ భమిడిపాటి సాయిప్రణీత్ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. బ్యాంకాక్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన ప్రపంచ 49వ ర్యాంకర్ సాయిప్రణీత్ 17-21, 23-21, 18-21తో ప్రపంచ 23వ ర్యాంకర్, ఆరో సీడ్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక మూడో గేమ్‌లో సాయిప్రణీత్ స్కోరు 12-12 వద్ద ఉన్నపుడు తడబడి వరుసగా ఆరు పాయింట్లు సమర్పించుకోవడం టర్నింగ్ పాయింట్ అయింది. సాయిప్రణీత్‌కు 1,260 డాలర్ల (రూ. 1 లక్ష 3 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 3,850 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



'జెయింట్స్' హెడ్ కోచ్‌గా రేచల్ హేన్స్

బౌలింగ్ కోచ్‌గా నూషీన్ అల్ ఖదీర్ నియామకం

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో అత్యధిక మొత్తంతో టీమ్‌ను సొంతం చేసుకున్న అహ్మదాబాద్ యాజమాన్యం అందరికంటే వేగంగా, చురుగ్గా టీమ్ నిర్మాణంపై దృష్టి పెట్టింది. ఈ టీమ్ 'గుజరాత్ జెయింట్స్'కు భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను ఇటీవలే మెంటార్‌గా ఎంపిక చేయగా, ఇప్పుడు టీమ్ హెడ్ కోచ్‌ను ప్రకటించింది. ఆస్ట్రేలియా మాజీ స్టార్ ప్లేయర్ రేచల్ హేన్స్ 'జెయింట్స్'కు హెడ్ కోచ్‌గా వ్యవహరించనుంది. గత ఏడాదే ఆటకు గుడ్‌బై చెప్పిన హేన్స్ ఆసీస్ తరఫున ఆరు ప్రపంచకప్ విజయాల్లో భాగంగా ఉండటం విశేషం. ఆస్ట్రేలియా తరఫున ఆమె 6 టెస్టులు, 77 వన్డేలు, 84 టి20ల్లో ప్రాతినిధ్యం వహించింది. దీంతో పాటు మరో రెండు నియామకాలను కూడా అహ్మదాబాద్ ఫ్రాంచైజీ ప్రకటించింది. ఇటీవలే వరల్డ్‌కప్ నెగ్గిన భారత మహిళల అండర్-19 టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించిన నూషీన్ అల్ ఖదీర్‌ను బౌలింగ్ కోచ్‌గా... తుషార్ ఆరోథేను బ్యాటింగ్ కోచ్‌గా ఎంపిక చేశారు. గత ఏడాది మహిళల టి20 చాలెంజ్ టోర్నీ నెగ్గిన 'సూపర్ నోవాస్'కు కోచ్‌గా పని చేసిన అనుభవం నూషీన్‌కు ఉండగా, బరోడా మాజీ క్రికెటర్ తుషార్ భారత సీనియర్ మహిళల టీమ్‌కు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు.



రేచల్



నూషీన్

అంబానీ X అదానీ

తొలి మ్యాచ్‌లో ముంబైతో అహ్మదాబాద్ 'ఢీ'

డబ్ల్యూపీఎల్‌లో అన్ని మ్యాచ్‌లు ముంబైలోనే జరుగుతాయి. నగరంలోని బ్రబోర్న్, డీవై పాటిల్ స్టేడియంలను టోర్నీ వేదికలుగా ఎంపిక చేశారు. షెడ్యూల్‌పై బోర్డు ఇంకా అధికారిక ప్రకటన ఇవ్వకపోయినా... మార్చి 4న తొలి మ్యాచ్ జరుగుతుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. భారత కార్పొరేట్ దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీలకు చెందిన ముంబై, అహ్మదాబాద్ టీమ్‌లు ఈ పోరులో తలపడే అవకాశం ఉంది. ముంబైలోని ప్రధాన స్టేడియం వాంఖడేను ఐపీఎల్ కోసం మాత్రమే వినియోగిస్తారు. మొత్తం 22 మ్యాచ్‌లు ఉండే ఈ టోర్నీ ఫైనల్ మార్చి 26న జరుగుతుంది. ఐదు జట్లు పాల్గొంటున్న డబ్ల్యూపీఎల్‌లో మూడు టీమ్‌లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. లీగ్ దశలో ఒక్కో టీమ్ ఇతర నాలుగు జట్లతో (మొత్తం 8 మ్యాచ్‌లు) తలపడుతుంది. అత్యధిక పాయింట్ల జట్టు ఫైనల్‌కు చేరితే... మరో ఫైనలిస్ట్ కోసం తర్వాతి రెండు టీమ్‌ల మధ్య ఎలిమినేటర్ నిర్వహిస్తారు. ఫ్రాంచైజీ ఒప్పందాలు ఖరారు చేసేందుకు శుక్రవారం ఐదు టీమ్‌ల యాజమాన్యాలతో బీసీసీఐ సమావేశమైంది.

డోపింగ్‌లో పట్టుబడ్డ దీపా కర్మాకర్‌పై వేటు

భారత జిమ్నాస్ట్‌పై 21 నెలలు నిషేధం

న్యూఢిల్లీ: రియో ఒలింపిక్స్‌లో భారత మెరికగా అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించిన స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ డోపింగ్‌లో పట్టుబడింది. నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు పరీక్షల్లో తేలడంతో ఆమెపై అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) 21 నెలల నిషేధం విధించింది. 2016లో 'రియో' విశ్వవేదికపై ప్రమాదకరమైన 'ప్రొడునోవా' విన్యాసంతో దీప ఆకట్టుకుంది. ప్రదర్శన ముగిసి ల్యాండింగ్ సమస్యతో త్రుటిలో ఆమె కాంస్య పతకాన్ని కోల్పోయి చివరకు నాలుగో స్థానంతో తృప్తి పడింది. అయితే భారత విశ్లేషకులు, క్రీడాభిమానులంతా ఆమె ప్రదర్శనను ఆకాశానికెత్తారు. తదనంతరం గాయాల బెడదతో మరే మెగా ఈవెంట్‌లోనూ ఆమె పాల్గొనలేకపోయింది. నిజానికి 2021 అక్టోబర్‌లోనే ఆమె డోపింగ్‌లో పట్టుబడింది. కానీ ఈ విషయాన్ని ఇప్పుడు బహిర్గతం చేశారు. అప్పటి నుంచి శిక్షాకాలం అమలు కావడంతో ఈ ఏడాది జూలై 10వ తేదీతోనే నిషేధం ముగుస్తుంది.



వాలీబాల్ లీగ్‌కు వేళాయె...



ట్రోఫీతో ఎనిమిది జట్ల కెప్టెన్‌లు

- నేడు బెంగళూరులో ప్రారంభం
- బరిలో ఎనిమిది జట్లు
- హైదరాబాద్, కొచ్చిలోనూ మ్యాచ్‌లు
- మార్చి 5న టైటిల్ పోరు

బెంగళూరు: గత ఏడాది వాలీబాల్ ప్రియుల్ని అలరించిన ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ఇప్పుడు రెండో సీజన్‌తో మరింత ప్రేక్షకాదరణ పొందాలని ఆశిస్తోంది. నేటి నుంచి ప్రారంభమయ్యే సీజన్-2 పోటీల్లో ఎనిమిది ఫ్రాంచైజీ జట్లు కోల్‌కతా థండర్‌బోల్ట్స్, హైదరాబాద్ బ్లాక్‌హాక్స్, కొచ్చి బ్లూ స్పైకర్స్, కాలికట్ హీరోస్, అహ్మదాబాద్ డిఫెండర్స్, బెంగళూరు టొర్పెడోస్, చెన్నై బ్లిట్జ్, ముంబై మిటియోర్స్ 'ఢీ'కి రెడీ అయ్యాయి. డిఫెండింగ్ చాంపియన్స్ కోల్‌కతా థండర్‌బోల్ట్స్ తమ జోరు ఈ సీజన్‌లోనూ కొనసాగించేందుకు ఉత్సాహంగా ఉంది. ముందుగా శనివారం నుంచి లీగ్ దశలో 28 మ్యాచ్‌లు జరుగుతాయి. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య మార్చి 3, 4 తేదీల్లో సెమీఫైనల్స్ పోటీలు నిర్వహిస్తారు. 5న విజేతను తేల్చే ఫైనల్ పోరుతో టోర్నీ ముగుస్తుంది. బెంగళూరులో నేడు కోల్‌కతా థండర్‌బోల్ట్స్, బెంగళూరు టొర్పెడోస్‌ల మధ్య ఆరంభ మ్యాచ్ జరుగుతుంది. ఈ నెల 12 నుంచి 21 వరకు హైదరాబాద్ వేదికగా 11 మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం మిగిలిన లీగ్ దశ సహా సెమీస్, ఫైనల్ దాకా కొచ్చిలోనే మ్యాచ్‌ల్ని నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు మొదలయ్యే మ్యాచ్‌లను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఈ టోర్నీలో విజేతగా నిలిచే జట్టుకు క్లబ్ వాలీబాల్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. ఈసారి, వచ్చే ఏడాది క్లబ్ వాలీబాల్ ప్రపంచ చాంపియన్‌షిప్ భారత్‌లోనే జరగనుండటంతో మరో విశేషం.

తొలి సింగిల్స్‌లో యూకీ బాంబ్రీ ఓటమి

హిలెరాడ్ (డెన్మార్క్): భారత్‌తో జరుగుతున్న డేవిస్ కప్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్స్ తొలి రౌండ్ పోటీలో డెన్మార్క్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి సింగిల్స్ మ్యాచ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హోల్గర్ రూన్ 6-2, 6-2తో యూకీ బాంబ్రీని ఓడించాడు. కేవలం 58 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో 19 ఏళ్ల రూన్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ఏటీపీ ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో సింగిల్స్ మ్యాచ్‌లు ఆడటం మానేసిన యూకీ ఈ మ్యాచ్‌లో ఒక్క ఏస్ కూడా కొట్టలేకపోయాడు. నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసిన యూకీ ఒక్కసారి కూడా ప్రత్యర్థి సర్వీస్‌లో బ్రేక్ పాయింట్ అవకాశం సంపాదించలేకపోయాడు.



ఆంధ్రపై గెలుపుతో సెమీస్‌లో మధ్యప్రదేశ్

- 245 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన డిఫెండింగ్ చాంపియన్
- కర్ణాటక, బెంగాల్ కూడా సెమీస్‌కు

ఇండోర్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో తొలిసారి సెమీఫైనల్ చేరుకునే అవకాశాన్ని ఆంధ్ర జట్టు వృథా చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆంధ్ర జట్టు ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది. 245 పరుగుల విజయలక్ష్యాన్ని మధ్యప్రదేశ్ 77 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించి సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 58/0తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ అదే స్కోరు వద్ద ఓపెనర్ హిమాన్షు మంత్రి (31; 3 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. అనంతరం యశ్ దూబే (58; 6 ఫోర్లు), శుభమ్ శర్మ (40; 3 ఫోర్లు) రెండో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. యశ్ దూబే అవుటయ్యాక వచ్చిన రజత్ పాటిదార్ (76 బంతుల్లో 55; 5 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి అర్ధ సెంచరీ సాధించాడు. శుభమ్‌తో మూడో వికెట్‌కు 38 పరుగులు, నాలుగో వికెట్‌కు సారాంశ్ జైన్ (28 నాటౌట్; 1 ఫోర్)తో 49 పరుగులు జోడించాక పాటిదార్ అవుటయ్యాడు. కెప్టెన్ ఆదిత్య శ్రీవాస్తవ (2) తక్కువ స్కోరుకే వెనుదిరిగినా... హర్ష్ గావ్లి (18 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి సారాంశ్ మధ్యప్రదేశ్‌ను విజయతీరానికి చేర్చాడు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్, పృథ్వీరాజ్ రెండు వికెట్ల చొప్పున తీయగా... నితీశ్ కుమార్ రెడ్డికి ఒక వికెట్ దక్కింది. ఆంధ్రకు 151 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినా రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 93 పరుగులకే కుప్పకూలడం... రెండో ఇన్నింగ్స్‌లో మధ్యప్రదేశ్ బ్యాటర్లను కట్టడి చేయడంలో బౌలర్లు విఫలంకావడంతో మరోసారి క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయింది.



ఆంధ్ర జట్టు

కోల్‌కతాలో జార్ఖండ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో బెంగాల్ తొమ్మిది వికెట్ల తేడాతో... బెంగళూరులో ఉత్తరాఖండ్‌తో జరిగిన మరో క్వార్టర్ ఫైనల్లో కర్ణాటక ఇన్నింగ్స్ 281 పరుగుల ఆధిక్యంతో కర్ణాటక గెలుపొంది సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. రాజ్‌కోట్‌లో సౌరాష్ట్రతో జరుగుతున్న మరో క్వార్టర్ ఫైనల్లో పంజాబ్ 252 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 52 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. పంజాబ్ విజయం సాధించాలంటే చివరిరోజు ఆ జట్టు మరో 200 పరుగులు సాధించాలి.

క్రికెట్‌కు జోగీందర్ శర్మ 'గుడ్‌బై'

న్యూఢిల్లీ: అతను వేసిన చివరి బంతి భారత క్రికెట్ రాతను మార్చింది... అతను తీసిన ఆ వికెట్ టి20 క్రికెట్‌లో కొత్త విప్లవాన్ని తెచ్చింది... ఆ ఒక్క ప్రదర్శనతోనే అతను చరిత్రలో తన పేరును ఘనంగా లిఖించుకున్నాడు. 2007 టి20 వరల్డ్ కప్ హీరో, టీమిండియా టైటిల్ అందుకోవడంలో కీలక పాత్ర పోషించిన పేసర్ జోగీందర్ శర్మ ఇప్పుడు ఆట నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. 2017 విజయ్ హజారే ట్రోఫీలోనే హరియాణా తరఫున తన చివరి మ్యాచ్ ఆడినా... 39 ఏళ్ల జోగీందర్ ఇన్నేళ్ల తర్వాత అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. పాకిస్తాన్‌తో జరిగిన 2007 టి20 వరల్డ్ కప్ ఫైనల్లో ఆఖరి ఓవర్ వేసిన జోగీందర్... శ్రీశాంత్ పట్టిన క్యాచ్ ద్వారా మిస్బావుల్ హక్‌ను అవుట్ చేయడంతోనే ట్రోఫీ భారత్ చేతుల్లో చేరింది. ఆ క్షణం అతని కెరీర్‌ను చిరస్మరణీయం చేసింది. అయితే దురదృష్టవశాత్తూ ఆ మ్యాచ్ తర్వాత జోగీందర్‌కు భారత్ తరఫున ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా రాలేదు! ఫలితంగా వరల్డ్ కప్ విజయాన్నే తన ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్‌గా మార్చుకున్న ఏకైక భారత క్రికెటర్‌గా అతను నిలిచాడు. అయితే ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున జోగీందర్ నాలుగు సీజన్లు ఆడాడు. టి20 వరల్డ్ కప్‌కు ముందే 4 వన్డేలు ఆడిన అతను ఒకటే వికెట్ పడగొట్టాడు. దేశవాళీలో 77 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 297 వికెట్లు తీసిన జోగీందర్ శర్మ గత సెప్టెంబర్‌లో లెజెండ్స్ లీగ్‌లో కూడా పాల్గొన్నాడు. ప్రస్తుతం అతను హరియాణా రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా పని చేస్తున్నాడు.



పాశ్చాత్య సంగీతపు పెనుతుఫానుకు
రెపరెపలాడిన శాస్త్రీయ సంగీతానికి
అరచేతులు అడ్డుపెట్టిన ఆ మహా దర్శకుడు
తరలి వెళ్లిపోయాడు.
మావి చిగురు తినగానే పలికే కోయిలను
కోయిల గొంతు వినగానే తొడిగే మావిచిగురును
చూపిన కళాహృదయుడు తన శకాన్ని ముగించాడు.
తెలుగు ముగ్గు తెలుగు సిగ్గు
తెలుగు కట్టు తెలుగు బొట్టు తెలిసిన
తెలుగింటి వనితలు అతను లేక మరి తెరపైకి రారు.
ఒక కీర్తన, తిల్లాన, జావళి, జానపదం
గుండె ఝల్లుమనేలా గజ్జె ఘల్లుమనిపించడం
మళ్లీ చూడగలమా అతడు చూపినట్టుగా!
ఆకలేసినవాడు అమ్మా అని ఎలా అంటాడో
దెబ్బ తగిలినవాడు అమ్మా అని ఎలా అంటాడో
తెలియడం చేతనే భావాల లోతును మనసుకు తాకించాడు.
నరుడి బతుకు నటనే కావచ్చు.
కాని అతణ్ణి తీసుకెళ్లిపోవాలనే ఈశ్వరుడి ఘటన మాత్రం
రస హృదయుడైన తెలుగు ప్రేక్షకుడికి బాధాకరం. క్లేశమయం.



సినిమాకు ఆభరణం

శ్రుతి లయలే జననీ జనకులు కాగా

■ టికెట్లకూ సంతకానికీ లింకు

మద్రాసులో ఒక గవర్నమెంట్ ఆఫీసు.

ఎవరిదో ఫైల్‌ను ఎవరో ఆఫీసరు సంతకం పెట్టాలి. ఎంతకీ పెట్టడు.

'ఎంత కావాలో చెప్పమనండీ' అన్నాడు బాధితుడు.

ప్యూన్ పక్కకు తీసుకెళ్లి చెప్పాడు 'ఆయన డబ్బు తీసుకోడు. స్ట్రిక్టు. శంకరాభరణం టికెట్లు సంపాదించి ఇవ్వగలిగితే ఇవ్వు. పనైపోతుంది'

అప్పటికి నాలుగు వారాలుగా శంకరాభరణం మద్రాసులో తండోపతండాల జనంతో కిటకిటలాడుతోంది.

ఆ టికెట్లు దొరికేవి కావు. ఆ ఫైల్ సంతకం జరిగేదీ లేదు.

■ చంద్రమోహన్‌కు ఆ ప్రాప్తం లేదు

ప్రాప్తం కూడా ఒక మంచిమాటే.

శంకరాభరణంలో నటించినందుకు నిర్మాత ఏడిద నాగేశ్వర రావు నటుడు చంద్రమోహన్‌కు 50 వేలు రెమ్యూనరేషన్ ఇవ్వాలి. సినిమా బిజినెస్ అయితే ఇస్తాడు. బిజినెస్ కాదు. షోల మీద షోలు పడుతున్నాయి. డిస్ట్రిబ్యూటర్లు చూస్తున్నారు. బాగుంది అంటున్నారు. ఎవరూ కొనడం లేదు. ఈ సినిమా రిలీజైతే తప్ప గడ్డం తీయను అని కె.విశ్వనాథ్ గడ్డం పెంచుతున్నాడు. గడ్డం పెరుగుతున్నది తప్ప సినిమా రిలీజ్ కావడం లేదు. ఈలోపు ఏడిదకు ఒక ఆలోచన వచ్చింది. చంద్రమోహన్‌ను పిలిచి 'నీ రెమ్యూనరేషన్ బదులు తమిళనాడు రైట్స్ ఇస్తాను తీసుకో' అన్నాడు. చంద్రమోహన్ అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. 'రిలీజ్ కాని సినిమా నాకు అంటగడతావా. నా డబ్బు నాకు ఇవ్వు' అన్నాడు. కొన్ని రోజులకు తమిళ నటి మనోరమ, తమిళనటుడు సౌందరరాజన్‌తో శంకరాభరణం ప్రివ్యూ చూసింది. సినిమా అయ్యాక ఉద్వేగంతో విశ్వనాథ్ కాళ్ల మీద పడబోయింది. 'ఈ సినిమా ఒక్కరు చూడకపోయినా పర్వాలేదు. నేను కొంటాను' అంది.

కొన్నది. చంద్రమోహన్‌కు ప్రాప్తం లేదు.


■ తపస్సు అలా మొదలైంది

1955లో సత్యజిత్ రే 'పథేర్ పాంచాలి' తీశాడు. భారతదేశంలో పార్లల్ సినిమాకు అంకురార్పణ చేశాడు. సత్యజిత్ రేకు గొప్ప పేరు, ఖ్యాతి దక్కాయి. కాని అది బెంగాలి వాళ్లకు చెల్లింది. హిందీలో కాని, సౌత్‌లో కాని సినిమా వ్యాపార కళ. వ్యాపారం ఎక్కువ, కళ తక్కువ అనుకునే సినిమాలు తీశారు. వినోదం చూపి డబ్బు సంపాదించడమే లక్ష్యం. ఆలోచన, అనుభూతి కృత్రిమ స్థాయి వరకే అంగీకారం. వాస్తవిక వాదంతో సినిమాలు తీసి చేతులు కాల్చుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు. అందువల్ల సత్యజిత్ రే వేసిన అడుగు పదేళ్ల పాటు బెంగాల్ దాటలేదు. కాని 1973లో ఎం.ఎస్.సత్యు తీసిన 'గరం హవా' వచ్చింది. అభిరుచి ఉన్న ప్రేక్షకులు ఆ సినిమాకు జేజేలు పలికారు. శ్యాం బెనగళ్ ఆ మరుసటి సంవత్సరమే 'అంకుర్' తీశాడు. ఇంకోవైపు తమిళంలో కె.బాలచందర్, తెలుగులో దాసరి నారాయణరావు మిడిల్ క్లాస్ డ్రామాను గట్టిగా పట్టుకున్నారు. 1976లో బాలచందర్ 'అంతులేని కథ' వచ్చింది. అదే సంవత్సరం దాసరి 'ఓ మనిషి తిరిగి చూడు' లాంటి ప్రయోగాత్మక సినిమా తీశారు. అంత వరకు 'శారద', 'జీవన జ్యోతి' వంటి స్త్రీ కథాంశాలపై దృష్టి పెట్టిన కె.విశ్వనాథ్ అంతకు కాస్త అటు ఇటుగా దారి వెతుక్కునే క్రమంలో పడ్డారు. అదే సమయంలో దేశ సంస్కృతిలో వస్తున్న మార్పును చూసి మొత్తుకునే దర్శకులు కూడా వచ్చారు. 1971 లో దేవ్ ఆనంద్ హిప్పీల వేలంవెర్రిని 'హరే రామా హరే కృష్ణ'గా తీశాడు. తెలుగునాట చూస్తే వర్తమానంలో సాంస్కృతిక అకాడెమీలు నామ్ కే వాస్తేగా మారాయి. తెలుగువాడైన మంగళంపల్లి బాలమురళీకృష్ణ మద్రాసులో అస్తిత్వం పొందాల్సి వచ్చింది. వీటన్నింటి ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం కె.విశ్వనాథ్ మీద ఉంది. 1976 నాటికి తీసిన 'సిరి సిరి మువ్వ' ఆయనకు దారి చూపింది. 1980లో తీసిన 'శంకరాభరణం' ఏ పునాది మీద తాను సినిమా తీయాలో, ఏ సంస్కృతి పట్ల తనకు అనురక్తి ఉందో, ఏ ప్రాభవాల కోసం తన గుండె కొట్టుకులాడుతుందో ఆయన తెలుసుకున్నారు.

ఇంతవరకూ చేసింది సినిమా రూపకల్పన.

ఇక మీదట చేయాల్సింది తపస్సు.

బాలూ అలిగితే నటుడయ్యాడు



కె.విశ్వనాథ్ ప్రాథమికంగా నటుడు. కాని దాసరి లాగా విశ్వనాథ్ తన సినిమాల్లో పాత్రలు చేయలేదు. బాలూ వల్ల చేయాల్సి వచ్చింది. 'శుభ సంకల్పం' సినిమాకు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం నిర్మాత. గొల్లపూడి, విశ్వనాథ్ కలిసి స్క్రిప్ట్ తయారు చేశారు. కమల హాసన్ హీరో. హీరోయిన్‌గా ఆమని. స్క్రిప్ట్ రాసేటప్పుడే ఫలానా పాత్రకు ఫలానా అని రఫ్‌గా భావిస్తూ రాసుకున్నారు– ఒక్క రాయుడు పాత్రకు తప్ప. అది సినిమాలో కమలహాసన్‌కు యజమాని పాత్ర. సరే... స్క్రిప్ట్‌ను బాలూకు చదివి వినిపించే రోజు వచ్చింది. విశ్వనాథ్ స్వయంగా చదివి వినిపిస్తూ ఒక సన్నివేశంలో రాయుడు ఎలా ఆవేదన చెందుతాడో గాద్గదికంగా చదివి వినిపించారు. బాలూకు ఆ పాత్రలో విశ్వనాథే కనిపించారు. గొల్లపూడికి చెప్తే ఆయన కూడా వత్తాసు పలికాడు. అదే ప్రస్తావన విశ్వనాథ్ దగ్గర తెస్తే 'నేనేమిటి... నటించడం ఏమిటి' అని తిరస్కరించారు. నటించాల్సిందే అని బాలు పట్టుపట్టాడు. నటించను అని విశ్వనాథ్ గట్టిగా చెప్పేశారు. బాలు అలిగి స్క్రిప్ట్ ఫైల్ విసిరి కొట్టి అలా అయితే సినిమానే చేయను అని వెళ్లిపోయాడు. చివరకు విశ్వనాథ్ బాలు కోరికను మన్నించారు. 'శుభ సంకల్పం' విడుదల తర్వాత హఠాత్తుగా తెలుగు వెండితెరకు మరో కేరెక్టర్ ఆర్టిస్టు దొరికినట్టయ్యింది.

■ ఆ ముగ్గుర్ని నమ్ముకునే...

'శంకరాభరణం' ముహూర్తం రోజున కె.వి.మహదేవన్, పుహళేంది, వేటూరి సుందర రామమూర్తిలను పిలిచి కొత్త బట్టలు పెట్టి 'మిమ్మల్ని నమ్ముకునే ఈ సినిమా తీస్తున్నాను' అన్నాడు విశ్వనాథ్. నిజమే. అంతకు మించి నమ్ముకోవడానికి సినిమాలో హీరో లేడు. హీరోయినూ లేదు. శంకరశాస్త్రి పాత్రను వేస్తున్నది నాటకాలు వేసుకునే గవర్నమెంట్ ఆఫీసరు జె.వి.సోమయాజులు. తులసి పాత్రను వేస్తున్నది వేంప్‌గా ముద్రపడిన మంజుభార్గవి. చంద్రమోహన్‌ది సపోర్టింగ్ రోల్. ఎవరిని చూసి ఈ సినిమా కొనాలి? ఎవరిని చూసి ఈ సినిమా ఆడాలి? పై ముగ్గురినే. కె.వి.మహదేవన్, పుహళేంది, వేటూరి సుందరరామమూర్తి... వీరు విశ్వనాథ్ అంచనాని వమ్ము చేయలేదు. 'అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి గానమే సోపానము' అని వేటూరి రాస్తే రిక్షా లాగే కార్మికుడు కూడా శాస్త్రీయ సంగీతం ఆస్వాదించేలా కె.వి.మహదేవన్, పుహళేంది పాటలు చేశారు. శాస్త్రీయ సంగీతం పాడాలంటే శాస్త్రీయ సంగీతం తెలిసిన ఏ మంగళంపల్లో కావాలి. కాని స..ప..స..లు నేర్వలేదని చెప్పుకునే బాలసుబ్రహ్మణ్యంతో పాడించారు. భారతీయ కళలు మరపున పడవచ్చు, మసి బారవచ్చు కాని వాటి తేజస్సు జాజ్వల్యమైనది... వాటి ఆధారంగా ఏర్పడిన పరంపరలు, వ్యక్తిత్వాలు, అహంభావాలు ఎవరికీ తల వంచనివి.. ఎవరు ఏం చేసినా అవి ఒక తరం నుంచి మరో తరానికి ఏదో ఒక మూల కొనసాగుతూనే ఉంటాయి... అని 'శంకరాభరణం'లో కె.విశ్వనాథ్ చెప్పారు. మరి జనం చూస్తారా?

■ మొదట ఖాళీ... ఆ తర్వాత కిటకిట

1980 ఫిబ్రవరి 2.

అతి కష్టమ్మీద అతి కొద్ది థియేటర్లలో 'శంకరాభరణం' రిలీజ్ అయ్యింది. నేల, బెంచి, కుర్చీ... ఖాళీ. ఒక దిక్కూ మొక్కూ లేని అమ్మాయి కోసం ఒక మహా విద్వాంసుడు నిలబడ్డాడు. అయినవారు అతణ్ణి వెలి వేశారు. ఈ కథేదో కొత్తగా ఉందే అనుకున్నారు కొందరు. కాలగమనంలో చితికిపోయిన ఒక గొప్ప కళాకారుడు తన అభిజాత్యం కోల్పోకుండా పోరాడుతున్నాడే... ఇదీ బాగుందనుకున్నారు మరి కొందరు. 'మెరిసే మెరుపులు ఉరిమే ఉరుములు సిరిసిరి మువ్వలు కాబోలు' శివుని ఎదుట నర్తిస్తున్న ఈ నిష్కళంకుడు ఇంతకు ముందు ఏ కథలోనూ కనిపించలేదే. మొదట కుర్చీ నిండింది. తర్వాత బెంచీ నిండింది. తర్వాత నేల కిటకిటలాడింది. ఆ తర్వాతదంతా చరిత్ర.

'ఎంటర్ ది డ్రాగన్' వచ్చి దేశంలో కరాటే స్కూల్స్ తెరిచింది.

'శంకరాభరణం' వచ్చి తెలుగునాట సంగీత పాఠాలను, నృత్యపాఠశాలలను పునరుద్ధరించింది.

■ దొరకునా ఇటువంటి సేవ!

'శంకరాభరణం'లో శంకరాభరణ రాగమే లేదు అని విమర్శించాడు మంగళంపల్లి. కె.విశ్వనాథ్ భావధార పట్ల ఇలాంటివే కొన్ని అభ్యంతరాలు కొందరికి ఉండవచ్చు. కాని సినిమాను ఒక కళగా, దృశ్య శ్రవణ మాధ్యమంగా, రసస్పందన కలిగించే స్థాయిలో తెలుగు ప్రేక్షకులకు చూపినవాడు కె.విశ్వనాథ్. సినిమాను తపస్సుగా భావించాడు. నిర్వాణ సోపానంగా కూడా.

నీ పద రాజీవముల చేరు
నిర్వాణ సోపానమధిరోహణము చేయు త్రోవ
దొరకునా ఇటువంటి సేవ



సతీమణి జయలక్ష్మితో విశ్వనాథ్



చిరంజీవితో కె.విశ్వనాథ్ కుటుంబ సభ్యులు

శుభలేఖ

పందొమ్మిదేళ్లకే విశ్వనాథ్‌కి పెళ్లయింది. రెండు పెళ్లి చూపులకు వెళ్లారు. ఒకటి ఆయన మేనమామ తెచ్చిన పెళ్లి సంబంధం. అప్పటికే చెన్నైలో ఉంటున్న విశ్వనాథ్ ఆ సంబంధం కోసం తెనాలి వెళ్లారు. కానీ కుదర్లేదు. ఆ తర్వాత రెండో పెళ్లి సంబంధం కోసం చెన్నై వెళ్లి, అక్కడ జయలక్ష్మిని చూశారాయన. ఆ సంబంధం ఖాయం అయింది. అప్పటికి జయలక్ష్మికి 14 సంవత్సరాలు. చిన్న వయసులో అత్తింట్లో అడుగుపెట్టిన జయలక్ష్మి ఇంటి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారు. ఇద్దరు ఆడపడుచులు, అత్తమామలు, వచ్చేపోయే బంధువులతో జయలక్ష్మికి క్షణం తీరిక ఉండేది కాదు. పైగా విశ్వనాథ్ చేసినవి ఎక్కువగా రిస్కీ ప్రాజెక్ట్స్ కాబట్టి నిర్మాతల దగ్గర పారితోషికం ఇంత కావాలని డిమాండ్ చేయలేకపోయారు. పెద్ద స్థాయిలో పారితోషికం కూడా వచ్చేది కాదు. దీంతో దర్శకుడిగా మారిన పదేళ్ల తర్వాతే కారు కొనగలిగారు. అలాగే ఫలానా నగ బాగుందని భర్తతో జస్ట్ అనేవారు కానీ ఏనాడూ నాకిది కావాలని జయలక్ష్మి అడిగింది లేదు. 'ప్రతి మగాడి విజయం వెనక ఓ స్త్రీ ఉంటుందంటుటారు. నా విజయం వెనక నా భార్య జయలక్ష్మి ఉంది. సినిమా పనులతో నేను బిజీగా ఉన్నప్పటికీ కుటుంబ బాధ్యతలను తనే చూసుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే నా తరఫు బంధువులందరూ నాకన్నా ఎక్కువగా తననే అభిమానిస్తుంటారు. అంత ఆప్యాయంగా జయలక్ష్మి వారిని చూసుకుంటుంది' అని భార్య గొప్పతనం గురించి పలు సందర్భాల్లో చెప్పారు విశ్వనాథ్. భర్తని అర్థం చేసుకున్న జయలక్ష్మి, భార్యని అర్థం చేసుకున్న భర్తగా ఈ దంపతుల వైవాహిక జీవితం ఆనందంగా సాగింది.

కె. విశ్వనాథ్ తెరకెక్కించిన చిత్రాల్లో కొన్ని టైటిల్స్‌తో ఆయన వ్యక్తిగత జీవిత విశేషాలు ఈ విధంగా...

శంకరాభరణం



శంకరుడు అంటే శివుడు అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. విశ్వనాథ్ సినిమాల్లో దాదాపు శివుడి మీద ఏదో ఒక పాట ఉంటుంది. మరి.. విశ్వనాథుడు శివభక్తుడా? అంటే... ఆయనకు దైవభక్తి ఎక్కువే. ఏదో ఒక పవర్ ఉంటుందనే నమ్మకం ఆయనది. విశ్వనాథ్ సినిమాల్లోకి వచ్చాక శివుడి పాట ఉండటం అనేది యాదృచ్ఛికంగా జరిగినదే. అనుకోకుండా ఆ సినిమాలో శివుడికి సంబంధించిన పదమో, సందర్భమో రావడం అనేది భగవదేచ్ఛ అని, కావాలని ప్రయత్నించినది కాదని విశ్వనాథ్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. అంతెందుకు 'ఉండమ్మా బొట్టుపెడతా' సినిమాలో మొట్టమొదటి పాటను 'శ్రీ'తో మొదలుపెట్టమని దేవులపల్లి కృష్ణశాస్త్రిని విశ్వనాథ్ అడిగారు. దేవులపల్లి ఏమో 'శ్రీశైలం మల్లన్న, శిరసాంచెనా, చేనంతాగంగమ్మ వాన' అని రాశారు. విశ్వనాథ్ 'శ్రీ'తో రాయమని అడిగారే తప్ప శివుడి మీద రాయమని అడగలేదు. అయినా శివుడి మీద పాట వచ్చేసింది. ఇక చిన్నప్పుడు శివాలయానికి వెళ్లేవారు విశ్వనాథ్. ఆ సమయంలో ఒక వ్యక్తి మాస్క్ వేసుకుని జడిపిస్తే, మూడు రోజులు జ్వరంతో పడుకున్నారు. అలా తెలిసీ తెలియని వయసు నుంచీ సినిమాల్లోకి వచ్చాక, ఆ తర్వాత కూడా విశ్వనాథ్ జీవితంలో శివుడు ఉన్నాడని అర్థమవుతోంది.

అమ్మ మనసు

తల్లిదండ్రులను మించిన దైవం లేదంటారు. విశ్వనాథ్‌ది కూడా సేమ్ ఫీలింగ్. ఇష్ట దైవం ఎవరంటే తన తల్లిదండ్రుల గురించి చెప్పేవారు. అమ్మానాన్నలు చేసిన పుణ్యం, పూజలే ఫలించాయని, కాపాడాయన్నది విశ్వనాథ్ నమ్మకం. కళాతపస్వి తండ్రి కాశీనాథుని సుబ్రహ్మణ్యంకు జ్యోతిష్యం బాగా వచ్చు. అయితే కొడుకు తీసిన ఏ సినిమాకీ ముహూర్తం పెట్టలేదాయన. సినిమా అనేది ఊహకందని వ్యాపారం కాబట్టి తానో ముహూర్తం పెట్టించి, సినిమా ఆడకపోతే 'ఆయన అనవసరంగా చెప్పారు' అంటారనే మాట అనిపించుకోవడం ఇష్టంలేక కొడుకు సినిమాలకు ముహూర్తం పెట్టలేదు. స్వతహాగా మితభాషి అయిన సుబ్రహ్మణ్యం తనయుడి విజయాలకు లోలోపల ఆనందించేవారు. తన పుస్తకాల్లో 'శంకరాభరణం ఈరోజున ఈ నక్షత్రం, ఈ ఘడియల్లో రష్ చూశాను. దీనికి ఈ యోగం ఉంది' అని రాసుకున్నారు. ఇలా తనయుడి సినిమాల గురించి రాసుకున్నారు. ఇక విశ్వనాథ్ తల్లి సరస్వతి అయితే తనయుడి విజయాలను ఆస్వాదించేవారు. సాధారణంగా కోడలు ఇంటికొచ్చాక ఇంటి పరిస్థితి కాస్త మారుతుంది. అయితే కొడుకు మనసు ఎరిగిన తల్లిగా సరస్వతి కోడలిని బాగా చూసుకున్నారు.

చెల్లెలి కాపురం

విశ్వనాథ్‌కి ఇద్దరు చెల్లెళ్లు. పెళ్లయి, చెన్నై వడపళనికి మకాం మార్చినప్పుడు తన తల్లిదండ్రులతో పాటు చెల్లెళ్లను కూడా తీసుకెళ్లారు విశ్వనాథ్. ఆ చెల్లెళ్లు తమకు పెళ్లయ్యేంత వరకూ అన్నా వదిన దగ్గరే ఉన్నారు. తోడబుట్టినవాళ్లను అత్తగారింటికి పంపించాక కూడా వారి బాగోగులను చూసుకున్నారు. వాళ్ల శ్రీమంతాలు, కాన్పులు కూడా చెన్నైలోనే. సోదరుడు తండ్రితో సమానం అంటారు. విశ్వనాథ్ తన చెల్లెళ్లకు ఒక తండ్రిలానే ఉన్నారు. అయితే ఆయన సతీమణి జయలక్ష్మి సహకారం లేకపోతే ఇది సాధ్యం అయ్యేది కాదు. విశ్వనాథ్ తన సినిమాలతో తీరిక లేకుండా ఉంటే.. ఆడపడుచులను చూసుకున్నారు జయలక్ష్మి. అలాగే చెల్లెళ్లనే కాదు.. తన మేనల్లుళ్లు, మేనకోడళ్లను కూడా బాగా చూసుకున్నారు విశ్వనాథ్. చివరికి వాళ్ల పిల్లలు కూడా వీళ్ల ఇంట్లోనే ఉండి, చదువుకోవడం విశేషం.

స్వాతిముత్యం

'స్వాతిముత్యం'లో శివయ్య (కమల్‌హాసన్ పాత్ర పేరు) అమాయకుడు. చిన్నపిల్లల మనస్తత్వం ఉన్నవాడు. మరి.. చిన్నప్పుడు విశ్వనాథ్ ఎలా ఉండేవారు అంటే.. మహా అల్లరి. విజయవాడలో చదువుతుండగా కాలువ దాటి స్కూల్‌కి వెళ్లాల్సి వచ్చేది. వీళ్ల ఇంటి ఎదురుగానే కాలువ ఉండేది. వేసవికాలం వచ్చేటప్పుడు కొంచెం నీళ్లే ఉండటంతో బ్రిడ్జి మీద నుంచి కాకుండా ఫ్రెండ్స్‌తో కలిసి, కాలువలోంచే నడుచుకుంటూ వెళ్లేవారు. అయితే ఇంట్లోవాళ్లకి చెబితే తిడతారని భయం. నిక్కర్లు పైకి మడుచుకుని కాలువలో దిగిన విశ్వనాథ్‌ని చూసిన ఆయన మేనమామ కూతురు ఇంట్లో విషయం చెప్పేసింది. అంతే.. విశ్వనాథ్ తండ్రి అక్కడికి వెళ్లి 'రేయ్' అని అరిచారు. ఆ భయానికి విశ్వనాథ్ చేసిన పనులన్నీ నీళ్లలోనే కలిసిపోయాయి (ఓ సందర్భంలో విశ్వనాథ్ నవ్వుతూ చెప్పిన విషయం). అంతే.. పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్లిన కొడుకుని 'రాస్కెల్' అని, బట్టలు మార్చుకోమన్నారు విశ్వనాథ్ తండ్రి. ఇక ఆ తర్వాత ఆ కాలువ వైపు వెళ్లలేదు. అలాగే చిన్నప్పుడు తండ్రి మూడు చక్రాల సైకిలు కొనిపెడితే, దాన్నే మెర్సిడెస్ బెంజ్‌గా ఫీలయి, టింగుటింగుమంటూ బెల్లుకొట్టుకుంటూ వెళ్లేవారు విశ్వనాథ్.

స్వయంకృషి



కె. విశ్వనాథ్‌ను ఇంజినీర్ చేయాలనుకున్నారు ఆయన తల్లిదండ్రులు. ఆయనకు మాత్రం సంగీతం పై మక్కువ ఎక్కువ. బీఎస్సీ పూర్తి చేశాక తండ్రి అనుమతితో చెన్నై వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్‌గా చేరారు. ఇప్పటిలా అప్పట్లో ఎక్కువగా డబ్బింగ్ స్టూడియోలు ఉండేవి కావు. దీంతో లొకేషన్‌లోనే ఆర్టిస్టుల మాటలను రికార్డ్ చేయవలసి వచ్చేది. సంభాషణలు సరిగ్గా పలకడం తెలియని నటీనటులకు దగ్గరుండి డైలాగులు నేర్పించారు విశ్వనాథ్. 'సౌండ్ రికార్డిస్ట్'గా నిజాయతీగా చేసిన పని ఆయన్ను సెకండ్ యూనిట్ డైరెక్టర్‌గా ఎదిగేలా చేసింది. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు దగ్గర దర్శకత్వ శాఖలో చేసినప్పుడు విశ్వనాథ్ పని తీరు చాలామంది దృష్టిలో పడింది. అలా అక్కినేని నాగేశ్వర రావు 'ఆత్మగౌరవం'తో దర్శకుణ్ణి చేశారు. అప్పట్నుంచి చివరి సినిమా 'శుభప్రదం' వరకూ రాత్రీ పగలూ తేడా లేకుండా పని చేసిన రోజులే ఎక్కువ. ఆయన స్వయంకృషియే విశ్వనాథ్‌ని తెలుగు పరిశ్రమ శిఖరాగ్రాన నిలిచేలా చేసింది.

శుభప్రదం

దాదాపు 75 సంవత్సరాలు సినిమాలే లోకంగా జీవించారు విశ్వనాథ్. ఇక కుటుంబానికి సమయం కేటాయించాలని దర్శకుడిగా సినిమాలకు దూరంగా ఉండటం మొదలుపెట్టారు. అప్పుడప్పుడూ నటుడిగా మాత్రం చేశారు. సినిమాలు తగ్గించాక ఆయన లైఫ్‌స్టయిల్ ఎలా సాగిందంటే.. ఉదయాన్నే నిద్ర లేవడం.. అల్పాహారం, భార్యతో కబుర్లు చెప్పుకోవడం, గడిచిన జీవితంలోని మధుర జ్ఞాపకాలను ఓసారి స్ఫురణకు తెచ్చుకుని హ్యాపీగా ఫీలవ్వడం... ఇలానే విశ్వనాథ్ దినచర్య సాగుతుండేది. టీవీల్లో వచ్చే వంటల కార్యక్రమాలను చూసేందుకు ఇష్టపడేవారు విశ్వనాథ్. జయలక్ష్మికి ఏమో ప్రవచనాలు వినడం ఇష్టం. ఉదయం పదకొండు గంటల వరకూ ఆవిడ ఆ కార్యక్రమాలు చూసేవారు. ఆ తర్వాత రిమోట్ విశ్వనాథ్ చేతికి దక్కేది. ఇక అప్పుడు ఆయన వంటల ప్రోగ్రామ్స్ చూసేవారు. ఇలా కాలక్షేపం చేశారు. విశ్వనాథ్, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడికి ఇద్దరు అబ్బాయిలు కాగా, చిన్న కుమారుడికి ఇద్దరు అమ్మాయిలు. ఆయన అల్లుడు, కుమార్తె చెన్నైలో ఉంటారు. వీరికి ఓ పాప. మనవళ్లు, మనవరాళ్లతో హాయిగా గడిపారు విశ్వనాథ్. వయోభారం కారణంగా చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు మినహా ఆయన పెద్దగా ఇబ్బంది పడిందిలేదు. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన చివరి చిత్రం 'శుభప్రదం'. ఆయన వృత్తి జీవితం, వ్యక్తిగత జీవితం కూడా సంపూర్ణం.. శుభప్రదమే. ప్రశాంతంగా వెళ్లిపోయారు కళాతపస్వి.



మీ ఫ్యామిలీ బడ్జెట్ వేశారా?

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి వచ్చే సరికి ప్రభుత్వాలు బడ్జెట్ పై కసరత్తు చేస్తుంటాయి. అది పెద్దస్థాయి కదా మనకెందుకులే అని వదిలేయద్దు. ఎందుకంటే, ఖర్చు ఎక్కడ పెట్టాలి..? ఎక్కడ తగ్గించుకోవాలి..? ఎంత మొత్తం పొదుపు చేయాలి..? వీటన్నింటికంటే ముందు ఆదాయం ఎంత? అన్న అంశాలపై అవగాహన ప్రతి కుటుంబానికీ కూడా ఉండాలి. అదే బడ్జెట్ ప్లానింగ్. మొన్న కేంద్ర బడ్జెట్ విడుదలైంది. ఇప్పుడు మన ఫ్యామిలీ బడ్జెట్ వంతు వచ్చింది. ఏమంటారు?

నెలవారీ జీతాలతో లేదా స్వయం ఉపాధితో జీవనం సాగించే వారికి నెలవారీ బడ్జెట్ ప్లానింగ్ అత్యవసరం. మనకు వచ్చేదెంత? అందులో మనం దేనికి, ఎంత ఖర్చుపెట్టాలి..? ఎక్కడ ఆదా చేయాలి..? అన్న అంశాలపై అవగాహన ఉంటే ఇంటి నిర్వహణ సులువు అవుతుంది. బడ్జెట్ ప్లానింగ్ ఉంటే మీ నెలవారీ ఖర్చులను సులభంగా నిర్వహించుకోవచ్చు.

అత్యవసర పరిస్థితి కోసం కొంత మొత్తం

జీవితంలో పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటాయో తెలియదు. అందుకే కొంత మొత్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవడానికి వీలుగా.. మీ చేతికి వస్తున్న సంపాదనలో 20 నుంచి 30 శాతం వరకూ పొదుపు చేయడం మంచిది. ఒకవేళ ఇంత మొత్తంలో చేయలేకపోయినా.. అవకాశం ఉన్న మేరకు పక్కన పెట్టాలని పెద్దల సలహా.

కుటుంబ సభ్యుల ఆమోదం:

ఫలానా దానికి ఇంత మొత్తం ఖర్చు పెట్టాలి అని మీరు ఒక గట్టి నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి ఇంట్లోని ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి. అలా ఉండాలంటే ముందుగా మీరు చేయాల్సింది... నెలవారీ బడ్జెట్ ప్లానింగ్ కోసం కుటుంబ సభ్యులందరినీ కూర్చోబెట్టి వివరించాలి. రాబడి, ఖర్చుల విషయాలను అందరితో చర్చించాలి. అప్పుడు వారికి కూడా అవగాహన ఏర్పడి, ఖర్చులు తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

వృథాను అరికట్టాలి

మనం పొదుపు చేయాలి అంటే కుటుంబంలో అనవసర ఖర్చులను తగ్గించుకోవాలి. ఏది అవసరం, ఏది అనవసరం అనే అవగాహన ఉండాలి. ముఖ్యంగా వృథా ఖర్చులను తగ్గించాలి. సరుకులు లేదా వస్తు సామగ్రిని ఎక్కువెక్కువ తెచ్చుకోవడం, ఇష్టం వచ్చినంత వండటం, పారెయ్యటం వల్ల ఎంతో డబ్బు వృథా అవుతుంది. అందువల్ల అట్లాంటి వృథాకు అడ్డుకట్ట వేయాలి.

క్రెడిట్ కార్డుతో జాగ్రత్త..

క్రెడిట్ కార్డు ఉన్నది అత్యవసర సమయంలో ఉపయోగపడటానికి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. చేతిలో కార్డు ఉంది కదా అని విచ్చలవిడిగా ఖర్చుపెట్టకూడదు. మీ నెలవారీ రాబడిని అంచనా వేసుకొని అప్పుడు మాత్రమే కార్డును వినియోగించాలి.

పొదుపు పథకాల్లో..

ఇలా ప్రతి నెలా బడ్జెట్ ప్లానింగ్ చేసుకొని ఆదా చేసిన సొమ్మును ఖతాలో అలా ఉంచకుండా.. మార్కెట్ రిస్క్ లేని పెట్టుబడి పథకాలు అంటే గోల్డ్, రియల్ ఎస్టేట్ వంటి వాటిల్లో పెట్టుబడులు పెట్టాలి. అప్పుడు దీర్ఘకాలంలో మంచి రాబడులు వచ్చే అవకాశం ఉంటుంది.



ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి..

మీ బడ్జెట్‌ను నెలవారీ రివ్యూ చేసుకోవాలి. ఏమైనా మార్పులు అవసరం అయితే కచ్చితంగా ఆయా మార్పులు చేసుకోవాలి. ఇందుకోసం మీ కుటుంబ సభ్యుల అభిప్రాయం తీసుకోవాలి. కచ్చితంగా పెట్టవలసిన ఖర్చును పక్కన పెట్టి.. ఇంకా ఏమైనా ఆదా చేసుకునే మార్గం ఉందేమో చూడాలి.

పొదుపు ఎంత ఉండాలి?

ఇది కాస్త క్లిష్టమైన ప్రశ్నే. పొదుపు చేయాలంటే ముందు మన ఆదాయాన్ని అంచనా వేసుకోవాలి. ఎందుకంటే, ఆదాయాన్ని బట్టి పొదుపు శాతం పెరుగుతూ, తరుగుతూ ఉంటుంది. అయితే, ఆదాయంతో సంబంధం లేకుండా, సాధారణ కుటుంబ ఖర్చులు మినహా మరే విధమైన అదనపు ఖర్చులూ లేకుండా ఉంటే పొదుపు ఎంత ఉండాలో చెప్పడానికి కొన్ని సూత్రాలు...

ప్రతి మనిషి కనీసం ఆరునెలల జీతం లేదా ఆదాయాన్ని నగదు రూపంలో దాచుకోవాలి. ఒకవేళ ఒకేసారి అలా దాచుకోలేని వారు నెలనెలా కొంత పక్కన పెడుతూ ఎమర్జెన్సీ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలి. కుటుంబ ఖర్చుకు సమానమైన ఆదాయం లేదా అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దిగువ మధ్యతరగతి వారు తమ ఆదాయంలో ఐదు నుంచి పది శాతం పొదుపు చేయాలి. పొదుపు చేయడానికి మిగలక పోయినా ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారానో, ఖర్చును తగ్గించుకోవడం ద్వారానో కచ్చితంగా పొదుపు చేయాలి. నెలవారీ సగటు కుటుంబ ఖర్చు కంటే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించేవాళ్లు నెలనెలా 25 శాతం పొదుపు చేయాలి. ఒకవేళ భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తుంటే భర్త ఇంటి ఖర్చులు పెడతారు కాబట్టి భార్య 50 శాతం పొదుపుచేయాలి. అధికాదాయ వర్గాలు అయితే కుటుంబ ఆదాయంలో సగం పొదుపునకు మళ్లించాలి. భవిష్యత్తులో ఆదాయం పొరపాటున తలకిందులైతే ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా ఇలా చేసిన పొదుపు ఆదుకుంటుంది.

పొదుపు మార్గాలు కొన్ని...

- అవసరం లేకుండా డిస్కౌంట్లలో వచ్చే వస్తువులు కొనద్దు.
- అవసరానికి ముందే ఏ వస్తువులనూ కొనుగోలు చేయకండి.
- నిర్దిష్ట తేదీల్లోపు బిల్లులు చెల్లించండి. దీని కోసం బిల్స్ పే క్యాలెండర్ తయారు చేసుకోవాలి.
- మీ బ్యాంకు ఖాతాలు ప్రతి నెల చివరన చూసుకోండి. వృథా ఖర్చులు తెలుస్తాయి. వృథా ఖర్చుల జాబితా రాయండి. ప్రతినెలా ఎంత వృథా పోతుందో తెలిస్తే ఆటోమేటిక్‌గా అప్రమత్తత పెరుగుతుంది.
- ఏ వస్తువు కొనాలన్నా ఇంటర్నెట్ ద్వారా వివిధ మాల్స్/దుకాణాల్లో వాటి ధరల తేడాలు చూసి ఎక్కడ తక్కువో అక్కడ కొనండి. ఎందుకంటే ప్రతి డీలరు వేర్వేరు ధరలపై వస్తువులను అమ్ముతారు.



చివరగా ఒక మాట... మీ బడ్జెట్ ఎంత పకడ్బందీగా ఉంటే భవిష్యత్తు అంత భద్రంగా ఉంటుందని గుర్తు పెట్టుకోండి. అదేవిధంగా మీ పిల్లలకు కూడా ఇప్పటినుంచే పొదుపు చేయడాన్ని అలవాటు చేయండి. వారికి ఇచ్చే పాకెట్ మనీతో వారికి కావలసిన వాటిని ఎలా కొనుక్కోవాలో నేర్పించండి. అప్పుడే మీరు పర్‌ఫెక్ట్ ఫైనాన్స్ మేనేజర్ లేదా నిపుణులైన హోమ్ మినిస్టర్ అవుతారు. ఇంతవరకు మీరు బడ్జెట్ వేసుకోకపోతే ఇప్పుడైనా వేయండి.

● ఒళ్లు నొప్పులు

పెయిన్ కిల్లర్స్ వద్దు.. ఇంటి చిట్కాలే ముద్దు



ఉరుకుల పరుగుల జీవితంలో మన జీవన శైలి సరిగ్గా లేకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, సమయపాలన పాటించకపోవడం వంటి అనేక కారణాలు మనల్ని అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురిచేస్తున్నాయి. అందులో ఒళ్ళు నొప్పులు ఒకటి. ఉదయం నుంచి పని చేసి సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి ఒళ్ళు నొప్పులు, కాళ్ల నొప్పులతో బాధపడే వాళ్లే ఎక్కువమంది ఉంటున్నారు. ఇక ఈ క్రమంలో ఒళ్ళు నొప్పులు, కాళ్ల నొప్పులకు పెయిన్ కిల్లర్స్ కాకుండా నేచురల్ రెమెడీస్ తో ఉపశమనం పొందడం ఎలాగో తెలుసుకుందాం.



ఒళ్ళు నొప్పులతో బాధపడే వాళ్ళు పసుపు, వేడి పాలు రాత్రి పడుకోబోయే ముందు ప్రతి రోజు తాగడం అలవాటు చేసుకుంటే ఉపశమనం దొరుకుతుందని పెద్దలు చెబుతున్నారు. పసుపు యాంటీబయాటిక్‌గా పనిచేస్తుంది. దీంతో ఒళ్ళు నొప్పులకు చెక్ పెట్టినట్టు అవుతుంది. అదేవిధంగా అంగుళం పొడవున్న అల్లం ముక్కను కడిగి, పొట్టు తీసి దంచాలి. దానిని నీళ్లలో వేసి మరిగించాలి. ఆ నీటిని వడకట్టి అందులో స్పూన్ తేనె కలుపుకుని తాగితే ఒళ్ళు నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుందని అనుభవజ్ఞుల సలహా.

గ్లాసు గోరువెచ్చని నీటిలో చెంచాడు ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి, రుచికి తగ్గట్టు తేనె కలిపిన తర్వాత తాగితే నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుందని వైద్యుల సలహా.

విపరీతంగా ఒళ్ళు నొప్పులు ఉన్నవాళ్ల బెల్లాన్ని తినడం వల్ల వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడి నొప్పులు కాస్త తగ్గుతాయి.



ఇక ఉప్పును వేడి చేసి ఓ వస్త్రంలో ఉంచి నొప్పి ఉన్నచోట కాపడం పెట్టినా నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

కప్పు ఆవనూనెలో నాలుగు లవంగాలు, వెల్లుల్లి వేసి మరిగించి, గోరువెచ్చగా అయాక నొప్పి ఉన్న ప్రదేశంలో ఆ నూనె రాసి మసాజ్ చేస్తే మంచి ఫలితం ఉంటుందని ఆయుర్వేదం చెబుతోంది.

పెయిన్ కిల్లర్స్ బదులు నాచురల్ రెమెడీస్ ఫాలో అయితే మంచిది. ఇతరత్రా అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని నిపుణులు, అనుభవజ్ఞులు చెబుతున్నారు.

● హెల్త్ టిప్స్

పొట్ట కొలెస్ట్రాల్, బెల్లీ ఫ్యాట్ సమస్యలతో బాధపడేవారు తప్పకుండా పెరుగును ఆహారంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇందులో ఉండే గుణాలు శరీరంలో ప్రోబయోటిక్స్ పరిమాణాలను తగ్గించి అనారోగ్య సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తుంది.

ముఖ్యంగా శరీర బరువు సమస్యలతో బాధపడే వారు తప్పకుండా డైట్‌లో పెరుగును చేర్చుకోవాల్సి ఉంటుంది. ఓట్ మీల్‌ను కూడా ప్రతి రోజూ ఆహారంలో తీసుకుంటే సులభంగా బరువు తగ్గొచ్చని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.

ఇలా ప్రతి రోజూ డైట్‌ను అనుసరించడం వల్ల సులభంగా పొట్ట చుట్టూ కొలెస్ట్రాల్ సులభంగా తగ్గుతుంది. అంతే కాకుండా అనారోగ్య సమస్యల నుంచి సులభంగా ఉపశమనం లభిస్తుంది.





● మీకు తెలుసా

60 ఏళ్ల పైబడినవారు రోజూ 6 వేల నుంచి 9 వేల అడుగులు నడిస్తే గుండెకు మంచిదని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ పరిశోధకులు అధ్యయనంలో వెల్లడైంది. పక్షవాతం ముప్పు 40–50% తగ్గుతుందని తేలింది. 42 దేశాల్లోని 18 ఏళ్ల పైబడిన 20,152 మంది డేటాను వారు విశ్లేషించారు. ఆరేళ్లపాటు వీరు నడుస్తున్న దూరం, వారిలో కార్డియోవాస్కులార్ డిసీజ్, స్ట్రోక్, హార్ట్ ఫెయిల్యూర్ వంటి అంశాలను పరిశీలించి ఈ నివేదికను బయటపెట్టారు. అయితే పెద్దవాళ్లు ఒకేసారి అన్నేసి వేల అడుగులు నడవడం కష్టం కదా అనుకోవద్దు. ఎందుకంటే సుమారు కిలోమీటరు నడిస్తే చాలు మీరు ఐదారువేల అడుగులు వేసినట్లే. ఎక్కువ దూరాలు నడవలేనివారు కనీసం పెరట్లో లేదా బాల్కనీలో లేదా డాబా మీద అయినా నాలుగు అడుగులు వేస్తూ ఉండాలి.

కిడ్నీల్లో స్టోన్స్ రావటానికి ఆహార అలవాట్లతో పాటు నీరు తక్కువగా తాగడం ప్రధాన కారణం. అయితే అలా కిడ్నీల్లో రాళ్లు ఉన్నప్పుడు నాన్ వెజ్ జోలికి అస్సలు వెళ్లొద్దు. ఎందుకంటే దీనిలో ఉండే ప్యూరిన్ వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరుగుతుంది. ఫలితంగా రాళ్ల పరిమాణం పెద్దగా అవుతుంది. అలాగే కాల్షియం అధికంగా ఉండే పాలకూర, టమాట తినవద్దు. పాల ఉత్పత్తులు, జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి.



సినిమా

కళాతపస్వి కె.విశ్వనాథ్‌కి ప్రముఖుల నివాళి

కె. విశ్వనాథ్ భౌతిక కాయాన్ని పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు. మరికొందరు సోషల్ మీడియా వేదికగా తమ సంతాపం తెలియజేశారు.



● వెంకయ్య నాయుడు, తలసాని శ్రీనివాస యాదవ్, కోట శ్రీనివాసరావు, చంద్రమోహన్, బ్రహ్మానందం, విశ్వనాథ్ పెద్ద కుమారుడు నాగేంద్రనాథ్, సురేష్‌బాబు, చిరంజీవి, ఏడిద రాజా, ఎల్వీ శ్రీరామ్, అల్లు అరవింద్, విశ్వనాథ్ అల్లుడు

కళాత్మక చిత్రాలకు చిరునామాగా నిలిచిన విశ్వనాథ్‌గారు రచయిత, దర్శకుడు, నటుడిగా బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శించారు. అత్యున్నత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, పద్మశ్రీ పురస్కారాలతోపాటు అనేక అవార్డులు సాధించిన ఆయన మృతి తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు.

- విశ్వభూషణ్ హరిచందన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్

❋❋❋

కళాతపస్వి కె. విశ్వనాథ్‌గారు పేరుకు తగ్గట్టే సినిమా కోసం తపస్సులాగా పని చేశారు. ఆయన తీసిన సినిమాలన్నీ భావితరాల వాళ్లు చూసి మన సంస్కృతి, సంప్రదాయాలు నేర్చుకునేలాగా ఉంటాయి. విశ్వనాథ్‌గారి దర్శకత్వంలో పని చేయక పోయినా, ఆయనతో కలిసి 'వజ్రం' సినిమాలో నటించాను.

- రోజా, ఆంధ్రప్రదేశ్ మంత్రి, నటి

❋❋❋

ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో చాలా ముఖ్యమైన, ప్రధాన స్థానంలో ఉన్న డైరెక్టర్ కె. విశ్వనాథ్‌గారు. అలాంటి ఆయన దేవుని పాదాల సన్నిధికి వెళ్లారని తెలిసి నాకు బాధ కలిగింది. **- ఇళయరాజా**

❋❋❋

స్వయానా మా పెదనాన్న కొడుకు ఆయన. మద్రాస్‌లో 25ఏళ్ల పాటు పక్కపక్కన ఇళ్లల్లో ఉన్నాం. నేను నటుడిగా ఎదగడానికి మైలురాయిగా నిలిచిన 'సిరి సిరి మువ్వ, సీతామాలక్ష్మి, శంకరాభరణం, శుభోదయం, ఓ సీత కథ' వంటి ఎన్నో సినిమాలు మా కాంబినేషన్‌లో చేసినందుకు గర్వంగా ఉంది. కజిన్స్ అయిన మా ముగ్గురిలో నేను నటుడిగా, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గాయకునిగా, విశ్వనాథ్‌గారు డైరెక్టర్‌గా 1966లో ఇండస్ట్రీకి పరిచయమయ్యాం. ఆయన లేని లోటు చిత్ర పరిశ్రమకు, మా కుటుంబానికి తీరనిది.

- చంద్రమోహన్

విశ్వనాథ్‌గారు జీవిత పరమార్థాన్ని, కళ సజీవమైనదని పూర్తిగా అర్థం చేసుకున్న గొప్ప వ్యక్తి. అందువల్లే జీవితకాలం దాటినా ఆయన కళకు గుర్తింపు ఉంటూనే ఉంటుంది. **- కమల్ హాసన్**

❋❋❋

విశ్వనాథ్‌గారి దర్శకత్వంలో నటించడం నా అదృష్టం. 'ఇంద్ర' సమయంలో వారణాసికి పిలవడంతో వచ్చారు. ఆయన తన చేత్తో స్వయంగా అన్నం తినిపించిన గొప్ప వ్యక్తి. నాకు తండ్రిని పోగొట్టుకున్నంత బాధగా ఉంది. **- చిరంజీవి**

❋❋❋

మరపురాని సినిమాలు, పాత్రలతో విశ్వనాథ్‌గారు చిరస్థాయిగా గుర్తుండిపోతారు. విశ్వనాథ్‌గారి వారసత్వం భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తి. **- నాగార్జున**



● విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మిని పరామర్శిస్తున్న చిరంజీవి

❋❋❋

పాత తరమే కాదు.. నేటి జనరేషన్ కూడా ఆయన చేసిన సేవల్ని గుర్తు చేసుకుంటాయి.

- వెంకటేశ్

❋❋❋

విశ్వనాథ్‌గారి మరణ వార్త విని బాధపడ్డాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. **- మోహన్‌బాబు**

❋❋❋

ఈశ్వర్' సినిమా ('స్వాతిముత్యం' హిందీ రీమేక్) షూటింగ్ చేస్తున్నప్పుడు మీతో సెట్‌లో ఉండటాన్ని ఒక దేవాలయంలో ఉన్న అనుభూతి చెందాను. **- అనిల్ కపూర్**

❋❋❋

మన సంస్కృతిని, సినిమాని అందంగా ఒకచోట చేర్చిన మేధావి కె. విశ్వనాథ్‌గారు. **- మహేశ్‌బాబు**

తెలుగు సినిమా ఖ్యాతిని ఖండాంతరాలుగా వ్యాపింపజేసిన వారిలో విశ్వనాథ్‌గారిది ఉన్నతమైన స్థానం. **- ఎన్టీఆర్**



● కె. విశ్వనాథ్ పార్థివ దేహం

❋❋❋

మనం ఒక లెజెండ్‌ని కోల్పోయాం. మా అందరి హృదయాల్లో, కళల్లో మీరు ఎప్పటికీ నిలిచి ఉంటారు. **- రామ్‌చరణ్**

❋❋❋

విశ్వనాథ్‌గారు మనల్ని వదిలి వెళ్లినా ఆయన మాస్టర్ పీసెస్ ఎప్పటికీ నిలిచి ఉంటాయి..

- అల్లు అర్జున్

❋❋❋

విశ్వనాథ్‌గారి సినిమాల్లో నేను నటించాను. భారతీయ చలన చిత్రాల్లో విరబూసిన కమలం ఆయన. **- బ్రహ్మానందం**

❋❋❋

ప్రపంచంలో ఎవరైనా 'మీ తెలుగు సినిమా గొప్పదనం ఏంటి?' అని అడిగితే.. మాకు కె. విశ్వనాథ్ గారు ఉన్నారని గర్వంగా చెప్పుకుంటాం. తెలుగు చిత్ర పరిశ్రమ మిమ్మల్ని ఎప్పటికీ మర్చిపోలేదు. సినిమా గ్రామర్‌లో మీరు నేర్పిన పాత్రలకు జీవితాంతం రుణపడి ఉంటాం సార్.

- ఎస్ఎస్ రాజమౌళి

❋❋❋

విశ్వనాథ్‌గారు ప్రతి సినిమా చివరిలో కళ కొనసాగుతూనే ఉంటుందంటారు. అలాగే ఆయన మరణం కూడా ముగింపు కాదు. ఆయన తాలూకు కళావారసత్వానికి కొనసాగింపు అనుకుంటున్నాను. **- త్రివిక్రమ్**

ఓ గురువుగా 'సిరి సిరి మువ్వ' నుంచి 'సాగర సంగమం' వరకు నాకు నటనలో నడక నేర్పించారు. తెలుగు జాతి గర్వించేలా 'స్వాతిముత్యం, స్వాతి కిరణం, సిరి సిరి మువ్వ, సాగర సంగమం' వంటి ఎన్నో ఆణిముత్యాల్లాంటి సినిమాలు తీశారాయన.

- రాధిక

❋❋❋

రెండేళ్ల క్రితం ఒక బ్రదర్‌ని (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) పోగొట్టుకున్నా.. ఇప్పుడు మరో బ్రదర్‌ని (విశ్వనాథ్) పోగొట్టుకున్నా. మంచి విషయాలు, తెలియని విషయాలు చెప్పే పెద్దవాళ్లు ఎవరూ మాకు ఇప్పుడు లేరు. విశ్వనాథ్‌గారు నాతో అద్భుతమైన పాటలు పాడించారు. మేమంతా చెన్నైలో పక్కపక్కన ఇళ్లల్లోనే ఉండేవాళ్లం. ప్రతిరోజూ ఆయన వాకింగ్ చేసుకుంటూ మా ఇంటికి వచ్చి, కాఫీ తాగి వెళ్లేవారు.

- ఎస్పీ శైలజ

❋❋❋

గత ఏడాది సినీ రంగం నుంచి విశ్వనాథ్‌గారికి, నాకు 'వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం'ను సీఎం జగన్ మోహన్ రెడ్డిగారు అందించారు. విశ్వనాథ్‌గారు దర్శకత్వం వహించిన 'నేరము శిక్ష' చిత్రంలో జూనియర్ ఆర్టిస్ట్‌గా చేసిన నేను ఆయనతో పాటు అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను.

- ఆర్. నారాయణమూర్తి

విశ్వనాథ్‌గారు తన చిత్రాల ద్వారా సామాజిక మార్పుకోసం ప్రయత్నించడం ఆయన గొప్పతనాన్ని తెలుపుతాయి.

- కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి



● రాజమౌళి, కీరవాణి, ఎ.కోదండరామిరెడ్డి, ఆర్. నారాయణమూర్తి, వెంకటేశ్, జీవిత, రాజశేఖర్, రాధిక

వివిధ సందర్భాల్లో 'సాక్షి'కి కె. విశ్వనాథ్ ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూల్లోని కొన్ని పదనిసలు ఈ విధంగా...

■ సినిమా టైటిల్స్‌లో 'ఎస్' సెంటిమెంట్ ఎందుకు?

విశ్వనాథ్: సినిమా వాళ్ళం పిరికి వాళ్ళమండీ! కోట్ల రూపాయలతో వ్యాపారం చేస్తాం కదా... భయాలు, సెంటిమెంట్లు ఎక్కువ! 'ఎస్'తో పెట్టిన రెండు సినిమాలు వరుసగా హిట్ కావడంతో అలా పెట్టుకుంటూ వచ్చాను.

■ మరి 'ఆపద్బాంధవుడు' దగ్గర ఆ రిస్క్ ఎందుకు తీసుకున్నారు?

బాగా గుర్తు... ఓరోజు 'ఏ టైటిల్ అయితే బావుంటుంది ఈ సినిమాకు?' అనుకుంటుండగా... క్యారెక్టర్‌కి తగ్గట్టుగా అయితే 'ఆపద్బాంధవుడు' బాగుంటుందన్నాను. అందరూ ఓకే అన్నారు. మరి ఎందుకని ఆ రోజు ఆ 'ఎస్' సెంటిమెంట్ మైండ్ నుంచీ స్లిప్ అయిందో నాకిప్పటికీ అర్థం కావట్లేదు.



■ మీరు పాటలు కూడా రాసేవారట...

సందర్భం వచ్చింది కాబట్టి చెబితే తప్పులేదేమో! నేను స్క్రిప్ట్ రాస్తున్నప్పుడే సిట్యుయేషన్‌కి తగ్గ పాట–లిరిక్ రాసుకుంటాను. దానికి నేను 'అబద్ధపు సాహిత్యం' అని పేరుపెట్టాను. అలా ఫ్లోలో రాసి, తర్వాత సినిమాలో ఉంచేసిన పల్లవులెన్నో – 'స్వాతిముత్యం'లో 'వటపత్రసాయికి...', 'శ్రుతిలయలు'లో 'తెలవారదేమో స్వామీ...', 'స్వాతికిరణం'లో 'తెలిమంచు కరిగింది...' – అలా... చాలానే ఉన్నాయి.

■ మరి పాటంతా మీరే రాయొచ్చుగా?

కొన్ని రాశాను... 'స్వరాభిషేకం'లో 'కుడి కన్ను అదిరెను...' పాట పూర్తిగా నేనే రాశాను. అయితే పేరు వేసుకోలేదు.

■ రాసింది చెప్పుకోవడంలో తప్పేముందండీ

ఏమో, చెప్తే నమ్ముతారో లేదో జనాలు!

■ మిమ్మల్ని నమ్మకపోవడమా!

అలా అని కాదు... నాకసలు పబ్లిసిటీ ఇచ్చుకోవడం ఇష్టం ఉండదు. (నవ్వుతూ) ఏదో పెళ్ళిచూపులకెళ్తే 'ఆయన పెట్టుకున్న ఉంగరం కూడా నాదే!' అని ఎవరో అన్నట్టు... 'ఫలానా సినిమాలో ఫలానా పాటకు పల్లవి నేనే రాశాను' అని ఏం చెప్పుకుంటాను చెప్పండి?

■ మీ కుటుంబం నుంచి ఎవ్వరూ సినిమా ఫీల్డ్‌కి రాకపోవడానికి కారణం?

నేనే ప్రోత్సహించలేదు. వాళ్లు ఇక్కడ రాణిస్తారనే నమ్మకం నాకు లేదు. ఈ రోజుల్లో పైకి రావడమంటే చాలా కష్టం. మా రోజులు వేరు. ప్రతిభను గుర్తించే మనుషులు అప్పుడు చాలామంది ఉండేవారు. డబ్బుల విషయంలోనూ, పేరు ప్రఖ్యాతుల విషయంలోనూ ఇక్కడో అనిశ్చితి ఉంది. అందుకే మా పిల్లల్ని బాగా చదివించి వేరే రంగాల్లో స్థిరపడేలా చేశాను.

■ విశ్వనాథ్ వారసులుగానైనా ఓ గుర్తింపు వచ్చేదేమో?

నా గౌరవ మర్యాదలన్నీ నా బిడ్డలకు ట్రాన్స్‌ఫర్ కావాలనే రూలేమీ లేదిక్కడ. ఎవరికి వాళ్లే ప్రూవ్ చేసుకోవాలి. నాలాగా మా పిల్లల్ని కూడా డైరెక్టర్లు చేయాలనుకుని నేను సొంతంగా డబ్బులు పెట్టి సినిమాలు తీయలేను కదా. అంత డబ్బు కూడా నేను సంపాదించలేదు. మా పిల్లలు ఫలానా కంపెనీలో మేనేజర్లుగా పని చేస్తున్నారని నేను గర్వంగానే చెప్పుకోగలను.

■ మ్యారేజ్ డే లాంటివి జరుపుకుంటారా?

భార్యాభర్తల మధ్య తప్పనిసరిగా ఉండాల్సింది పరస్పర నమ్మకం. ప్రేమ, గౌరవం మన హృదయాంతరాళంలో నుంచి రావాలి. అంతేకాని, ప్రత్యేకించి ఫాదర్స్ డే, మదర్స్ డే, ప్రేమికులదినం, వైవాహిక దినం – అని ఏడాదికి ఒకరోజే మొక్కుబడిగా చేసుకోవడంలో అర్థం లేదు.

■ ఒక్కోసారి భోజనం కూడా మరచిపోయేవారట కదా?

సినిమా రూపకల్పనలో ఉండగా ఒక్కొక్కప్పుడు గాఢంగా సంగీత, సాహిత్య చర్చల్లో మునిగిపోతే – అసలు టైమే తెలిసేది కాదు. భోజన వేళ దాటిపోతోందని ఎవరైనా గుర్తు చేస్తే కానీ గుర్తొచ్చేది కాదు.

■ సినిమా ఇండస్ట్రీ అంతా ఓ పోకడలో కొట్టుకుపోతూ, ప్రవాహంలో వెళ్తున్న టైమ్‌లో అడ్డుకట్ట వేసి మళ్లీ మీరు దాన్ని వెనక్కి తెచ్చారనే భావన మీ అభిమానుల్లో ఉంది...

నిజమే. 'పాశ్చాత్య సంగీతపు పెను తుఫానులో రెపరెపలాడుతున్న సత్సంప్రదాయ సంగీతపుజ్యోతిని కాపు కాయడానికి తన చేతులు అడ్డు పెట్టినవారందరికీ పాదాభివందనం చేస్తున్నా' అని 'శంకరాభరణం'లో శంకరశాస్త్రి డైలాగ్ చెబుతాడు. నేను అలా చేశానని నాకు పాదాభివందనం చేయమని కాదు. అభిమానుల అభిప్రాయాన్ని నేను ఒప్పుకుంటాను. ఇప్పటికీ ఒప్పుకోకపోతే నేను మూగవాణ్ణి అయిపోతా. నా బుద్ధి మేరకు నేను నిజంగానే చేశాను. క్లాసికల్ మ్యూజిక్, డ్యాన్స్ పెట్టి సినిమాలు చేస్తే ఎవరు ఆదరిస్తారు? ఇది కమర్షియల్ ఆర్ట్ కదా? మీ సినిమాలకు డబ్బు వస్తుందా? నిర్మాత ఏమవుతాడు? అన్నదానికి విరుద్ధంగా ప్రజలు ఇచ్చిన తీర్పు చాలా గొప్పది. దాని ఫలితమే నాకు వచ్చిన అవార్డులు... ఈ రోజు (దాదా ఫాల్కే వచ్చిన సందర్భంగా..) వచ్చిన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు కూడా!

క్లుప్తంగా...



ఏసీకి అవిశ్వాస ప్రకటన అందిస్తున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసులు

జనగామ: జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌పై అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి అవిశ్వాస నోటీసులు అందజేశారు. తొమ్మిది రోజులపాటు క్యాంపు రాజకీయం నడిపించిన అధికార పక్షం ఆ ఇద్దరిని తొలగించాలని కోరుతూ 11 మంది బీఆర్ఎస్, 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు వేర్వేరుగా అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఫ్లోర్‌లీడర్ మారబోయిన పాండును తొలగించాలని అధిష్టానాన్ని కోరినట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. కాంట్రాక్టర్లు, ఇళ్లనిర్మాణ అనుమతులకు కమీషన్లు వసూలు చేస్తూ పార్టీని అప్రతిష్టపాలు చేస్తుండటంతో అవిశ్వాసం నోటీసులు ఇచ్చినట్లు చైర్‌పర్సన్ రేసులో ఉన్న 19వ వార్డు సభ్యురాలు బండ పద్మ తెలిపారు. కాగా, నలుగురు బీజేపీ సభ్యులు కూడా తమతో టచ్‌లో ఉన్నారని ఆమె చెప్పారు.

వైభవంగా సాకేత రామచంద్రుని వాహన సేవ



శంషాబాద్ రూరల్: 'సమతా కుంభ్'ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం యాగశాలలో అగ్ని ప్రతిష్ట చేశారు. శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీరామనగరంలో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం దివ్య సాకేతాలయం నుంచి స్ఫూర్తి కేంద్రం వరకు సాకేత రామచంద్రస్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. గరుడ పటంతో ధ్వజారోహణం చేశారు. సంతానం కోరుకున్న భక్తులకు గరుడ ప్రసాదాన్ని అందజేశారు. యాగశాలలో అగ్ని ప్రతిష్ట అనంతరం 9 కుండాలతో యజ్ఞం చేపట్టారు. సాయంత్రం చిన జీయర్ స్వామి భక్తులకు ప్రవచనం చేసి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

బిల్లును ఓకే చేయించి.. అవిశ్వాసాలు ఆపేలా..!

- పురపాలికల్లో 'లొల్లి'కి చెక్‌పెట్టేందుకు సర్కారు ప్రయత్నాలు
- మేయర్లు, చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీలో తీర్మానం
- సదరు బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్
- ఇదే అదనుగా పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాల నోటీసులు
- గవర్నర్ ద్వారా బిల్లు ఆమోదింపజేసి వాటిని ఆపాలని ప్రభుత్వ యోచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో నెలకొన్న అవిశ్వాసాల గందరగోళానికి తెర దించాలని ప్రభుత్వం భావిస్తోంది. జనవరి 26తో మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకొన్న 127 పట్టణ, నగర పాలక మండళ్లలో చాలాచోట్ల లుకలుకలు బహిర్గతమయ్యాయి. పలుచోట్ల ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు కూడా ఇచ్చారు. కొన్ని పట్టణాల్లో క్యాంపులు, కొనుగోళ్ల పర్వం కూడా మొదలైంది. అవిశ్వాసాలు ప్రతిపాదించిన పట్టణాలు, నగరాల్లో అధికార బీఆర్ఎస్ పాలక మండళ్లే కొలువు తీరి ఉండటం, ప్రస్తుత మేయర్లు, చైర్‌పర్సన్లను గద్దె దించేందుకు సొంత పార్టీ ప్రతినిధులే అవిశ్వాసం నోటీసులు ఇవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే రంగంలోకి దిగింది. పట్టణ, నగర పాలక మండళ్లలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఉన్న కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో తీసుకొచ్చిన బిల్లు ఆమోదం పొందితే మరో ఏడాది వరకు సమస్య ఉండదని భావిస్తోంది. రెండు, మూడు రోజుల్లో మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించేలా పావులు కదుపుతోంది. మున్సిపల్ చట్ట సవరణ బిల్లు విషయమై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ గవర్నర్‌ను కలవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ బిల్లు విషయంలో గవర్నర్‌కు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసి ఆమోదించాల్సిందిగా కోరాలని భావిస్తున్నట్టు తెలిసింది.

ఇన్నాళ్లుగా పెండింగ్‌లో..

తెలంగాణ మున్సిపల్ చట్టం- 2019 ప్రకారం నగర, పురపాలక సంఘాల్లో మేయర్/ డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్/వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేందుకు.. పాలక మండలి ఏర్పాటైన నాటి నుంచి కనీసం మూడేళ్ల గడువు పూర్తయి ఉండాలి. ఈ నిబంధనకు సవరణ చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అవిశ్వాస కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ మున్సిపల్ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. అసెంబ్లీ ఆమోదించినా గవర్నర్ వద్ద పెండింగ్‌లో పడింది. రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య ఏర్పడిన అగాథం నేపథ్యంలో గవర్నర్ వద్ద ఆగిన ఏడు బిల్లుల్లో మున్సిపల్ చట్ట సవరణ బిల్లు కూడా ఉంది. మరోవైపు రాష్ట్రంలోని పుర/నగర పాలక సంస్థల పాలక మండళ్లకు గత నెల 26తో మూడేళ్ల పదవీకాలం పూర్తయింది. ఇదే అదనుగా అసమ్మతి ప్రజాప్రతినిధులు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడం మొదలుపెట్టారు. అవన్నీ కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈలోపే చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందితే సమస్యకు చెక్‌పడుతుందని సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

'స్థానిక' ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం

- ఎన్నికలు జరిగిన ఆరు ఎంపీపీలూ అధికార పార్టీకే
- ఐదు కో ఆప్షన్, 25 ఉప సర్పంచి పదవులు కూడా..
- 10 ఉపాధ్యక్ష స్థానాల్లో తొమ్మిది వైఎస్సార్‌సీపీకి.. ఒక్క చోట స్వతంత్ర అభ్యర్థి

సాక్షి, అమరావతి: ఏపీ వ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), ఉపాధ్యక్ష, కో- ఆప్షన్ సభ్యుల పదవులకు శుక్రవారం జరిగిన ఉప ఎన్నికల్లో అధికార వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. ఏడు మండలాల్లో ఎంపీపీ పదవుల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా చిత్తూరు జిల్లా రామకుప్పం మినహా మిగిలిన ఆరు మండలాల్లో పూర్తయ్యాయి. ఆరుకి ఆరు ఎంపీపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ప్రకటించింది. మరో 11 మండలాల్లో ఉపాధ్యక్ష పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించగా రామకుప్పం మినహా మిగిలిన 10 మండలాల్లో పూర్తయ్యాయి. పదిలో తొమ్మిది చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందగా ఒక్క చోట స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. రామకుప్పం మండలంలో ఎంపీటీసీ సభ్యులు ప్రత్యేక సమావేశానికి హాజరు కాకపోవడంతో ఎంపీపీ, ఉపాధ్యక్ష ఎన్నికలు రెండూ వాయిదా పడినట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం ప్రకటించింది. ఇక ఆరు మండలాల్లో కో- ఆప్షన్ సభ్యుల ఎన్నికలు జరగగా ఐదు చోట్ల పూర్తయ్యాయి. ఐదు చోట్లా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే కో - ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. చిత్తూరు మండలంలో కో- ఆప్షన్ సభ్యుడి పదవికి ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది.

దాచేపల్లి అధికార పార్టీదే

పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ పదవికి శుక్రవారం నిర్వహించిన ఉప ఎన్నికలో 10వ వార్డు నుంచి గెలుపొందిన వైఎస్సార్‌సీపీ సభ్యురాలు కె.సుబ్బమ్మ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైనట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఉప సర్పంచి ఎన్నికలు కూడా జరిగాయి. మొత్తం 25 పంచాయతీల్లో ఉప సర్పంచి ఎన్నికలు ప్రశాంతంగా పూర్తవగా సభ్యులు హాజరు కాని కారణంగా మూడు చోట్ల తిరిగి ప్రకటించే వరకు వాయిదా పడ్డాయి. ఒక్క చోట శనివారానికి వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి చెప్పారు.

అవినాష్‌రెడ్డి కాల్ రికార్డులో సంచలనం ఏముంది?

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి కాల్ రికార్డులో సంచలనం ఏమీ లేదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంపై నాలుగు రోజుల నుంచి పచ్చ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, ఏదో జరిగిపోయిందంటూ హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి మరణించిన అంశాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేసేందుకు, ఆయన ఇంట్లో పనిచేసే (అటెండర్) నవీన్‌కు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఫోన్ చేశారని తెలిపారు. ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. వైఎస్ వివేకా హత్య కేసులో నవీన్, ఓఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డిలను సీబీఐ విచారించడంపై పచ్చ మీడియా దుష్ప్రచారం చేస్తుండటం దారుణం అని ధ్వజమెత్తారు. 'వైఎస్ జగన్‌కు సమాచారమిచ్చేందుకు ఫోన్ చేయడం తప్పా? వైఎస్ అవినాష్‌రెడ్డి ఫోన్‌ను ఆ రోజే పోలీసులు చెక్ చేశారు. వైఎస్ జగన్‌తో మాట్లాడేందుకే అవినాష్‌రెడ్డి నవీన్‌కు ఫోన్ చేశారు. ఈ విషయంపై ఎల్లోమీడియా రాద్ధాంతం చేయడం ఎంత వరకు సబబు' అని సజ్జల ప్రశ్నించారు.



జగనన్న విదేశీ విద్యా దీవెన చెక్కును ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సువర్ణాధ్యాయం

- విదేశీ విద్యా దీవెన పథకం ప్రారంభిస్తూ ఏపీ సీఎం వైఎస్ జగన్
- టాప్ 200 విదేశీ వర్సిటీల్లో సీట్లు తెచ్చుకున్న పేద విద్యార్థులకు బాసట
- 213 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.19.95 కోట్లు జమ

సాక్షి, అమరావతి: జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఏపీ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ పథకం కింద విదేశీ టాప్ యూనివర్సిటీల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తుందని చెప్పారు. పెద్ద పెద్ద యూనివర్సిటీల నుంచి వచ్చిన గొప్ప వాళ్లను చూసి.. ఆ స్థాయిలో కలలు కని, వాటిని నిజం చేస్తూ దేశ, రాష్ట్ర ప్రతిష్టను పెంచాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్య మీద పెట్టే ప్రతి పెట్టుబడి మానవ వనరుల మీద పెట్టినట్టేనని తెలిపారు. అందుకే రాష్ట్రంలో ఈ రంగానికి పెద్దపీట వేశామని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రతిభతో ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీలలో ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించడమే లక్ష్యంగా చేపట్టిన జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం అమలుకు శుక్రవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ ఏడాది టాప్ 200 విదేశీ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్లను తన క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ పథకంలో భాగస్తులైన ప్రతి చెల్లెమ్మ, తమ్ముడు ఉన్నత స్థానంలోకి వెళ్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం మీపై పెడుతున్న పెట్టుబడితో రేపు మీరు మెరుగైన స్థానానికి వెళ్లినప్పుడు రాష్ట్రాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. అప్పుడే మన దేశ, రాష్ట్ర ప్రతిష్ట పెరుగుతుందని చెప్పారు.

ఎఫ్‌డీసీ చైర్మన్‌గా 'పోసాని' బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న పోసాని

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం అవసరమైతే ప్రాణమిస్తానని, తాను బతికున్నంతకాలం జగన్ వెంటే ఉంటానని ప్రముఖ సినీ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి అన్నారు. ఏపీ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా శుక్రవారం ఆయన విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని, సినీ పరిశ్రమకు మంచి చేయకపోయినా చెడుగానీ, మోసంగానీ చేయబోనని ఆయన స్పష్టంచేశారు. చలనచిత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోందని, ముఖ్యంగా ఈ పరిశ్రమను విశాఖలో అభివృద్ధి చేయాలనే సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా తాను పనిచేస్తానన్నారు. కరోనా సమయంలో తన కుటుంబం మొత్తం ఆసుపత్రిలో ఉంటే జగన్ సతీమణి వైఎస్ భారతమ్మ తమకు అండగా నిలిచారని పోసాని తెలిపారు. రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 175 స్థానాలు కచ్చితంగా వస్తాయన్నారు. ఇక చంద్రబాబులా జగన్ వెన్నుపోటు పొడిచి పదవులు, పార్టీని లాక్కోలేదని అలాంటి వ్యక్తి సైకో ఎలా అవుతారని పోసాని ప్రశ్నించారు. మరోవైపు.. విశాఖలో సినీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం 100 ఎకరాలు కేటాయించిందని, ప్రభుత్వం త్వరలోనే ఇందుకు అవసరమైన అనుమతులిస్తుందని మాజీమంత్రి పేర్ని నాని తెలిపారు. హీరోలందరూ సినిమా షూటింగులను ఒక్క షెడ్యూల్ అయినా ఏపీలో తీయాలని కోరానని, గోపీచంద్ ఒక్కరే ఒక షెడ్యూల్ షూటింగ్ తీశారని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ అన్నారు.

సాక్షి రియల్టీ



రూ.25 కోట్లకు పైమాటే

- స్థిరాస్తిలో పెట్టుబడులకు హెచ్ఎన్ఐ, యూహెచ్ఎన్ఐ ఆసక్తి
- 65% మంది రూ. 4-10 కోట్ల ప్రాపర్టీలకు...
- 13 శాతం మంది అల్ట్రా లగ్జరీ ప్రాపర్టీలకే మొగ్గు
- ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, గోవా, బెంగళూరు హాట్‌స్పాట్స్
- ఇండియా సోత్‌బైస్ ఇంటర్నేషనల్ రియల్టీ వార్షిక సర్వేలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దేశీయ స్థిరాస్తి రంగంలో పెట్టుబడులకు హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్ఐ), అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (యూహెచ్ఎన్ఐ)లు ఆసక్తిగా ఉన్నారు. ఫలితంగా లగ్జరీ, అల్ట్రా ప్రీమియం ప్రాపర్టీలకు డిమాండ్ పెరిగింది. 65 శాతం మంది హెచ్ఎన్ఐ, యూహెచ్ఎన్ఐలు రూ.4-10 కోట్లు ధర ఉన్న లగ్జరీ ప్రాపర్టీ కొనుగోలుకు మొగ్గుచూపుతుండగా.. 13 శాతం మంది రూ.25 కోట్లకు పైన ధర ఉన్న స్థిరాస్తుల కోసం ఆసక్తిగా ఉన్నారని ఇండియా సోత్‌బైస్ ఇంటర్నేషనల్ రియల్టీ (ఐఎస్ఐఆర్) వార్షిక సర్వే వెల్లడించింది.

- కరోనాతో స్థిరాస్తి రంగానికి జరిగిన ప్రధాన మేలు.. సొంతింటి అవసరం తెలిసిరావటమే. మరీ ముఖ్యంగా గృహ విభాగంలో యువతరం భాగస్వామ్యం పెరగడం. 74 శాతం సంపన్న కొనుగోలుదారులు ద్రవ్యోల్బణాన్ని నిరోధించేందుకు రియల్ ఎస్టేట్ ఒక ప్రధాన ఆస్తిగా పరిగణిస్తారు.
- 61 శాతం మంది హెచ్ఎన్ఐ, యూహెచ్ఎన్ఐలు 2023-24లో లగ్జరీ ప్రాపర్టీలను కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. 34 శాతం మంది హైరైజ్ అపార్ట్‌మెంట్ల కొనుగోలుకు ఆసక్తిగా ఉండగా.. 30 శాతం మంది ఫామ్‌హౌస్‌లు, హాలిడే హోమ్స్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అలాగే 23 శాతం మంది వాణిజ్య సముదాయాలలో పెట్టుబడులకు, 15 శాతం మంది స్థలాలపై ఆసక్తిగా ఉన్నారు.
- గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 34 శాతం మంది హెచ్ఎన్ఐ, యూహెచ్ఎన్ఐలు విలాసవంతమైన ప్రాపర్టీలను కొనుగోలు చేశారు. ఇప్పటికీ చాలా మంది కొనుగోలుదారులు లగ్జరీ గృహాల కోసం శోధిస్తున్నారు. వచ్చే రెండు మూడేళ్లు దేశీయ రియల్టీ రంగం సరికొత్త రికార్డులను చేరుకుంటుందని విశ్వసిస్తున్నారు. గత 16 నెలలుగా లగ్జరీ గృహాల ధరలు పెరిగాయి. అయితే 2015లోని గరిష్ఠ ధరలతో పోలిస్తే స్వల్ప పెరుగుదలేనని తెలిపారు.
- విశాలవంతమైన గృహాలు, గ్రీనరీ ఎక్కువగా ఉండే ప్రాపర్టీలకే లగ్జరీ కొనుగోలుదారులు మొగ్గుచూపిస్తున్నారు. సంపన్న భారతీయుల ప్రాపర్టీ ఎంపికలో తొలి ప్రాధామ్యాలు మెరుగైన ఫిజికల్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలకే.

ఈ నగరాలే హాట్‌స్పాట్స్..

సంపన్న కొనుగోలుదారులు ప్రాపర్టీ కొనుగోళ్లకు ప్రధాన కారణం మెరుగైన జీవనశైలి. మూలధన వృద్ధి, భవిష్యత్తు తరాలకు ఆస్తి వంటివి ఆ తర్వాతి అంశాలు. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, గోవా, బెంగళూరు నగరాలలో గృహాల కొనుగోళ్లకు హెచ్ఎన్ఐ, యూహెచ్ఎన్ఐలు ఆసక్తిగా ఉన్నారు. 11% మంది సంపన్నులు విదేశాలలో ప్రాపర్టీ లకు మొగ్గు చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా భయాలు తగ్గుముఖం పట్టడంతో విలాసవంతమైన భారతీయులు న్యూయార్క్, లండన్, దుబాయ్, లిస్బన్ దేశాలలో లగ్జరీ అపార్ట్‌మెంట్ల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.





క్లుప్తంగా...

6న ఎంసెట్ షెడ్యూల్

సాక్షి, హైదరాబాద్: ఎంసెట్ షెడ్యూల్ సోమవారం విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. దీంతో పాటు ఈ-సెట్, ఐ-సెట్, పీజీ సెట్, ఎడ్‌సెట్ షెడ్యూళ్లను కూడా ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎంసెట్‌పై విద్యార్థులు ఆసక్తితో ఉన్నారు. ఇప్పటికే జాతీయస్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశపరీక్ష జేఈఈ తొలివిడత పూర్తయింది. రెండోవిడత ఏప్రిల్‌లో జరుగుతుంది. ఈలోగా ఇంటర్ పరీక్షలు పూర్తవుతాయి. ఎంసెట్ షెడ్యూల్ ఇచ్చిన తర్వాత పరీక్షకు 45 రోజుల గడువు ఉండాలని మండలి నియమంగా పెట్టుకుంది. ఈ కారణంగా ఏప్రిల్ చివరివారం లేదా మే మొదటివారంలో పరీక్ష ఉండొచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ఇంటర్ వెయిటేజీ దాదాపు ఉండనట్టేనని అధికారులు చెబుతున్నారు.

ఒక్కో పోస్టుకు 116 మంది పోటీ

- గ్రూప్-4కు 9,51,321 దరఖాస్తులు
- దరఖాస్తుల స్వీకరణకు ముగిసిన గడువు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-4 కొలువుల భర్తీకి నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. గత డిసెంబర్ 1న 8,180 గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా డిసెంబర్ 30 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టింది. ఈనెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగిసింది. మొత్తం 9,51,321 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగ ఖాళీలు భారీగా ఉండటంతో అభ్యర్థులు పెద్దఎత్తున దరఖాస్తులు సమర్పించారు. అందిన దరఖాస్తులను బట్టి చూస్తే ఒక్కో ఉద్యోగానికి సగటున 116 మంది పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా, రిజర్వేషన్ల వారీగా పరిశీలిస్తే పోటీ అటుఇటుగా ఉండొచ్చు. జూలై 1న గ్రూప్-4 అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే చెప్పింది.

7 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్య విద్య విభాగం పరిధిలో 34 కేటగిరీల్లో ఖాళీగా ఉన్న 1,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు 2,930 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వెంగళ్‌రావు నగర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో పరిశీలించనున్నట్లు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్య కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు బోర్డు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వెల్ఫేర్ అధికారి పోస్టులకు 1.45 లక్షల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: వివిధ సంక్షేమ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-1, గ్రేడ్-2, మాట్రాన్ గ్రేడ్-1, గ్రేడ్-2, వార్డెన్ గ్రేడ్-1, గ్రేడ్-2, చిల్డ్రన్స్ హోంలలో మహిళా సూపరింటెండెంట్ ఉద్యోగాలకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. ఈ పోస్టుల కోసం 1,45,358 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆగస్టునెలలో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షను ఓఎంఆర్ ఆధారంగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

పరీక్షల వరకూ మిత్తల్‌ను ఉంచాలి

ప్రభుత్వ లెక్చరర్ల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షల ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఇంటర్ బోర్డు కార్యదర్శి, ఇంటర్ విద్య కమిషనర్‌గా నవీన్ మిత్తల్‌నే కొనసాగించాలని ప్రభుత్వ లెక్చరర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ప్రభుత్వ కాలేజీలోనూ ఉద్యోగులు ప్రిన్సిపాళ్లను కలసి వినతి పత్రాలు సమర్పించారు. ఇంటర్ వ్యవస్థలో కీలకమైన సంస్కరణలకు నాంది పలికిన మిత్తల్‌ను పరీక్షల సమయంలో కదిలిస్తే అరాచక శక్తులు ఇష్టానుసారం వ్యవహరించే ప్రమాదం ఉందని, దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులకు నష్టం జరుగుతుందని లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రైవేటు కాలేజీల ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని అడ్డుకునే ప్రయత్నాన్ని నిరోధించడానికి ఆయనను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టీఐపీఎస్), తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీఐజీఎల్ఏ) నేతలు మాచర్ల రామకృష్ణాగౌడ్, కొప్పిశెట్టి సురేశ్ నాయకత్వం వహించారు. అధ్యాపకుల అభిప్రాయాలతో కూడిన వినతి పత్రాన్ని ఉద్యోగ నేతలు మంత్రి సబితా ఇంద్రారెడ్డికి పంపారు.

ఖాతాలు, మనుషులే.. పారసైట్‌లు!

అమాయకులను వాడుకుంటూ సైబర్ నేరగాళ్ల మోసాలు

- కమీషన్ల ఆశ చూపి బ్యాంకు అకౌంట్లను వాడుకుంటున్న తీరు
- వర్క్ ఫ్రం హోం పేరిట కొందరితో సొమ్ము ట్రాన్స్‌ఫర్లు
- నేరాలపై దర్యాప్తులో పోలీసులకు చిక్కుతున్నది వీరే..
- తెలియక బ్యాంకు అకౌంట్లు ఇచ్చినా నేరస్తులవుతారని సైబర్ భద్రతా నిపుణుల హెచ్చరిక



సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు ఇటీవల ఓ అంతర్జాతీయ ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టును బయటపెట్టారు. అమాయకుల నుంచి కొల్లగొట్టిన రూ.24 కోట్లను సీజ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై ఆరా తీస్తే.. దొరికినవారంతా అమాయకులే. డబ్బుల ఆశతో తెలిసీతెలియక సైబర్ నేరస్తులకు సహకరించినవారే. సైబర్ నేరగాళ్లు కమీషన్లు ఇస్తామనడంతో బ్యాంకు ఖాతాలు ఇచ్చినవారు, వాటి నుంచి డబ్బుల ట్రాన్స్‌ఫర్లు చేసినవారే. ఇలాంటి బ్యాంకు ఖాతాలను సైబర్ భద్రత నిపుణులు 'పారసైట్'అకౌంట్లుగా పిలుస్తున్నారు. ఇలా తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు ఇచ్చిన 233 మందికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సైబర్ మోసంలో వారిని పాత్రధారులుగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు.

ఖాతాలు ఇచ్చి ఇరుక్కున్న 233 మంది

సాక్షి, హైదరాబాద్

కష్టపడకుండానే డబ్బు వస్తుందన్న ఆశే ఇప్పుడు పోలీస్ కేసులు కొందరి మెడకు చుట్టుకోవడానికి కారణమవుతోంది. కంటికి కనిపించకుండానే బ్యాంకు ఖాతాలు కొల్లగొడుతున్న సైబర్ కేటుగాళ్లు.. డబ్బుకు ఆశపడే కొందరిని తమ మోసాలకు పావులుగా వాడుకుంటున్నారు. 'పారసైట్'బ్యాంకు అకౌంట్లను వాడుతూ కోట్లు కొల్లగొడుతున్నారు. పోలీసులు ఎంతో శ్రమించి ఆరా తీస్తే చివరికి అమాయకులు పట్టుబడుతున్నారు. కమిషన్ కోసం బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు ఇస్తే కేసుల్లో ఇరుక్కోక తప్పదని సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణుడు పాటిబండ్ల ప్రసాద్ హెచ్చరించారు.

ఖాతాలు.. కమీషన్లు.. వర్క్‌ఫ్రం హోం పేరిట..

ఎవరైనా తమ వ్యాపారాలు చాలించాలనుకునే వారు తమ కంపెనీలను అమ్మేస్తున్నట్టు ప్రకటనలు ఇస్తే.. అలాంటి వారిని సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో సంప్రదిస్తున్నారు. 'మీ కంపెనీ కరెంట్ ఖాతాను మాకు వాడుకోవడానికి ఇస్తే.. ప్రతి నెలా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తాం'అంటూ గాలం వేస్తున్నారు. ఇదే తరహాలో సేవింగ్స్ ఖాతాలు ఉన్నవారినీ ప్రలోభ పెడుతున్నారు. డబ్బు వస్తుంటే ఎందుకు పోగొట్టుకోవాలన్న ఆశతో కొందరు ఇందుకు ఓకే అంటున్నారు. ఇలా సేకరించిన కరెంట్, సేవింగ్స్ ఖాతాలను సైబర్ నేరగాళ్లు అక్రమ సొమ్మును ట్రాన్స్‌ఫర్ చేసుకోవడానికి వాడుతున్నారు. ఇలా ట్రాన్స్‌ఫర్ చేసే చోట కూడా తాము చిక్కకుండా.. అమాయకులను వాడుకుంటున్నారు. 'వర్క్‌ఫ్రం హోం.. ఇంటి దగ్గర కూర్చునే రోజూ వేలు సంపాదించండి..'అని ఆన్‌లైన్ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కమిషన్ ఆశచూపి పనికి పెట్టుకుంటున్నారు. వారికి పుష్ బటన్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. దానికి ఆటో డెబిట్, క్రెడిట్ కార్డులను జత చేస్తారు. ముందస్తుగానే తప్పుడు ఆధార్ వివరాలతో తీసుకున్న సిమ్‌కార్డులను వాడి వీరికి ఎస్ఎంఎస్ పంపుతారు. డబ్బులను వారు సూచించిన ఖాతాల్లో వేసేలా పుష్‌బటన్ యాప్‌లను వాడాలని సూచిస్తారు. మొత్తానికి.. సైబర్ నేరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టినప్పుడు 'పారసైట్'బ్యాంకు ఖాతాల యజమానులు, పుష్‌బటన్ యాప్‌ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసిన వ్యక్తులు మాత్రమే పట్టుబడుతుంటారు. అసలు సైబర్ నేరగాళ్లు తప్పించుకుంటారు. ఇలాంటి నేరాలకు సైబర్ నేరగాళ్లు ఎక్కువగా టెలిగ్రామ్ వంటి యాప్స్‌ను వేదికగా చేసుకుంటున్నారని పాటిబండ్ల ప్రసాద్ తెలిపారు.

కొద్దిమొత్తాలుగా చేసి.. బిట్‌కాయిన్లుగా మార్చి..

సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బును చిన్నచిన్న మొత్తాలుగా మార్చి వాటిని తొలుత వందల బ్యాంకు ఖాతాల్లోకి పంపుతారు. తర్వాత ఆ ఖాతాల నుంచే ఆన్‌లైన్‌లో బిట్‌కాయిన్లుగా మార్చుతున్నారు. బిట్‌కాయిన్లను విదేశీ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి సొమ్ముగా మార్చుకుంటున్నారు. ప్రధానంగా చైనాకు చెందిన పలు యాప్స్ కంపెనీలు ఈ నేరాలకు పాల్పడుతున్నాయి. అవన్నీ కూడా తమ కంప్యూటర్ సర్వర్లను హాంగ్‌కాంగ్, సింగపూర్, చైనా, ఇరాన్ వంటి దేశాల నుంచి ఆపరేట్ చేస్తున్నాయని.. ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు ఏమీ చేయలేని పరిస్థితి ఉంటుందని సైబర్ నిపుణులు చెప్తున్నారు. మన దేశంలోని దర్యాప్తు సంస్థలు ఈ మోసాలను గుర్తించినా అసలు దోషులను కనిపెట్టడం కష్టమని అంటున్నారు.



గవర్నర్ తమిళిసైకి మొమెంటో అందిస్తున్న ఆర్‌కే స్వామి గ్రూప్ చైర్మన్ శ్రీనివాసన్ స్వామి, 'సాక్షి' కార్పొరేట్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రాణిరెడ్డి. చిత్రంలో నీనా ఎలవియా జైపూరియా, అవినాశ్ పాండే

మహిళా వివక్షను తిరస్కరించండి

- స్త్రీలను వక్రదృష్టితో చూపే ప్రకటనలు, సినిమాలపై అభ్యంతరం తెలపండి
- ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపు
- ఐఏఏ ఆధ్వర్యంలో వాయిస్ ఆఫ్ చేంజ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు
- ప్రకటనల రంగం ఈ అంశంపై చర్చించడం హర్షణీయమని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: కంపెనీల ప్రకటనలు మొదలుకొని సినిమాల వరకూ మహిళను వివక్షతో చిత్రీకరించడాన్ని ప్రజలు ఎప్పటికప్పుడు నిరసించాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పష్టం చేశారు. అలాంటి ప్రకటనలు, సినిమాలను తిరస్కరించాలని, ప్రజలు తమ అభ్యంతరాలను స్పష్టంగా చెప్పడం అవసరమన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ ధోరణి కనిపిస్తున్నా... విస్తృత స్థాయిలో సమాజంలో మాత్రం వివక్ష కొనసాగుతూనే ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రింట్, వీడియో, సినిమాల్లో లింగ వివక్ష, మహిళలను నిర్దిష్ట దృక్కోణం (స్టీరియో టైపింగ్)లో చూపడాన్ని నియంత్రించడం, రూపుమాపడం లక్ష్యంగా ఇంటర్నేషనల్ అడ్వర్టైజింగ్ అసోసియేషన్ (ఐఏఏ) శుక్రవారం హైదరాబాద్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. 'వాయిస్ ఆఫ్ చేంజ్'పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మహిళలు నిత్యం వివక్షకు గురవుతూనే ఉన్నారని, ప్రతిక్షణం మహిళను నిర్దిష్ట దృక్కోణంలో చూపుతున్నారని ఈ సందర్భంగా గవర్నర్ సోదాహరణంగా వివరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కొన్ని పోటీల్లో బహుమతులుగా వంట పాత్రలు ఇస్తున్నట్లు ప్రకటించారని... వారి దృష్టిలో ఆడవారంటే వంటింటికి మాత్రమే పరిమితమైన వ్యక్తులని వ్యాఖ్యానించారు.

సమాజంలో 10 రెట్లు ఎక్కువ కష్టం మాది..

వాణిజ్య ప్రకటనల్లో లింగ వివక్షను గవర్నర్ తమిళిసై ప్రస్తావిస్తూ ''ఒక యాడ్‌లో ఓ మహిళను ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా చూపారు. ఈ ప్రకటన పరవాలేదని తాను అనుకుంటుండగానే.. ఆమె ఓ పురుషుడి బనియన్‌ను చూసి తన్మయత్వంతో ఊగిపోతున్నట్లు చూపారు. ఆఖరుకు పురుషుడి లోదుస్తుల ప్రకటనకూ మహిళను స్టీరియోటైపింగ్ చేశారు''అని ఆవేదన వ్యక్తం చేశారు. తంజావూర్ మెడికల్ కాలేజీలో తాను గైనకాలజిస్టుగా పనిచేస్తున్నప్పుడు కవలలకు జన్మనిచ్చిన తల్లి.. మగబిడ్డకు చనుబాలు, ఆడబిడ్డకు పలచన చేసిన ఆవుపాలు ఇవ్వడాన్ని గమనించానని చెప్పారు. ఇలాంటి అంశాల విషయంలో సమాజం, ప్రకటన తయారీదారుల మైండ్‌సెట్ మారాలని సూచించారు. అయితే మీడియా, అడ్వర్టైజ్‌మెంట్ రంగాల వారు ఇలాంటి అంశంపై చర్చించడం ఆహ్వానించదగ్గ పరిణామమని ఐఏఏను గవర్నర్ ప్రశంసించారు. సమాజంలో మహిళలు అన్ని విషయాల్లోనూ పురుషుల కంటే 10 రెట్లు ఎక్కువ కష్టపడాల్సి వస్తోందని... ఈ పరిస్థితిలో మార్పు రావాలన్నారు.

'నిర్భయ' తరువాత కొంత మార్పు..

ప్రకటనలు, సినిమాలు, ఇతర కంటెంట్‌లలో స్టీరియోటైపింగ్ నిర్భయ ఘటన తర్వాత మారిందని, బాధితుల పేర్లు ప్రస్తావించకపోవడం మొదలుకొని, వారినే దోషులుగా చూపడం వరకూ మీడియా సంయమనంతో వ్యవహరిస్తోందని పాపులేషన్ ఫస్ట్ డైరెక్టర్ డాక్టర్ ఏఎల్ శారద తెలిపారు. డిజిటల్ మాధ్యమం కారణంగా మహిళల అంశాలపై వివరంగా చర్చించే అవకాశం లభిస్తోందన్నారు. యునిసెఫ్ ఇండియా ప్రతినిధి, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్స్ నిపుణురాలు గీతాంజలి మాస్టర్ మాట్లాడుతూ ప్రకటనల్లో లింగవివక్ష, స్టీరియోటైపింగ్‌లపై యూనిసెఫ్ జరిపిన పరిశోధన వివరాలను వెల్లడించారు. సమావేశంలో యాక్సెంచర్ మేనేజింగ్ డైరెక్టర్ చారులత రవికుమార్ 'రెస్పాన్సిబుల్ కమ్యూనికేషన్'అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఏఏ ఇండియా చాప్టర్ అధ్యక్షుడు అవినాశ్ పాండే, ఐఏఏ విమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ నీనా ఎలవియా జైపూరియా, 'సాక్షి'(కార్పొరేట్ కమ్యూనికేషన్స్) డైరెక్టర్ రాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. 'జెండర్ కాన్షస్ అండ్ పర్పస్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్''జెండర్ కాన్షస్ క్రియేటివిటీ ఇన్ కమ్యూనికేషన్స్', 'కాన్షస్ క్రియేటివిటీ ఇన్ ఫిల్మ్స్, ఓటీటీ, అండ్ అడ్వర్టైజింగ్'అంశాలపై ప్యానెల్ డిస్కషన్ నడిచింది. యాంకర్ స్వప్న సమన్వయకర్తగా వ్యవహరించగా సినీనటుడు అవసరాల శ్రీనివాస్, దర్శకురాలు నందినీరెడ్డి, వైద్యురాలు ప్రణతిరెడ్డి, ఐపీఎస్ అధికారిణి శిఖా గోయెల్ తదితరులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. కాస్మోస్ మాయా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మేఘ తాత ఒక ప్యానెల్ డిస్కషన్‌కు సమన్వయకర్తగా వ్యవహరించారు.



జన్యుమార్పిడి ఆహారంతో ముప్పు

ఉద్యమానికి సిద్ధమవుతున్న ప్రజాసంఘాలు

సాక్షి, హైదరాబాద్: జన్యుమార్పిడి ఆహార పంటలతో పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి, ప్రజారోగ్యానికి కూడా ముప్పు పొంచి ఉందని ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంఘాలు హెచ్చరించాయి. ఈ దశలోనే అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరాయి. ఈ అంశంపై శుక్రవారం జూమ్ ద్వారా జరిగిన సదస్సుకు రైతు స్వరాజ్యవేదిక నేత విస్సా కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ నెల 9న జాతీయ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా జన్యుమార్పిడికి వ్యతిరేకంగా సమష్టిగా ఉద్యమించనున్నట్లు తెలిపారు. ఆశా, కిసాన్ స్వరాజ్ జాతీయ కన్వీనర్ కురుగంటి కవిత ప్రధాన మాట్లాడుతూ.. బ్యాక్టీరియాలకు చెందిన 3 జన్యువులను ఆవాల పంటలోకి ప్రవేశపెట్టి కలుపు మందును తట్టుకునేలా రూపొందించారని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు ఉండగానే.. ఈ పంట సాగుకు కేంద్రం అనుమతించడం తగదన్నారు. ఈ వంగడం కన్నా ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ ఆవ రకాలు అందుబాటులో ఉన్నప్పటికీ జన్యుమార్పిడి ఆవను అనుమతించటం ప్రమాదకరమని హెచ్చరించారు. సమావేశంలో అఖిల భారత రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు రావెల వెంకయ్య, ఐసీఏఆర్ సొసైటీ సభ్యుడు, సీసీఎంబీ మాజీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏపీ రావు, జనవిజ్ఞాన వేదిక నేత ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నగుమోతు వేణుగోపాలరావు మాట్లాడారు.

గ్రామాల్లో వైద్యసేవలు అందించాల్సిందే..

పీజీ విద్యార్థులకు తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: పోస్ట్‌గ్రాడ్యుయేట్ వైద్యవిద్యార్థులు ఏడాదిపాటు గ్రామాల్లో సేవలందించాల్సిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఆగస్టులో నోటిఫికేషన్ ఇవ్వగా తమకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ డాక్టర్ అభినవ్ సింగాలాతోపాటు పలువురు పీజీ విద్యార్థులు కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనల అనంతరం మెడికల్ సర్వీస్ చేయాల్సిందేనని తీర్పు చెబుతూ పిటిషన్‌ను కొట్టివేశారు.

మేఘం నుంచి భూమి వరకు..

- ఐఐటీహెచ్‌లో వర్షపుచినుకు పరిశోధన కేంద్రం ఏర్పాటు
- ప్రారంభించిన నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్
- మరింత కచ్చితత్వంతో వర్షపాతం అంచనాకు వీలు



రెయిన్‌డ్రాప్ రీసెర్చ్ ఫెసిలిటీ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా మరింత కచ్చితత్వంతో వర్షపాతాన్ని అంచనా వేసేందుకు వీలుగా వర్షపు చినుకు (నీటి బిందువుల)ల పరిణామక్రమంపై పరిశోధనలకు హైదరాబాద్ ఐఐటీ శ్రీకారం చుట్టింది. మేఘం నుంచి భూమికి చేరే వరకు వివిధ ఎత్తుల్లో వర్షపు చినుకు ఆకారం, మారుతున్న తీరునుబట్టి వర్షపాతం అంచనాకు ఐఐటీలోని కెమికల్ ఇంజనీరింగ్ విభాగం రెయిన్‌డ్రాప్ రీసెర్చ్ ఫెసిలిటీ (ఆర్ఆర్ఎఫ్)ని ఏర్పాటు చేసింది. ఇందుకోసం మెషీన్ లెర్నింగ్ ఆధారిత డిజిటల్ ఇన్‌లైన్ హోలోగ్రఫీ పరిజ్ఞానాన్ని వినియోగించనుంది. ఈ కేంద్రాన్ని నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ వీకే సారస్వత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు చినుకులు ఏర్పడటం వెనకున్న ప్రక్రియలను అర్థం చేసుకోవడంతోపాటు పర్యావరణం, వాతావరణ మార్పులపై దాని ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అలాగే వర్షాలు కురవడంలో తేమ, ఉష్ణోగ్రతల పాత్ర, మబ్బుల నిర్మాణం, ఒక ప్రాంతంలో కురవబోయే వర్షం పరిమాణం వంటి అంశాలను తెలుసుకొనేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీహెచ్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ప్రొఫెసర్ కీర్తి సాహు, మెకానికల్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మణ దొర చంద్రాల, పరిశోధన విభాగం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ వీకే సారస్వత్, చిత్రంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్.మూర్తి.

కొత్త ట్రిబ్యునల్‌పై సలహాకు అటార్నీ జనరల్ నో!

- కృష్ణా జలాల పంపిణీ కోసం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుకు తెలంగాణ డిమాండ్
- సొలిసిటర్ జనరల్ అభిప్రాయాన్ని కోరిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి అంతరాష్ట్ర నదీ వివాదాల చట్టం (ఐఎస్ఆర్‌డబ్ల్యూటీ)-1956లోని సెక్షన్-3 ప్రకారం కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలా? వద్దా? అనే అంశంపై అభిప్రాయాన్ని వెల్లడించడానికి అటార్నీ జనరల్ (ఏజీ) వెంకటరమణి నిరాకరించారు. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీకి సెక్షన్-3 కింద కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం చాలా కాలంగా కోరుతోంది. ఈ అంశంపై అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని కేంద్ర జలశక్తి శాఖ కోరింది. అయితే ఏపీ తరఫున పలు కేసుల్లో తాను వాదించిన నేపథ్యంలో తన అభిప్రాయాన్ని చెప్పలేనని ఆయన స్పష్టం చేశారు. దీంతో జలశక్తి శాఖ శుక్రవారం సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మోహతా అభిప్రాయాన్ని కోరింది. నెల రోజుల్లో కేంద్రం దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.